www.andhrajyothy.com
విజయవాడ సిటీ**


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 52

శనివారం | 7-6-2025

శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: ద్వాదశి పూర్తి, నక్షత్రం: చిత్ర ఉ.9.40 తదుపరి స్వాతి, వర్జ్యం:మ.3.58-5.46, దుర్ముహూర్తం: ఉ.5.43-7.27, అమృతఘడియలు: రా.2.47-4.35, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.44

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


చినాబ్ వంతెనపై వెళ్తున్న వందేభారత్ రైలు

ఆర్బీఐ డబుల్ బొనాంజా

రెపో, సీఆర్ఆర్‌లో భారీ కోత

ఇక రుణాలు మరింత చౌక!

తగ్గనున్న ఈఎంఐల భారం

వడ్డీ రేట్లు తగ్గించిన పీఎన్‌బీ, బీఓఐ

11



భాయీ భాయీ.. బాహాబాహీ

బీటలు వారిన ట్రంప్-మస్క్ స్నేహబంధం

మస్క్‌కు ఇచ్చిన కాంట్రాక్టులు రద్దు చేస్తా: ట్రంప్

నాసాకు స్పేస్‌ఎక్స్ సేవలు నిలిపేస్తా: మస్క్

బాలలపై లైంగిక వేధింపుల ఆరోపణలున్న వ్యక్తితో ట్రంప్ వీడియో విడుదల చేసిన మస్క్

మస్క్‌ను బుర్ర లేని వ్యక్తిగా అభివర్ణించిన ట్రంప్

2

ట్రంప్ నిర్ణయానికి కోర్టు బ్రేక్

హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల ప్రవేశాలపై ఆంక్షలు తాత్కాలికంగా నిలిపివేత

11

స్టార్‌లింక్‌కు గ్రీన్‌సిగ్నల్

భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు ఆరంభించేందుకు లైసెన్స్ మంజూరు

11

మట్టి మేత

ప్రజాప్రతినిధుల గుప్పిట్లో గ్రావెల్

బిల్డింగ్, రోడ్ మెటల్ మైన్ లీజులూ

ఎక్కడికక్కడ సహజ వనరులు బ్లాక్

కృత్రిమ కొరత సృష్టించి సొమ్ము

సామాన్యులతో పాటు ప్రభుత్వ ప్రాజెక్టులకూ ఇబ్బందులు

ఇలా అయితే అమరావతి పనులెలా?

గ్రావెల్, రోడ్‌మెటల్‌కు గడ్డు పరిస్థితులు

ముందే దృష్టి సారించని సర్కారు



సామాన్యుడి నుంచి సంపన్నుడి వరకు.. రోడ్లు, ప్రభుత్వ, ప్రైవేటు ప్రాజెక్టుల నుంచి అమరావతి నిర్మాణ పనుల వరకు.. ఇసుక, సిమెంట్‌తో పాటు గ్రావెల్, బిల్డింగ్, రోడ్ మెటల్ (రాయి, కంకర) అవసరం. అయితే రాష్ట్రంలో గ్రావెల్, బిల్డింగ్, రోడ్ మెటల్ మైన్ లీజులను కొందరు ప్రజా ప్రతినిధులు, వారి అనుచరులు తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. కృత్రిమ కొరతను సృష్టించి ధరలు అమాంతం పెంచేసి సొమ్ము చేసుకుంటున్నారు.

అమరావతి నిర్మాణ పనులకు అవసరమైనంత గ్రావెల్ గుంటూరు జిల్లాలో లేదు. దీంతో పొరుగున ఉన్న ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వనరులపై ఆధారపడక తప్పని పరిస్థితి. అయితే అక్కడ కొందరు ప్రజాప్రతినిధులు గ్రావెల్ లీజులను హస్తగతం చేసుకున్నారు. వారి ఆజ్ఞ లేకుండా మట్టి రేణువు కూడా కదలని పరిస్థితి.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో రాష్ట్రంలో ఇసుక కష్టాలు అన్నీ ఇన్నీ కావు. నేతలకు కాసులు కురిపించే వనరుగా మారి.. సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. ప్రస్తుతం ఇసుకతో పాటు మట్టి, బిల్డింగ్ మెటల్, రోడ్ మెటల్, ఇతర సూక్ష్మ ఖనిజాలు సైతం బంగారమైపోయాయి. ఏ నిర్మాణం జరగాలన్నా ఇవి తప్పనిసరి. ముఖ్యంగా రహదారి పనులు, ఇతర మౌలిక వనరుల ప్రాజెక్టుల నిర్మాణానికి ఇవే కీలకం. ప్రభుత్వ ప్రాజెక్టులకు, ప్రజలకు ఏది అవసరమో చూసుకోకుండా ప్రభుత్వం తన పనులు చేసుకుంటూ పోతోంది. డిమాండ్‌ను గుర్తించిన కొందరు ప్రజాప్రతినిధులు వాటిపై కన్నేశారు. అంతే..

మిగతా 14వ పేజీలో...

ఇక ఏటా డీఎస్సీ

టీచర్ పోస్టుల భర్తీతో విద్యా ప్రమాణాలు మెరుగు

నూరుశాతం అక్షరాస్యతకు 'అక్షర ఆంధ్ర' ప్రాజెక్టు

నాలుగేళ్లలో ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ సాధనే లక్ష్యం

వర్సిటీలకు ఏకీకృత చట్టం: మంత్రి లోకేశ్ ఆదేశం


విద్యా శాఖ సమీక్షలో మంత్రి లోకేశ్, ఉన్నతాధికారులు

14

మెగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

మొదటి రోజు 21,89౩మంది హాజరు

ఉదయం 88.6౩ , మధ్యాహ్నం 86.%

చినాబ్ నదిపై ఇంజనీరింగ్ అద్భుతం



ప్రపంచంలోనే ఎత్తైన వంతెనను ప్రారంభించిన మోదీ

అనంతరం త్రివర్ణ పతాకంతో వంతెనపై ప్రధాని నడక

దేశంలోనే తొలి కేబుల్ రైలు వంతెన కూడా ప్రారంభం

ఎవరెన్ని కుట్రలు చేసినా కశ్మీరులో అభివృద్ధిని ఆపలేరు

పొరుగు దేశం మానవత్వానికి వ్యతిరేకం: మోదీ

రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానమైన కశ్మీరు

2


నీతి ఆయోగ్ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఆర్థిక శక్తిగా విశాఖి!

8 జిల్లాలతో ఎకనామిక్ రీజియన్: సీఎం

2032 నాటికి 120 బిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దాలి

ఆంధ్రా వృద్ధి ఇంజన్‌గా అభివృద్ధి చేయాలి

24 లక్షల ఉద్యోగాల కల్పన టార్గెట్

6 పోర్టులు, 7 ఉత్పాదక కేంద్రాల నిర్మాణం

రాష్ట్ర విజన్ సాకారానికి సహకరించండి

నీతి ఆయోగ్ అధికారులకు బాబు వినతి

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడేళ్లలో విశాఖపట్నాన్ని ప్రధాన ఆర్థిక శక్తిగా మలిచే ప్రతిష్ఠాత్మక రోడ్‌మ్యాప్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఉత్తరాంధ్రలోని ఎనిమిది జిల్లాలను కలిపి 'విశాఖ ఎకనావిక్ రీజియన్'గా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ వృద్ధి ఇంజన్‌గా తీర్చిదిద్దాలన్నారు. 2032 నాటికి ఈ రీజియన్‌ను 120 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా

మిగతా 13వ పేజీలో...

పంటకాలం ముందుకు!

తుఫాన్ల ముప్పు తప్పించాలి

కృష్ణా-గోదావరి డెల్టాకు నీళ్లివ్వండి: సీఎం



ఇజ్రాయెల్ దాడులతో శిథిలాల గుట్టలుగా మిగిలిన గాజా

పార్లే-జి బిస్కెట్‌కు రూ.2,400

» ఉల్లి కిలో 4 వేలకు పైనే.. గాజాలో తీవ్ర ఆహార కొరత!

న్యూఢిల్లీ, జూన్ 6: యుద్ధ వాతావరణం నేపథ్యంలో గాజాలో తీవ్ర ఆహార కొరత నెలకొంది. నిత్యావసరాల ధరలు చుక్కలను తాకుతున్నాయి. మన దేశంలో రూ. 5కు దొరికే పార్లే-జి బిస్కెట్.. గాజాలో సుమారు రూ. 2,400కు అమ్ముతున్నారు. ఇది అక్కడి తీవ్ర ఆహార కొరతకు, ధరల మంటకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. దీనికి సంబంధించి గాజాకు చెందిన ఓ వ్యక్తి సోషల్‌మీడియాలో ఇటీవల పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. "చాలా కాలం ఎదురు చూసిన తర్వాత ఎట్టకేలకు ఈ రోజు కుమార్తె రఫీఫ్‌కు ఇష్టమైన పార్లే-జి బిస్కెట్లు కొన్నాను. గతంలో 1.5(రూ. 147) యూరోలు ఉండే దీని రేటు 24(రూ. 2,345)యూరోలకు పెరిగినా, ఆమెకు ఇష్టమైన దానిని కాదనలేకపోయాను" అంటూ ఆ పోస్టులో ఆ వ్యక్తి పేర్కొన్నాడు. ఇక 2023 అక్టోబర్ నుంచి ఉద్రిక్తతలు పెరిగిన తర్వాత నుంచి ఇజ్రాయెల్ గాజాకు ఆహార సరఫరాను క్రమంగా తగ్గిస్తూ వస్తోంది. ఈ ఏడాది మార్చి 2 నుంచి మే 19 మధ్య అయితే పూర్తిగా నిలిపివేసింది. అంతర్జాతీయంగా వస్తున్న ఒత్తిడి నేపథ్యంలో సహాయక సామగ్రితో కూడిన కొన్ని ట్రక్కులకు మాత్రమే అనుమతి ఇస్తోంది. ఒక్క బిస్కెట్ల ప్యాకెట్లే కాకుండా నిత్యావసర సరుకుల ధరలు కూడా మండిపోతున్నాయని ఎన్‌డీటీవీ కథనం తెలిపింది. ఉత్తర గాజాలో కిలో చక్కెర రూ. 4,914, కిలో వంట నూనె రూ. 4,177, కిలో బంగాళాదుంపలు రూ. 1,965, కిలో ఉల్లిపాయలు రూ.4,423, కప్పు కాఫీ రూ.1,800కు అమ్ముతున్నారని వెల్లడించింది.

వచ్చే ఏడాది ఏప్రిల్‌లో బంగ్లాదేశ్ ఎన్నికలు

ఢాకా, జూన్ 6: బంగ్లాదేశ్‌లో జాతీయ ఎన్నికలు నిర్వహించాలంటూ ప్రజల నుంచి వచ్చిన ఒత్తిళ్లకు తాత్కాలిక ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ యూనస్ తలొగ్గారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగుతాయని శుక్రవారం ఆయన ప్రకటించారు. ఇందుకు సంబంధించిన మార్గసూచీని ఎన్నికల సంఘం వెల్లడిస్తుందని తెలిపారు. ప్రధానిగా హసీనా బేగంను పదవీచ్యుతి చేసిన అనంతరం బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం తాత్కాలిక ప్రభుత్వం నడుస్తోంది.

ఆగస్టు 3న నీట్-పీజీ.. ఒకే షిఫ్టులో నిర్వహణ

» ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష

» ఒకే షిఫ్ట్‌లో నిర్వహణకు ఎన్‌బీఈకి సుప్రీం అనుమతి

న్యూఢిల్లీ, జూన్ 6: దేశవ్యాప్తంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ స్థాయి అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్-పీజీ 2025)ను ఆగస్టు 3న ఒకే షిఫ్ట్‌లో నిర్వహించడానికి సుప్రీంకోర్టు శుక్రవారం అనుమతించింది. ఈ మేరకు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. పరీక్ష నిర్వహణ కోసం నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ (ఎన్‌బీఈ) 2నెలల గడువు కోరడాన్ని తొలుత ప్రశ్నించిన ధర్మాసనం.. బోర్డు విజ్ఞప్తి నిజాయితీగా ఉందని అభిప్రాయపడింది. అయితే నీట్-పీజీ 2025 నిర్వహణకు ఎన్‌బీఈకి ఇకపై సమయం ఇవ్వబోమని స్పష్టం చేసింది. ఎన్‌బీఈ తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ వాదనలు వినిపిస్తూ.. దేశవ్యాప్తంగా జరిగే ఈ పరీక్షకు చిన్న లోపం కూడా లేకుండా ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. మొత్తం 2,42,679 మంది అభ్యర్థులకు ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించడానికి దాదాపు 1,000కి పైగా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందని విన్నవించారు. ఈ నేపథ్యంలో జూన్ 15న జరగాల్సిన పరీక్షను ఆగస్టు 3న నిర్వహించడానికి అనుమతించాలని అభ్యర్థించారు.

నీట్-యూజీ ఫలితాల విడుదలకు మార్గం సుగమం

చెన్నై, జూన్ 6: నీట్-యూజీ 2025 పరీక్ష ఫలితాల విడుదలకు మార్గం సుగమమైంది. ఫలితాలు ప్రకటించకుండా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని నిరోధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను మద్రాస్ హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర యూజీ వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 4న నీట్ యూజీ పరీక్షను నిర్వహించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో చెన్నైలోని నాలుగు కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందిపడిన తమకు మళ్లీ పరీక్ష నిర్వహించేలా ఎన్‌టీఏను ఆదేశించాలని కోరుతూ ఎస్ సాయిప్రియ, మరో 15మంది విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలను విచారించిన మద్రాసు హైకోర్టు... దాదాపు 22లక్షల మంది విద్యార్థులు నీట్-యూజీ రాశారని, చిన్నచిన్న కారణాలతో మరోసారి పరీక్ష నిర్వహణకు అనుమతిస్తే 20లక్షల మందికి పైగా అభ్యర్థులపై ప్రభావం పడుతుందని పేర్కొంది. పరీక్షను మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య నిర్వహించారని, ఆ సమయంలో విద్యుత్తు లేకపోయినా సహజంగా వెలుతురుగానే ఉంటుందని అడిషనల్ సొలిసిటర్ జనరల్ చేసిన వాదనలతో ఏకీభవించింది.

రాజ్యసభకు కమల్ నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న కమల్, చిత్రంలో స్టాలిన్, ఉదయనిధి

చెన్నై, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు, 'మక్కల్ నీది మయ్యం' అధినేత కమల్ హాసన్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి వెంట రాగా, కమల్ నామినేషన్ పత్రాలను శుక్రవారం చెన్నైలో ఎన్నికల అధికారికి అందించారు. గత పార్లమెంటు ఎన్నికల సమయంలో తమ కూటమికి మద్దతు ప్రకటించిన కమల్‌కు రాజ్యసభ స్థానం ఇస్తామని ప్రకటించిన స్టాలిన్.. ఆ మేరకు అవకాశం కల్పించారు. త్వరలో తమిళనాడు నుంచి ఆరు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానుండగా, అసెంబ్లీలో బలాబలాలను బట్టి డీఎంకేకు 4, అన్నాడీఎంకే 2 స్థానాలు ఖాయమైంది. దీంతో డీఎంకే నుంచి కమల్‌తో పాటు సిట్టింగ్ రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది పి.విల్సన్, కవయిత్రి సల్మా, సీనియర్ నేత ఎస్ఆర్ శివలింగం, అన్నాడీఎంకే తరఫు నుంచి న్యాయవాది ఇన్బదురై, మాజీ ఎమ్మెల్యే ధనపాల్ నామినేషన్లు దాఖలు చేశారు. వీరంతా ఏకగ్రీవంగా ఎన్నికవడం దాదాపు ఖాయమైనట్టే.

గెలిచిన చోటల్లా 50% పరిమితి ఎత్తేస్తాం: రాహుల్

రాజ్‌గిర్, జూన్ 6: దేశంలో ఎక్కడ అధికారంలోకి వచ్చినా ఆయా రాష్ట్రాల్లో రిజర్వేషన్లపై 50% పరిమితిని ఎత్తివేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పారు. దేశంలో అణగారిన వర్గాలు 90% ఉంటే రిజర్వేషన్లపై 50% పరిమితి విధించాలనే ఆలోచన ఎలా వచ్చిందో తనకు ఆశ్చర్యం వేస్తుందన్నారు. రిజర్వేషన్లపై 50% పరిమితి అనే అడ్డుగోడను తొలగించాలంటే కుల గణనే తొలి అడుగని చెప్పారు. కుల గణన చేయడం ద్వారా తాము అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణలో ఈ అడ్డుగోడను తొలగించామన్నారు.

చినాబ్ నదిపై

ఇంజనీరింగ్ అద్భుతం


ప్రపంచంలోనే ఎత్తయిన రైలు బ్రిడ్జి ప్రారంభించిన ప్రధాని మోదీ

» కశ్మీరులో అభివృద్ధిని ఎవరూ ఆపలేరు

» మత ఘర్షణలకే పహల్గాం ఉగ్రదాడి

» చినాబ్ వంతెన.. భారత ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీక: ప్రధాని మోదీ

» బ్రిటిషర్లు చేయలేని పనిని మోదీ సర్కారు పూర్తి చేసింది: ఒమర్ అబ్దుల్లా





చినాబ్ వంతెనపై వందేభారత్ రైలును ప్రారంభిస్తున్న మోదీ, కశ్మీర్ సీఎం ఒమర్

కత్రా, జూన్ 6: జమ్మూకశ్మీరులో చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే ఎత్తయిన రైల్వే ఉక్కు వంతెనను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ బ్రిడ్జిని రూ.1,486 కోట్ల వ్యయంతో ఎనిమిదేళ్లపాటు శ్రమించి, నిర్మించారు. అత్యంత దుర్లభమైన శివాలిక్, పీర్ పంజాల్ పర్వత శ్రేణులను కలుపుతూ కశ్మీర్ లోయకు రైలును నడపాలన్న బ్రిటిష్ కాలం నాటి ప్రణాళిక దాదాపు శతాబ్దకాలం తర్వాత కార్యరూపం దాల్చింది. భారతదేశ ఇంజనీరింగ్ అద్భుతంగా పేర్కొంటున్న ఈ బ్రిడ్జిని శుక్రవారం మోదీ ప్రారంభించారు. త్రివర్ణ పతాకాన్ని పట్టుకొని మోదీ ఈ అద్భుత వంతెనపై నడిచారు. కత్రా నుంచి కశ్మీరుకు వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభించడంతో వంతెన అందుబాటులోకి వచ్చినట్లయింది. అలాగే అంజి నదిపై నిర్మించిన దేశంలోనే తొలి కేబుల్ రైలు వంతెనను కూడా మోదీ ప్రారంభించారు. దీంతో పాటు త్రికూట పర్వతాల్లోని వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే యాత్రికులకు బేస్ క్యాంపు అయిన కత్రాలో రూ.46 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ప్రధాని జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఉధంపూర్‌లోని వైమానిక కేంద్రంలో దిగిన మోదీ.. వంతెన ప్రారంభానికి ముందు దాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చినాబ్, అంజి వంతెనలపై పరుగులు తీసిన వందే భారత్ రైలులో మోదీ ప్రయాణించారు. అనంతరం కత్రాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. చినాబ్ వంతెన ప్రారంభోత్సవం జమ్మూకశ్మీర్ అభివృద్ధికి ప్రతిబింబమని చెప్పారు. ఉధంపూర్- శ్రీనగర్- బారాముల్లా రైలు లింకు (యూఎస్‌బీఆర్ఎల్) ప్రాజెక్టు నవీన, సాధికార జమ్మూకశ్మీరుకు సంకేతమని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తవడంతో దేశంలోని అన్ని ప్రాంతాలతో కశ్మీరుకు రైలు అనుసంధానం ఏర్పడిందన్నారు.

కశ్మీరులో అభివృద్ధిని ఎవరూ ఆపలేరు..

ఎవరెన్ని కుట్రలు పన్నినా కశ్మీరులో అభివృద్ధిని ఆపలేరని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావించారు. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పామన్నారు. "మన పొరుగు దేశం పర్యాటకానికి, మానవత్వానికి వ్యతిరేకం. మన పర్యాటకాన్ని దెబ్బతీసి, పేదల పొట్టగొట్టాలని చూస్తోంది. ఆదిల్ హుస్సేన్ గుర్రం మీద పర్యాటకులను తీసుకెళ్లే పోనీవాలా. కష్టపడి తన కుటుంబాన్ని పోషించుకునే ఆదిల్ ఆ రోజు (ఏప్రిల్ 22న) ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడాడు. అతడ్ని కూడా ముష్కరులు చంపేశారు. ఉగ్రవాదంపై పోరులో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. పాక్ ఉగ్ర కుట్రలకు దీటుగా బదులిస్తున్నాం. కశ్మీరులో పర్యాటకాన్ని నాశనం చేయాలని, దేశంలో మత ఘర్షణలు సృష్టించాలనే ఉగ్రవాదులు పహల్గాంలో దాడికి పాల్పడ్డారు. ఆపరేషన్ సిందూర్‌తో మన సత్తా ఏంటో వారికి చూపించాం" అని మోదీ పునరుద్ఘాటించారు.

చినాబ్ వంతెన.. ఒమర్ చిన్ననాటి కల

"ఈఫిల్ టవర్ కన్నా ఎత్తయిన వంతెనను నిర్మించుకున్నాం. భారత ఇంజనీరింగ్ నైపుణ్యానికి చినాబ్ బ్రిడ్జి నిలువెత్తు నిదర్శనం. ఈ వంతెన నిర్మాణంతో ఈ ప్రాంతం పర్యాటక ఆకర్షణగానూ నిలుస్తుంది. ఎన్నో సవాళ్లు ఎదురైనా మాతా వైష్ణోదేవి ఆశీర్వాదంతో విజయవంతంగా బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశాం. ఈ రోజు భారత రైల్వే నెట్‌వర్క్‌తో కశ్మీర్ కూడా అనుసంధానమైంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి.. అనేమాట నిజమైంది. ఈ రోజు కోసం అనేక తరాలు ఎదురుచూశాయి. సీఎం ఒమర్ అబ్దుల్లా కూడా 8వ తరగతి నుంచే ఈ ప్రాజెక్ట్ కోసం కలలు కన్నారు" అని మోదీ తెలిపారు. ఇదే సభలో జమ్మూకశ్మీరు సీఎం ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. కశ్మీరుకు ప్రత్యేక రాష్ట్ర హోదా అంశాన్ని తనదైన శైలిలో ప్రస్తావించారు. చతురతతో ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాని మోదీ తనను త్వరలోనే ప్రమోట్ చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. "2014లో మీరు తొలిసారి ప్రధాని హోదాలో ఇక్కడికి వచ్చినప్పుడు నేను రాష్ట్రానికి సీఎంగా ఉన్నా. ఆ తర్వాత మీరు వరసగా గెలిచి ప్రధానిగా ఉన్నారు. నేను ఇప్పుడు కేంద్రపాలిత ప్రాంత సీఎంగా డిమోట్ అయ్యాను. అప్పుడు రైల్వే శాఖ సహాయమంత్రిగా ఉన్న మనోజ్ సిన్హాకు లెఫ్టినెంట్ గవర్నర్‌గా పదోన్నతి వచ్చింది. త్వరలో నాక్కూడా ప్రమోషన్ వస్తుందని ఆశిస్తున్నా. జమ్మూకశ్మీరుకు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి ఎక్కువ సమయం పట్టదనుకుంటున్నా" అని ఒమర్ పేర్కొన్నారు. తాను 8వ తరగతిలో ఉన్నప్పుడు చినాబ్ రైలు వంతెన గురించి కలలు కన్నానని.. ఇప్పుడు తనకు 55 ఏళ్లని, తన పిల్లలు కూడా కాలేజీ చదువు పూర్తి చేశారని ఒమర్ చెప్పారు. బ్రిటిషర్లు కూడా పూర్తి చేయలేకపోయిన ఈ ప్రాజెక్టును ఎట్టకేలకు మోదీ సర్కారు పూర్తి చేసిందని కొనియాడారు.

చినాబ్ వంతెన ప్రత్యేకతలివీ..

చినాబ్ నదీ గర్భం నుంచి 359 మీటర్ల ఎత్తులో ఈ రైలు ఆర్చి వంతెనను నిర్మించారు. దీని పొడవు 1.315 కిలోమీటర్లు. ఇప్పటివరకు చైనాలో ఉన్న షుబాయ్ రైల్వే వంతెన (275 మీటర్ల ఎత్తు) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును చినాబ్ వంతెన అధిగమించింది. పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 35 మీటర్లు ఎక్కువ. అతి వేగమైన గాలులు, భూకంపాలు, వరదలు, బాంబు పేలుళ్లను సైతం తట్టుకునేలా అత్యాధునిక సాంకేతికతతో ఈ బ్రిడ్జిని నిర్మించారు. దీని ప్రారంభంతో జమ్మూ నుంచి శ్రీనగర్‌కు ప్రయాణ సమయం దాదాపు 2-3 గంటలు తగ్గనుంది. ఈ వంతెన జీవితకాలం 120 ఏళ్లని ఇంజనీర్లు చెబుతున్నారు. దీనిపై గరిష్ఠంగా 100 కి.మీ. వేగంతో రైలు ప్రయాణించవచ్చు. ఈ వంతెన నిర్మాణంలో భాగంగా 600 కిలోమీటర్ల స్టీల్ వెల్డింగ్‌ను వినియోగించారు. ఇది ఢిల్లీ-జమ్మూ మధ్య రైల్వే మార్గం పొడవుతో సమానం. 2002లో అటల్ బిహారీ వాజ్‌పేయీ హయాంలో ఈ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేయగా.. 23 ఏళ్ల తర్వాత ఇది పూర్తయింది. వంతెనకు సంబంధించిన ఆసక్తికర విషయాలను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

లోకం తీరు



యాక్సిడెంట్ బాధితులకు రూ.1.50లక్షల వరకు వైద్యం ఫ్రీ

» ప్రమాదం జరిగిన 24 గంటల్లోగా ఆస్పత్రిలో చేరినవారు అర్హులు

» ఆయుష్మాన్ భారత్ వర్తించే ఆస్పత్రులన్నింటిలో పథకం అమలు

న్యూఢిల్లీ, జూన్ 6: రోడ్డు ప్రమాదంలో గాయపడినవారికి రూ.1.50లక్షల నగదురహిత(క్యాష్ లెస్) చికిత్స అందించడానికి వీలుగా కేంద్రప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. మోటారు వాహనాల చట్టం-1988లోని సెక్షన్ 162కింద ఈ గెజిట్‌ను విడుదల చేసింది. ప్రమాదం జరిగిన 24గంటల్లోగా ఆసుపత్రిలో చేరినవారు ఈ పథకానికి అర్హులు. అయితే, ప్రమాదం నిజమా.. కాదా.. అన్నది స్థానిక పోలీసులు యాక్సిడెంట్ జరిగిన 24గంటల్లోగా గుర్తించి ఆసుపత్రికి తెలియజేయాలి. లేకపోతే, కవరేజీ లభించదు. ఒకవేళ బాధితులు ప్రాణాపాయ స్థితిలో ఉంటే మాత్రం చికిత్స అందిస్తారు. రోడ్డు ప్రమాద బాధితులకు ఈ పథకం కింద నగదు రహితంగా ఏడు రోజుల వరకు చికిత్స అందజేస్తారు. ఆయుష్మాన్ భారత్ పీఎం-జన్ ఆరోగ్య యోజన అమలయ్యే, నేషనల్ హెల్త్ అథారిటీ(ఎన్‌హెచ్ఏ) నోటిఫై చేసిన ఆసుపత్రుల్లో ఈ పథకం అమలు అవుతుంది. ఒకవేళ బాధితులను యాక్సిడెంట్ ప్రదేశం నుంచి సమీపంలోని వేరే ఆస్పత్రులకు తరలిస్తే.. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి ఆ తర్వాత.. ఈ పథకం అమలయ్యే ఆసుపత్రులకు పంపించవచ్చు. రోడ్డు ప్రమాద బాధితులకు చికిత్స అందించే ఆసుపత్రులు ఆ వివరాలను ఆయా స్టేట్ హెల్త్ ఏజెన్సీ(ఎస్‌హెచ్ఏ)ల ఆమోదానికి పంపించాల్సి ఉంటుంది. కాగా, యాక్సిడెంట్ గురించి సమాచారం ఇవ్వాలనుకున్నవారు 112 నంబర్‌కు కాల్ చేయాలి. లేకపోతే ఈడీఏఆర్ మొబైల్ యాప్ ద్వారా సమాచారం ఇవ్వొచ్చు. చికిత్స సమయంలో బాధితుడు చనిపోతే హాస్పిటల్‌కు రీయింబర్స్‌మెంట్ వస్తుంది.

జీ-7 సదస్సుకు రావాలని మోదీకి కెనడా ప్రధాని ఆహ్వానం

న్యూఢిల్లీ, జూన్ 6: జీ-7 దేశాల శిఖరాగ్ర సదస్సుకు భారత్‌కు ఆహ్వానం అందింది. కెనడా కొత్త ప్రధాని మార్క్ కెర్నీ ప్రధాని మోదీకి ఫోన్ చేసి సదస్సుకు హాజరుకావాలని ఆహ్వానించారు. కెనడాలో జరిగే జీ-7 సదస్సుకు హాజరవుతున్నానని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా తెలిపారు. కొత్తగా ఎన్నికైన సందర్భంగా కెర్నీకి శుభాకాంక్షలు తెలిపారు. కెర్నీతో సమావేశమయ్యేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నానంటూ మోదీ పోస్ట్‌లో రాశారు. తనను ఆహ్వానించినందుకు ధన్యవాదాలు చెప్పారు. ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, అమెరికా, యూకే, జపాన్, కెనడా దేశాలు జీ-7గా ఏర్పడ్డాయి. ఈ నెల 15 నుంచి 17 వరకు కెనడాలోని ఆల్బెర్టాలో జీ-7 సదస్సు జరగనుంది.

అధికారికంగా భరతమాత చిత్రమేదీ లేదు: కేరళ

తిరువనంతపురం, జూన్ 6: ప్రభుత్వ కార్యక్రమాల్లో భారతమాత చిత్రాన్ని అనుమతించబోమని శుక్రవారం కేరళ ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాంటి చిత్రానికి రాజ్యాంగం ద్వారాగానీ, భారత ప్రభుత్వం ద్వారాగానీ ఎలాంటి గుర్తింపు లేదని తెలిపింది. అందుకే పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భారతమాత చిత్రం వినియోగించడాన్ని అంగీకరించలేదని పేర్కొంది. ఆ చిత్రం పెట్టినందుకు నిరసనగా రాష్ట్ర వ్యవసాయ మంత్రి పి.ప్రసాద్ ఆ కార్యక్రమాన్ని బహిష్కరించడం గమనార్హం. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు అధికారిక కార్యక్రమాలను రాజకీయ సమావేశాలుగా మార్చకూడదని కేరళ ప్రభుత్వం అభిప్రాయపడింది. రాజ్‌భవన్ కార్యక్రమంలో భారతమాత చేతిలో జాతీయ జెండా బదులు పార్టీ జెండా ఉందని, అందువల్ల అలాంటి చిత్రాలను అధికారిక కార్యక్రమాల్లో ఉపయోగించకూడదని తెలిపింది.

హవ్వా...ఉగ్రవాదికి తనిఖీల అధికారమా?!

భద్రతామండలిలో జరిగింది ఇదే.. పాక్‌కు ఉగ్రవాద వ్యతిరేక కమిటీ బాధ్యతలు

» వైస్ చైర్మన్ పోస్టులోకి దాయాదిదేశం

» మండలి ఎంపికలపై భారత్ తీవ్ర నిరసన



అమెరికా సెనేటర్ ఆండీ కిమ్‌తో థరూర్ బృందం సమావేశం

వాషింగ్టన్, జూన్ 6: దొంగ చేతికి తాళం, ఉగ్రవాదికి పౌరుల తనిఖీల అధికారం ఇస్తామా? కానీ, ఐక్యరాజ్యసమితిలోని భద్రతామండలిలో ఇదే జరిగింది. ప్రపంచమంతటా ఉగ్రవాదాన్ని ఎగుమతి చేస్తున్న ధూర్తదేశంగా తరచూ బోనెక్కే పాకిస్థాన్‌కు భద్రతామండలిలోని తాలిబన్ల ఆంక్షల కమిటీ చైర్మన్ పదవి, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల కమిటీ వైస్ చైర్మన్ పదవి లభించాయి. దీనిపై భారత్ తీవ్ర నిరసన తెలిపింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్ ఉగ్ర పన్నాగాలపై భారత్ దౌత్య యుద్ధం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అఖిలపక్ష పార్టీల ఎంపీలను బృందాలుగా విదేశాలకు పంపించింది. ఈ బృందాలకు నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అమెరికాలో పర్యటిస్తుండగానే ఈ పరిణామం జరిగింది. అక్కడి భారత ఎంబసీలో శుక్రవారం ఆయన మీడియాతో దీనిపై మాట్లాడారు. ఇలాంటి నియామకాల వల్ల పెద్దగా కొంపలు మునిగిపోయేదేమీ ఉండదంటూ ఆయన ధీమా వ్యక్తం చేశారు. "భద్రతామండలిలో ఒక సభ్యదేశంగా పాకిస్థాన్‌కు ఈ 'అవకాశం' దక్కి ఉండవచ్చు. కానీ, మండలిలో భారత్‌కు మిత్రులు లేకపోలేదు. అందువల్ల పెద్దగా విపరిణామాలేవీ ఉండవనే పూర్తిధీమా మాకు ఉంది" అని ఆయన తేల్చిచెప్పారు. పాక్‌కు తాలిబన్ల ఆంక్షల కమిటీ చైర్మన్ పోస్టు దక్కడంపై స్పందిస్తూ.. ఈ ఎంపికను అఫ్ఘానిస్థాన్ వాసులు ఎలా చూస్తారనేది చూడాలన్నారు. ఐక్యరాజ్యసమితిలో పలు వ్యవస్థలు, కమిటీలు పనిచేస్తుంటాయని, నెలవారీ రొటేషన్‌లో భాగంగా సభ్యదేశాలు వాటికి నేతృత్వం వహిస్తూ ఉంటాయని వివరించారు. అలా.. పాకిస్థాన్‌కూ ఈ విడత అవకాశం లభించి ఉంటుందన్నారు. అయితే, చైర్మన్ పదవి పాకిస్థాన్‌కు దక్కిఉంటే అంతకు మించిన పరిహారం ఉండేది కాదన్నారు. కాగా, ఉగ్రవాద వ్యతిరేక కమిటీ చైర్మన్ పదవి అల్జీరియాకు దక్కింది. ఇదిలా ఉండగా, అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌కు వింత అనుభవం ఎదురైంది. అక్కడ ఆయన నిర్వహించిన మీడియా సమావేశానికి వాషింగ్టన్ పోస్టు జర్నలిస్టుగా వచ్చిన సొంత కుమారుడు ఇషాన్ థరూర్ తన తండ్రికి ప్రశ్నలు వేయడం అందరినీ ఆకర్షించింది.

సిమ్లా ఒప్పందం రద్దు కాలేదు

» పాక్ విదేశాంగ శాఖ స్పష్టీకరణ

ఇస్లామాబాద్, జూన్ 6: భారత్‌తో 1972లో కుదిరిన చారిత్రక 'సిమ్లా ఒప్పందం' విషయంలో పాకిస్థాన్‌లో గందరగోళం నెలకొన్నట్లు కనిపిస్తోంది. సిమ్లా ఒప్పందానికి ఇక విలువ లేదని, అది 'డెడ్ డాక్యుమెంట్' అంటూ పాక్ రక్షణ మంత్రి ఖాజా ఆసిఫ్ గురువారం సంచలన వ్యాఖ్యలు చేయగా.. పాక్ విదేశాంగ శాఖ మాత్రం ఈ వ్యాఖ్యలను తోసిపుచ్చింది. సిమ్లా ఒప్పందం సహా భారత్‌తో ఏ ద్వైపాక్షిక ఒప్పందాన్నీ రద్దు చేసుకునే నిర్ణయం తాము తీసుకోలేదని పాక్ విదేశాంగ శాఖ అధికారి ఒకరు తెలిపారు. అన్ని ఒప్పందాలూ అమల్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి నేపథ్యంలో పాక్‌తో 'సింధు' జలాల ఒప్పందాన్ని తాము రద్దు చేసుకుంటున్నట్లు భారత్ ప్రకటించడం తెలిసిందే. కాగా, భారత్ నిర్ణయంపై పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ స్పందిస్తూ, "సింధు జలాల ఒప్పందం రద్దయిందో, లేదో తెలియదు. కానీ, సిమ్లా ఒప్పందం మాత్రం ముగిసినట్లే. మేం తిరిగి 1948 నాటి పరిస్థితులకు వచ్చేశాం. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన నియంత్రణ రేఖ ఇక కాల్పుల విరమణ రేఖ మాత్రమే" అన్నారు.

భాయీ భాయీ.. బాహాబాహీ

» బీటలు వారిన ట్రంప్-మస్క్ స్నేహబంధం



వాషింగ్టన్, జూన్ 6: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సన్నిహిత మిత్రుడు, ఇప్పటి వరకూ ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించిన బిలియనీర్ ఎలాన్‌మస్క్ మధ్య 'హనీమూన్' ముగిసింది. ఇద్దరి మధ్య మాటల యుద్ధం మొదలై.. ఏకంగా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితికి దారి తీస్తోంది. ట్రంప్ ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ఫెడరల్ ప్రభుత్వ వ్యయ నియంత్రణ బిల్లును మస్క్ వ్యతిరేకించి.. ప్రభుత్వ వ్యయ నియంత్రణ విభాగ(డోజ్) అధిపతి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీనిపై ట్రంప్ విలేకర్లతో మాట్లాడుతూ, మస్క్‌కు ఎంతో చేశానని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి మస్క్ స్పందిస్తూ.. తన సహకారం లేకుంటే ట్రంప్ మొన్నటి ఎన్నికల్లో గెలిచేవారే కాదన్నారు. దీనిపై ట్రంప్ తిరిగి స్పందిస్తూ.. ఇంత కృతజ్ఞతారాహిత్యమా? అని పేర్కొన్నారు. వివాదం ఈ విధంగా కొనసాగుతుండగానే.. ట్రంప్ శుక్రవారం మస్క్‌కు మరో హెచ్చరిక జారీ చేశారు. మస్క్ సంస్థలకు ప్రభుత్వ కాంట్రాక్టులను రద్దు చేస్తానని ప్రకటించారు. 'మస్క్‌కు ప్రభుత్వం ఇస్తున్న కాంట్రాక్టులను, సబ్సిడీలను రద్దు చేయటం ద్వారా వందల కోట్ల డాలర్లను ఆదా చేయవచ్చు' అని ట్రంప్ పేర్కొన్నారు. దీనిపై మస్క్ స్పందించారు. 'మీరు మీ నిర్ణయం ప్రకారం ముందుకెళ్లవచ్చు' అంటూ ప్రతి సవాల్ విసిరారు. అంతేకాదు, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్‌కు) వ్యోమగాములను తీసుకెళ్లటానికి, తిరిగి తీసుకురావటానికి నాసా ఉపయోగిస్తున్న తమ స్పేస్ ఎక్స్ కంపెనీకి చెందిన డ్రాగన్ వ్యోమనౌక సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే, కొన్నిగంటల్లోనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. అంతకు ముందు, ఏబీసీ న్యూస్ అనే మీడియా సంస్థ ట్రంప్‌ను ఇంటర్వ్యూ చేసినప్పుడు.. మస్క్‌తో విబేధాల పరిష్కారానికి ఫోన్‌లో మాట్లాడతారా అని ప్రశ్నించగా.. 'ఆ మెదడు లేని వ్యక్తితోనా? నాకు ఆసక్తి లేదు. వాస్తవానికి, మస్క్ నాతో ఫోన్‌లో మాట్లాడాలని భావించారు. కానీ, నేనే అందుకు అంగీకరించలేదు' అని తెలిపారు. అమెరికన్లు కడుతున్న పన్నులను ప్రభుత్వాలు వృథా చేస్తున్నాయంటూ గతంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, పోస్టులను ఎత్తిచూపుతూ.. ఆ ట్రంప్, ఈ ట్రంప్ ఒక్కరేనా అంటూ మస్క్ ప్రశ్నలు సంధించారు. చిన్నారుల మీద లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలున్న జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌నకు ఉన్న సంబంధాల గురించి ప్రభుత్వం సమాచారాన్ని తొక్కిపెడుతోందని ఆరోపించారు. ఈ మేరకు ట్రంప్, జెఫ్రీ కలిసి ఓ విందులో పాల్గొన్న 1992 నాటి వీడియోను షేర్ చేశారు. ట్రంప్‌ను అభిశంసించి అధ్యక్ష పదవి నుంచి తొలగించాలంటూ ఎక్స్‌లో వచ్చిన ఓ పోస్టును షేర్ చేశారు. వీటిపై ట్రంప్ కూడా ఊరుకోలేదు. ప్రభుత్వం నుంచి వైదొలగాలని మస్క్‌ను తానే ఆదేశించానని, దాంతో అవాకులు చెవాకులు పేలుతున్నాడని ఎద్దేవా చేశారు. ట్రంప్‌తో మస్క్ సంబంధాలు క్షీణించటంతో ఆయన కంపెనీలపై తీవ్ర ప్రభావం పడుతోంది. టెస్లా షేర్ల ధరలు మార్కెట్లో గురువారం 14% మేర పడిపోయాయి. ఫలితంగా ఆ కంపెనీ 15,200 కోట్ల డాలర్ల (రూ.13,03,194 కోట్లు) నష్టాన్ని చవిచూసింది.


ఇదీ నేపథ్యం

అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ కోసం మస్క్ 30 కోట్ల డాలర్లు (రూ.2,500 కోట్లు) ఖర్చు చేశారు. ట్రంప్ విజయంలో కీలకపాత్ర పోషించారు. అందువల్లే, ట్రంప్ కూడా మస్క్‌ను ఆదరించారు. డోజ్ విభాగానికి మస్క్‌ను అధిపతిగా నియమించారు. అయితే, ప్రభుత్వ వ్యయ నియంత్రణ కోసం ఇటీవల ట్రంప్ తీసుకొచ్చిన బిల్లును మస్క్ వ్యతిరేకించటంతో వారి స్నేహబంధం బీటలువారటం మొదలైంది. ఈ బిల్లును అమలు చేస్తే ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థికవ్యవస్థ దెబ్బతింటుందని మస్క్ విమర్శించారు. దీన్ని ట్రంప్ తిప్పికొట్టారు.విద్యుత్ వాహనాలకు ఇస్తున్న పన్ను రాయితీలను ఉపసంహరిస్తున్నందువల్లనే బిల్లును మస్క్ వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు.

ఏడాదిలో ఎంత తేడా!

పోలవరానికి మంచిరోజులు

- జగన్ ఐదేళ్ల హయాంలో జరిగిన పనులు 3.84 శాతమే
- కూటమి ప్రభుత్వం వచ్చిన 12 నెలల్లోనే 5.93% పనులు పూర్తి
- చకచకా కొత్త డయాఫ్రం వాల్
- సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ కూడా
- భూసేకరణలోనూ పురోగతి
- విధ్వంసం నుంచి ప్రగతి దిశగా పరుగు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి సర్కారు భారీ విజయాన్ని సొంతం చేసుకుని పాలనా పగ్గాలు చేపట్టడంతో.. రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు మంచి రోజులు వచ్చాయి. జగన్ జమానాలో జరిగిన విధ్వంసం నుంచి బయటపడి.. ప్రాజెక్టు పనులు లక్ష్యం దిశగా పరుగులు పెడుతున్నాయి. జగన్ గద్దెనెక్కేనాటికి.. అంటే 2019 మే నాటికి 71.93 శాతం జరిగిన పనులు.. 2024 మే నాటికి.. అంటే ఐదేళ్లలో కేవలం 3.84 శాతమే జరిగాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గత 12 నెలల్లో 5.93 శాతం పనులు జరిగాయి. మొత్తంగా ప్రాజెక్టు పురోగతి 81.70 శాతానికి పెరిగింది. నిర్వాసితులకు సహాయ పునరావాసం, భూసేకరణ పనులు 2019 నాటికి 18.66 శాతం జరుగగా.. జగన్ ఐదేళ్ల పాలనలో 3.89 శాతమే జరిగాయి. ఇప్పుడు చంద్రబాబు సర్కారు వచ్చిన ఏడాది కాలంలోనే.. 2.56 శాతం మేర భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాలు అమలై.. 25.11 శాతానికి చేరాయి. ఏడాదిలోనే ప్రాజెక్టు మొత్తం ప్రగతి 6.96 శాతం పెరిగి.. 56.75 శాతానికి చేరింది. ఈ గణాంకాలను చూస్తే జగన్ ఐదేళ్ల పాలనలో ఎంత విధ్వంసం జరిగిందో స్పష్టమవుతోందని సాగునీటి నిపుణులు చెబుతున్నారు.

ఆ పనులను కొనసాగిస్తే..

పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్ 2020లో వచ్చిన వరదలకు దెబ్బతింది. 2019 మే నెలలో అధికార పగ్గాలు చేపట్టాక.. వేగంగా జరుగుతున్న పనులను జగన్ కొనసాగించి.. వాల్‌పై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాంను వేసి ఉంటే.. వరదలకు దెబ్బతినేది కాదు. ప్రాజెక్టును పూర్తిచేస్తే ఈ ఘనత చంద్రబాబు ఖాతాలో పడుతుందన్న దుగ్ధతో దాని నాశనాన్ని కోరుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయన నిర్వాకంతో కొత్త డయాఫ్రం వాల్ కట్టాల్సి వస్తోంది. ఈ ఏడాది జనవరిలో 63,656 చదరపు మీటర్ల వాల్ పనులు ప్రారంభించారు. ఇప్పటిదాకా 11,503 చదరపు మీటర్ల పొడవున పనులు జరిగాయి. మిగిలిన పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. వాల్ పనులతో సమాంతరంగా ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) గ్యాప్-1 పనులు కూడా మొదలయ్యాయి. ఇవి వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తవుతాయని అధికారులు అంచనా వేశారు. ఈసీఆర్ఎఫ్ డ్యాంతో పాటు గ్యాప్-2 పనులు 2027 జూన్ నాటికి పూర్తవుతాయని, ఇదే జరిగితే మొత్తం ప్రాజెక్టు పూర్తయినట్లేనని నిపుణులు పేర్కొంటున్నారు.

విద్యాహక్కు చట్టం కింద సీట్లు పొందిన విద్యార్థుల అడ్మిషన్ల నిర్ధారణ గడువును ఈనెల 10 వరకు పొడిగించినట్లు సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పెంచలయ్య

డీమ్డ్ యూనివర్సిటీగా 'ఆదిశంకర'

నెల్లూరు(హరనాథపురం), జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆదిశంకర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థలకు డీమ్డ్ యూనివర్సిటీగా కేంద్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందని ఆ విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య తెలిపారు. శుక్రవారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతంలో ఆదిశంకర తొలి డీమ్డ్ యూనివర్సిటీ అని చెప్పారు. 2001లో గూడూరు (ప్రస్తుతం తిరుపతి జిల్లా) సమీపంలో ఆదిశంకర గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్‌ను ప్రారంభించామని, ఇప్పుడు 8 వేల మంది విద్యార్థులతో ఇంజనీరింగ్ కాలేజీల్లోనే అగ్రభాగాన నిలిచిందన్నారు. ఆదిశంకర ప్రాంగణంలో ఆదిశంకర పాలిటెక్నిక్, లా కాలేజీ, ఫార్మసీ, బీఈడీ కళాశాలలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2011లో జేఎన్‌టీయూతో శాశ్వత అనుబంధం పొందామని, 2013లో తొలి అటానమస్ ఇనిస్టిట్యూట్ హోదా తమ సంస్థ సాధించిందని తెలిపారు. 2021లో నాక్ ఏ ప్లస్ ప్లస్ గుర్తింపు సాధించామన్నారు. 2022లో ఆల్ కోర్ ప్రోగామ్స్-ఎన్‌బీఏ అక్రిడిటేషన్ సాధించామని తెలిపారు. ఏఐ, రోబోటిక్స్, స్పేస్‌సైన్సు కోర్సులు ప్రారంభించటం ఆదిశంకర డీమ్డ్ యూనివర్సిటీ లక్ష్యంగా పెంచలయ్య పేర్కొన్నారు. కోవూరు సమీపంలోని రామన్నపాళెంలో ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీని ప్రారంభించామని, ఈ కాలేజీలో కౌన్సిలింగ్ ద్వారా చేరే ప్రతిభ గల పేద విద్యార్థులకు యాజమాన్య కోటాలో 10 శాతం ఫీజులో రాయితీ ఇస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆదిశంకర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ధనుంజయ, ఏట రామయ్య, రాజా మురుగదాస్, డాక్టర్ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన కళాశాల

నేలమట్టం

విజయవాడలో అర్ధరాత్రి కాలేజీ భవనాలు కూల్చివేత

- కోర్టు ఆదేశాల పేరు చెప్పి వ్యక్తి దౌర్జన్యం
- తరగతి గదుల్లో బల్లలు తీసుకెళ్లిపోయిన వైనం
- శిథిలమైపోయిన 55 ఏళ్ల ఘన చరిత్ర
- పోలీసులకు ఫిర్యాదు చేసిన సొసైటీ సభ్యులు





అర్ధరాత్రి ప్రొక్లెయిన్లతో కూల్చడంతో నేలమట్టమైన శాతవాహన కాలేజీ భవనాలు

విజయవాడ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల ఘన చరిత్ర ఒక్కరాత్రిలో శిథిలమైంది. సొసైటీ ఏర్పాటు చేసిన కళాశాల ఓ వ్యక్తి దౌర్జన్యానికి నేలమట్టమైంది. విజయవాడలో శ్రీ దుర్గామల్లేశ్వర సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న శాతవాహన జూనియర్, డిగ్రీ కళాశాలను గురువారం అర్ధరాత్రి కూల్చివేశారు. ఓ వ్యక్తి అనుచరులు సుమారుగా 20 మంది విశాలాంధ్ర రోడ్డులో ఉన్న కళాశాల ప్రాంగణంలోకి అర్ధరాత్రి ప్రవేశించి ముందుగా వాచ్‌మన్ వద్ద నుంచి ఫోన్ లాక్కుని, అతడిని ఒక గదిలో బంధించారు. తర్వాత మొత్తం భవనాలను ఎక్స్‌కవేటర్లతో పడగొట్టేశారు. తరగతి గదుల్లో ఉన్న బల్లలను వ్యాన్‌ల్లో ఎక్కించుకుని వెళ్లిపోయారు. ఈ స్థలం తమదంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో ఈ కళాశాలలో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూల్చివేత వెనుక పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. శ్రీ దుర్గామల్లేశ్వర సొసైటీని 1969లో గుండవరపు ప్రజాపతిరావుతోపాటు మరికొంతమంది కలసి ఏర్పాటు చేశారు. అప్పట్లో విజయవాడలో ఆంధ్ర లయోలా కళాశాల మాత్రమే ఉండేది. ఈ విద్యాసంస్థ మిషనరీ ఆధ్వర్యంలో నడుస్తుండడంతో హిందూ విద్యార్థుల కోసం కళాశాలను ఏర్పాటు చేయాలని సొసైటీ యోచించింది. ఈ నేపథ్యంలోనే శాతవాహన కళాశాల పురుడు పోసుకుంది. 1971లో ముందుగా జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి.. తర్వాత డిగ్రీ స్థాయికి పెంచారు. కాలేజీకి అవసరమైన భూమిలో 2.95 ఎకరాలను బోయపాటి అప్పారావు అనే వ్యక్తి నుంచి సొసైటీ కొనుగోలు చేసింది. ఆయన సోదరి విజయలక్ష్మి 1.25 ఎకరాలను సొసైటీకి ఇచ్చారు. అయితే భూమికి సంబంధించి అగ్రిమెంట్ రాశారు తప్ప రిజిస్ట్రేషన్ జరగలేదు. కొంతకాలం తర్వాత అప్పారావు కుమారుడు బోయపాటి శ్రీనివాస అప్పారావు ఈ భూమి తనదంటూ కోర్టును ఆశ్రయించారు. మరోపక్క ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేయడం లేదని సొసైటీ కూడా జిల్లా కోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ ఇంకా పెండింగ్‌లో ఉంది. హైకోర్టులో తీర్పు సొసైటీకి అనుకూలంగా రావడంతో శ్రీనివాస అప్పారావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిలో సొసైటీ వ్యవస్థాపక సభ్యుడు ప్రజాపతిరావు, అప్పటి కార్యదర్శి వంకాయలపాటి కామేశ్వరరావు, దుర్గామల్లేశ్వర సొసైటీ రెస్పాండెంట్స్‌గా ఉన్నారు. ఈనెల మూడో తేదీన సుప్రీంకోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని చెప్పి బోయపాటి శ్రీనివాస అప్పారావు తన అనుచరులతో కళాశాల భవనాలను కూల్చివేయించారు. ఈ స్థలం తనకు చెందినదని, ఆక్రమించిన వారు శిక్షార్హులని బోర్డులు ఏర్పాటు చేశారు. రెస్పాండెట్లుగా ఉన్న ప్రజాపతిరావు, కామేశ్వరరావు పిటిషన్లను ఉపసంహరించుకోవడంతో తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని శ్రీనివాస అప్పారావు తరఫు న్యాయవాది తెలిపారు. అక్రమంగా కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశించి భవనాలను కూల్చడంపై సొసైటీ సభ్యుడు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రజాపతిరావు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు, సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీనివాస అప్పారావు, దూళిపూడి శ్రీకాంత్, వంకాయలపాటి శ్రీనివాసరావు, నిడుమోలు రమాసత్యన్నారాయణ తదితరులపై కేసు నమోదు చేశారు.

తిరుమల లడ్డూ.. భక్తుల విశ్వాసానికి ప్రతీక!

- లడ్డూ జీఐ హక్కుల ఉల్లంఘనపై టీటీడీ సీరియస్
- పలు సంస్థలకు నోటీసులు


తిరుమల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది శ్రీవారి భక్తులు అత్యంత పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదం పేరును అనధికారికంగా వినియోగించుకుంటున్న కొన్ని సంస్థలపై టీటీడీ కొరడా ఝుళిపించింది. జీఐ(జియోగ్రాఫికల్ ఇండికేషన్) హక్కులను ఉల్లంఘిస్తూ స్వామి లడ్డూ పేరుతో తమ ఉత్పత్తులను విక్రయిస్తున్న, ప్రచారం చేస్తున్న సంస్థలపై చట్టపరమైన చర్యలకు పూనుకుంది. ఇప్పటికే కొన్ని సంస్థలకు గత నెల 31వ తేదీన నోటీసులు జారీ చేసింది. 2009 సెప్టెంబరులోనే చెన్నైలోని జియోగ్రాఫికల్ ఇండికేటర్ రిజిస్ట్రీ విభాగం ద్వారా తిరుమల శ్రీవారి లడ్డూ పేటెంట్ రైట్స్‌ను పొందిన విషయం తెలిసిందే. అంతకుముందు 1999లో జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ఆఫ్ గూడ్స్ చట్టం ప్రకారం జీఐ హక్కులను సాధించింది. అయితే ఆన్‌లైన్ ద్వారా, నేరుగా కొన్ని స్వీట్స్ విక్రయ సంస్థలు శ్రీవారి లడ్డూ పేరుతో విక్రయాలు చేస్తున్నట్టు టీటీడీ గుర్తించింది. ఈ క్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశాల మేరకు టీటీడీ లా విభాగం అధికారులు ఢిల్లీకి చెందిన సహదేవ లా చాంబర్స్ ద్వారా పుష్ మై కార్ట్, ట్రాన్సాక్ట్ ఫుడ్స్ లిమిటెడ్, ఇండియా స్వీట్ హౌస్ వంటి ఐదారు సంస్థలకు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై పుష్ మై కార్ట్ వెంటనే స్పందిస్తూ, తమ ఉత్పత్తుల జాబితా నుంచి లడ్డూ ప్రసాదం పేరును తొలగిస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించింది. మరికొన్ని సంస్థలు కూడా లడ్డూ ప్రసాదం పేరును తొలగించినట్టు తెలిసింది.

లడ్డూప్రసాదాన్ని తప్పుగా వాడితే చర్యలు: ఈవో

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం స్వీట్ కాదని, ఇది కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక అని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. పవిత్రమైన స్వామి లడ్డూప్రసాదాన్ని తప్పుగా వాడితే ఎలాంటి చర్యలకైనా వెనకడుగు వేయబోమని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. భక్తుల మనోభావాలను కాపాడేందుకు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రుచి, శుచితో కూడిన నాణ్యమైన లడ్డూలను భక్తులకు అందజేయడంతో పాటు లడ్డూ పవిత్రను రక్షించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

రాష్ట్రానికి మంచి పేరు తెచ్చారు


- మేజర్ రాంగోపాల్ నాయుడుకు మంత్రి లోకేశ్ ప్రశంస



మంత్రి లోకేశ్‌ను కలిసిన మేజర్ రాంగోపాల్‌నాయుడు దంపతులు

మంగళగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కీర్తిచక్ర అవార్డు పొందిన ఆర్మీ మేజర్ మల్లా రాంగోపాల్ నాయుడు కుటుంబ సభ్యులతో గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రాంగోపాల్ నాయుడు మరాఠా లైట్ ఇన్‌ఫాంట్రీ, 56వ బెటాలియన్, రాష్ట్రీయ రైఫిల్స్ మేజర్‌గా పనిచేస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వద్ద ప్రాణాలకు తెగించి నలుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టడంతోపాటు తోటి సైనికులను రక్షించారు. దీంతో మేజర్ రాంగోపాల్ నాయుడును ఈ ఏడాది మే 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీర్తిచక్రతో సత్కరించారు. ఈ అవార్డుకు ఎంపికైన మొట్టమొదటి తెలుగు వ్యక్తిగా రాంగోపాల్ నాయుడు నిలిచారు. ఈ సందర్భంగా రాంగోపాల్ నాయుడును మంత్రి లోకేశ్ అభినందించారు. దేశంతోపాటు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణంగా ఉందని ప్రశంసించారు.

మాజీ ఎంపీ అంకినీడు ప్రసాద్ కన్నుమూత



చల్లపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చల్లపల్లి రాజా తనయుడు, మచిలీపట్నం మాజీ పార్లమెంటు సభ్యులు శ్రీమంతు రాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్ (86) శుక్రవారం ఉదయం తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చల్లపల్లిలోని శ్రీమంతురాజా యార్లగడ్డ శివరామప్రసాద్ (ఎస్ఆర్‌వైఎస్పీ) హైస్కూల్‌కు ఆయన కరస్పాండెంట్‌గా ఉన్నారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాలైన మోపిదేవి, పెదకళ్లేపల్లి, శ్రీకాకుళం, యార్లగడ్డ ఆలయాలకు ట్రస్టీగా కొనసాగుతున్నారు. 1967లో జరిగిన ఎన్నికల్లో మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి 60 వేల పైచిలుకు ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.



ఆప్కాబ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న గన్ని వీరాంజనేయులు

ఆప్కాబ్ చైర్మన్‌గా 'గన్ని' బాధ్యతల స్వీకారం

విజయవాడ (గుణదల), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రభుత్వ ప్రతినిధిగా ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు విజయవాడలోని ఆప్కాబ్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఆప్కాబ్ శాఖలపై సీసీటీవీ ద్వారా నిఘా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన సెంట్రల్ మానిటరింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. 'ఏక్ పేడ్ మాకే నామ్' పేరుతో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి బ్యాంక్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా ఆప్కాబ్ చరిత్రను ఆవిష్కరించే హిస్టరీ వాల్‌ను ప్రారంభించారు.

10వేల మందికి ఏఐలో శిక్షణ

- 500 స్టార్టప్‌లు, అమరావతిలో ఏఐ వర్సిటీకి సహకారం
- ఎన్‌విడియాతో ప్రభుత్వ ఒప్పందం

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఏఐలో రాష్ట్ర యువతకు నైపుణ్య శిక్షణ, ఏఐ యూనివర్సిటీ ఏర్పాటులో సహకారం అందించేందుకు ముందుకొచ్చిన ప్రఖ్యాత కంప్యూటింగ్ సంస్థ 'ఎన్‌విడియా'తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో శుక్రవారం ఉండవల్లిలో జరిగిన ఈ ఒప్పందం ద్వారా పది వేల మంది విద్యార్థులకు ఏఐలో నైపుణ్య శిక్షణ ఇస్తారు. 500 ఏఐ ఆధారిత స్టార్టప్‌ల అభివృద్ధికి సహకారం అందిస్తారు. ఎన్‌విడియా సీఈవో జెన్సన్ హువాంగ్‌తో లోకేశ్ గతేడాది ముంబైలో సమావేశమయ్యారు. అమరావతిలో ఏర్పాటు చేయబోయే ఏఐ యూనివర్సిటీకి సహకరించాలని కోరారు. ఈ ప్రతిపాదనకు హువాంగ్ సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో ఎన్‌విడియాతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది.

మధుసూదన్ కుటుంబానికి అండగా ఉంటాం: మంత్రి కందుల

- పవన్ ప్రకటించిన 50 లక్షలు అందచేత

కావలి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడుల్లో మృతి చెందిన నెల్లూరు జిల్లా కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. మధుసూదనరావు కుటుంబానికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన కుటుంబం తరఫున రూ.50 లక్షల ఆర్థిక సాయాన్ని ఇదివరకు ప్రకటించారు. ఈ మేరకు మంత్రి, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్, జనసేన నేతలతో కలసి శుక్రవారం కావలిలోని మధుసూదన్‌రావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పవన్ ప్రకటించిన రూ.50 లక్షల్లో రూ.22.5 లక్షలు మధుసూదన్‌రావు కుమార్తె మధుశ్రీకి, రూ.22.5 లక్షలను కుమారుడు ముకుంద శ్రీదత్తుకు, రూ.5 లక్షలను తల్లి పద్మావతికి డీడీల రూపంలో అందజేశారు.



మధుసూదనరావు కుటుంబ సభ్యులకు డీడీలు అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేశ్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పహల్గాం ఉగ్రదాడి తరువాత, ప్రధాని నరేంద్రమోదీ తొలిసారిగా జమ్మూకశ్మీర్‌లో కాలూని, అనేక భారీ ప్రాజెక్టుల ఆరంభోత్సవాలతో పాటు పాకిస్థాన్‌కు ఘాటైన హెచ్చరికలు కూడా చేశారు. అంతర్జాతీయ మీడియా కూడా ఈ పర్యటనమీద ప్రత్యేక దృష్టిపెట్టినందువల్ల, మోదీ సందేశం ప్రపంచం నలుమూలలకూ చేరింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన చీనాబ్ రైల్వేబ్రిడ్జిని ఆరంభించడంతోపాటు, మువ్వన్నెల జెండా చేతధరించి కదిలిన ఆ దృశ్యం శత్రువులకు ఒక బలమైన హెచ్చరిక. చినాబ్, అంజీ వంతెనలమీదుగా వందేభారత్ పరుగులు, అందులో ప్రధాని ప్రయాణం చూడచక్కని దృశ్యాలు.

రైలుమార్గం ద్వారా కశ్మీర్‌ను మిగతాదేశంతో అనుసంధానించే ఈ కృషిలో భాగంగా ఉదంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్ లింక్ ప్రాజెక్టును ముప్పయ్యేళ్ళక్రితమే పి.వి. నరసింహారావు ప్రభుత్వం ఆమోదించిన విషయాన్ని కాంగ్రెస్ ఈ సందర్భంగా గుర్తుచేసింది. కీర్తి మొత్తం తన ఖాతాలో వేసుకొనే లక్షణం మోదీకి ఉన్నది కనుకనే, కాంగ్రెస్ హయాంలో మొత్తం జమ్మూకాశ్మీర్‌లో జరిగిన రైల్వేలైన్ల అభివృద్ధినుంచి ఈ ప్రాజెక్టు అంకురార్పణవరకు ప్రతీదీ గుర్తుచేయాల్సివస్తున్నదని ఆ పార్టీ వాదన. 2002లో వాజపేయి ప్రభుత్వం దీనిని జాతీయప్రాజెక్టుగా ప్రకటించిన విషయాన్ని కూడా గుర్తుచేసింది. 2013నాటికే 135కిలోమీటర్ల రైల్వే లైన్ల నిర్మాణం జరిగిపోయిందని చెప్పుకుంది. ఇక, ప్రధాని తన ప్రసంగంలో జమ్మూకాశ్మీర్‌కోసం ఎన్నివేలకోట్లు ఖర్చుచేశామో, విద్యార్థులనుంచి రైతులవరకూ ప్రతీ ఒక్కరికీ ఎంత లబ్ధిని సమకూర్చామో చెప్పుకొచ్చారు. కశ్మీర్‌ను ఇకమీదట కూడా ఎంతో ప్రేమగా చూసుకోబోతున్నామని హామీ ఇవ్వడంతో పాటు, పాకిస్థాన్‌ను దులిపేయడానికి, హెచ్చరించడానికి ఈ పర్యటనను చక్కగా ఉపయోగించుకున్నారు. పొరుగుదేశం పర్యాటకానికి, పేదలకు వ్యతిరేకమని, ఎన్ని కుట్రలు చేసినా కశ్మీర్‌లో అభివృద్ధి ఆగదని మాటిచ్చారు.

భారీ ప్రాజెక్టుల ఆరంభోత్సవాలకంటే, ప్రధాని స్వయంగా పర్యటించడం, అభివృద్ధికీ సంక్షేమానికీ ఏ లోటూ ఉండదని హామీ ఇవ్వడం

కశ్మీర్ సందేశం

కశ్మీరీలకు ఉపశమనం కలిగించే విషయం. పహల్గాం దారుణం జరగగానే కశ్మీరీలను విలన్లుగా చిత్రీకరించే ఒక కుట్రపూరితమైన ప్రయత్నం జరిగింది. దాడిలో స్థానికుల సహకారం, భాగస్వామ్యం ఉన్నదన్న విపరీత దుష్ప్రచారం ద్వారా దేశప్రజలను కశ్మీరీలకు దూరం చేసే ప్రయత్నం జరిగింది. ఉగ్రదాడి వారి పొట్టగొడితే, ఈ వ్యతిరేక ప్రచారం వారిని మరింత కుంగదీసింది. మోదీ తన ప్రసంగంలో పోనీవాలా ఆదిల్ హుస్సేన్ పేరు ప్రత్యేకంగా ప్రస్తావించడం బాగుంది. పహల్గాంలో పర్యాటకులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్న ఆరోపణలను వమ్ముచేయడానికి కొందరు సామాజిక మాధ్యమాల్లో ఈ పోనీవాలాలమీద కూడా విషం చిమ్మిన సంగతి తెలిసిందే.

ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన ప్రసంగంలో చిన్ననాటినుంచీ తాను కలలుగన్న చీనాబ్ వంతెన ఇప్పటికి సాకారమైనందుకు మోదీని ప్రశంసించడంతో పాటు, తన ప్రమోషన్ ప్రతిపాదనను కూడా ముందుకు తెచ్చారు. 2014లో రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న తాను కేంద్రపాలిత ప్రాంత సిఎంగా డిమోట్ అయితే, రైల్వేశాఖ సహాయమంత్రిగా ఉన్న మనోజ్ సిన్హాకు లెఫ్టినెంట్ గవర్నర్‌గా ప్రమోషన్ వచ్చిందన్న చమత్కారం బాగుంది. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా గురించి ఆయన అవకాశం దొరికినప్పుడల్లా కేంద్రానికి గుర్తుచేస్తూనే ఉన్నారు. వేదికమీద ఉన్న మోదీ ఈ మాటలు విననట్టు ఊరుకోవచ్చునుగానీ, సుప్రీంకోర్టులో తమ ప్రభుత్వమే ఈ మేరకు హామీపడిన విషయాన్ని విస్మరించకూడదు. మెహబూబ్ ముఫ్తీ ప్రభుత్వంతో తెగదెంపులు చేసుకోవడం నుంచి, 370అధికరణ రద్దుద్వారా ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా చీల్చడం వరకూ తమ పదేళ్ళకాలంలో జమ్మూకశ్మీర్‌తో ఇష్టారీతిన వ్యవహరించిన విషయం మరిచిపోకూడదు. న్యాయస్థానానికి ఇచ్చిన హామీ మేరకు ఎన్నికలు నిర్వహించినప్పటికీ, పలు చట్టసవరణలతో గవర్నర్‌ను బలోపేతం చేయడమే తప్ప, రాష్ట్రహోదా ఊసెత్తడం లేదు. ఒమర్ ప్రభుత్వం గద్దెనెక్కేలోగా దాదాపు లక్షమందికి స్థానికతనివ్వడం, పెట్టుబడుల పేరిట సాగే వనరుల దోపిడీకి తలుపులు బార్లా తెరవడం స్థానికులకు ఆగ్రహం కలిగిస్తున్న విషయాన్ని గుర్తెరగాలి. పొరుగుదేశంమీద పైచేయి సాధించాలంటే ఇక్కడి ప్రజల మనసులు గెలవడం ముఖ్యం. అటల్‌జీ ప్రవచిత ఇన్‌సానియత్, కశ్మీరియత్ వంటి ఉన్నతమైన పదాలు పునరుద్ఘాటిస్తున్నప్పుడు, స్థానికులతో వ్యవహారం కూడా సున్నితంగానే ఉండాలి. కశ్మీర్‌ను రైలుమార్గంతో మిగతాదేశానికి అనుసంధానించిన పాలకులు త్వరలోనే దానికి రాష్ట్రహోదా ఇచ్చి, స్థానికుల మనసులు గెలుచుకుంటారని ఆశిద్దాం.

ఎన్నికల్లో రిగ్గింగ్ చేయడమెలా?

పార్లమెంటులో (3 ఫిబ్రవరి 2025న) నా ఉపన్యాసంలోను, అనంతరం విలేఖర్ల సమావేశంలోను గత ఏడాది నవంబర్‌లో మహారాష్ట్ర విధానసభ ఎన్నికలను నిర్వహించిన తీరు తెన్నుల పట్ల ఆందోళన వ్యక్తం చేశాను. మన దేశంలో ఎన్నికలు ఎప్పుడు, ఎక్కడ జరిగినా వాటి సక్రమ, నిష్పాక్షిక నిర్వహణను ప్రతిసారీ కానప్పటికీ అనేకసార్లు శంకించాను. చిన్నతరహా మోసం గురించి నేను మాట్లాడడం లేదు; మన జాతీయ సంస్థలను కైవసం చేసుకోవడంతో సహా సంభవిస్తున్న భారీ వంచనపై నా వ్యాకులతను వ్యక్తం చేస్తున్నాను. ఏమిటా వంచన? ఎన్నికల ఫలితాలను కుతంత్రంతో అనుకూలంగా మార్చుకోవడమే ఆ మోసం. అవును, మన ఎన్నికలలో పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరుగుతోంది.



అంతకు ముందు కొన్ని ఎన్నికల ఫలితాలు విడ్డూరంగా ఉన్నా 2024 మహారాష్ట్ర విధానసభ ఎన్నికల ఫలితాలు అసాధారణంగా ఉన్నాయి. ఆ అనూహ్య ఫలితాలు నన్నూ, మరెందరినో దిగ్భ్రాంతి పరిచాయి. విజయంపై ఆశోపహతులయినవారు తెంపరితనంతో భారీ రిగ్గింగ్‌కు పాల్పడి సాధించిన ఫలితాలవి. ఆ వంచనను కప్పిపుచ్చేందుకు సకల ప్రయత్నాలు చేసినప్పటికీ దాచిన వాస్తవాలు అన్నీ ఎలాంటి అనధికారిక మూలాధారాల ఆలంబనతో పనిలేకుండా అధికారిక గణాంకాల నుంచే బహిర్గతమయ్యాయి. అంచెలంచెలుగా ఆ అక్రమానికి పాల్పడేందుకు అనుసరించిన వ్యూహాలు, పద్ధతులు, ప్రక్రియలూ వెల్లడయ్యాయి.

ఆ ఎన్నికల అక్రమం ఎలా మొదలై, ఎలా పరిపూర్తి అయిందో విపులంగా చూద్దాం.

ప్రథమ పర్వం– ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించే అధికారులను నియమించే ప్యానెల్‌ను మార్చివేయడం: ఎన్నికల కమిషనర్లను ప్రధానమంత్రి, హోం మంత్రి 2:1 మెజారిటీతో ఫలప్రదంగా ఎంపిక చేయడాన్ని 2023 ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం సుసాధ్యం చేసింది. ఆ నియమకాలపై నిర్ణయం తీసుకునే త్రిసభ్య ప్యానెల్‌లో మూడో సభ్యుడు అయిన ప్రతిపక్ష నాయకుడి సూచన ప్రతిసారీ మెజారిటీ ఓట్లతో తిరస్కృతమవుతుంది. ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసే ప్యానెల్‌లో భారత ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర కేబినెట్ మంత్రికి స్థానం కల్పించిన నిర్ణయం న్యాయబద్ధమైనది కాదు. నైతిక సమంజసత్వం లోపించిన నిర్ణయమది. రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘంలో తటస్థ మధ్యవర్తిని తొలగించేందుకు ఉన్నత పదవులలో ఉన్నవారు సంబంధిత నియామకాల చట్టాన్ని మార్చేందుకు పనిగట్టుకుని ఎందుకు ప్రయత్నించారు?

ద్వితీయ పర్వం– నకిలీ ఓటర్లతో ఓటర్ల జాబితాను విస్తరించడం: 2019 విధానసభ ఎన్నికలలో మహారాష్ట్రలో నమోదైన ఓటర్ల సంఖ్య (ఎన్నికల సంఘం డేటా ప్రకారం) 8.98 కోట్లు. ఐదు సంవత్సరాల అనంతరం 2024 లోక్‌సభ ఎన్నికలకు ఆ ఓటర్ల సంఖ్య 9.29 కోట్లకు పెరిగింది. అయితే కేవలం ఐదు నెలల తరువాత నవంబర్ 2024 విధానసభ ఎన్నికల నాటికి ఆ ఓటర్ల సంఖ్య 9.70 కోట్లకు పెరిగింది. ఐదు సంవత్సరాల పాటు అతి నెమ్మదిగా 31 లక్షలు పెరిగిన ఆ ఓటర్ల సంఖ్య కేవలం ఐదు నెలల్లో, అవును ఐదు నెలల్లోనే 41 లక్షలకు ఉరుకులు పరుగులు తీసింది! ఇదొక ఆశ్చర్యకరమైన పెరుగుదల. ఇదెంత అపురూపమైన విషయమంటే నమోదైన మొత్తం ఓటర్లు 9.70 కోట్ల మంది కాగా ప్రభుత్వ సొంత అంచనాల ప్రకారమే మహారాష్ట్రలోని మొత్తం వయోజనులు 9.54 కోట్ల మంది మాత్రమే!

తృతీయ పర్వం– జాబితాలో పెరిగిన ఓటర్ల సంఖ్య కంటే పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య ఎక్కువ కావడం: ఓటుహక్కు వినియోగించుకున్నవారికి, పరిశీలకులకు నవంబర్ 2024 మహారాష్ట్ర విధానసభ ఎన్నికల పోలింగ్ యథాప్రకారం మామూలుగానే కన్పించింది. ఎన్నికలు జరిగిన ప్రతిచోటా ఎప్పుడూ సంభవించినట్టుగానే ఆ దినం మహారాష్ట్రలో ఎల్లెడలా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఓటు వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ కేంద్రాలలోకి ప్రవేశించిన వారిని ఓటు వేసేంతవరకు అక్కడే ఉండిపోవడానికి అనుమతించారు. అయితే, ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద కొండవీడు చాంతాడులా బారులు తీరినట్లు గానీ, పెద్ద సంఖ్యలో గుమిగూడినట్లుగానీ పత్రికలు, ప్రసార సాధనాలు వెల్లడించనేలేదు. అయితే ఎన్నికల సంఘం భోగట్టా ప్రకారం ఓటు వేసేందుకు ఓటర్లు కిలోమీటర్ల పొడవునా బారులు తీరారు. సాయంత్రం 5 గంటల సమయానికి 58.22 శాతం మంది తమ ప్రజాస్వామ్య హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ వ్యవధి ముగిసిపోయినప్పటికీ ఓటు వేసేందుకు మరింత మంది పోలింగ్ కేంద్రాలకు వస్తూనే ఉన్నారు. మొత్తం ఓటర్లలో 66.05 శాతం మంది ఓటు వేశారని ఎన్నికల సంఘం ఆ మరుసటి ఉదయం వెల్లడించింది. పోలింగ్ వేళలు ముగిసిన తరువాత కూడా 7.83 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపింది. 7.83 శాతం పెరుగుదల 76 లక్షల ఓటర్లకు సమానం. మహారాష్ట్ర విధాన సభ ఎన్నికలలో అంతకు మునుపు ఎన్నడూ లేని విధంగా నవంబర్ 2024లో చాలా మంది నమోదిత ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ గడువు ముగిసే సమయానికి, ఆ తరువాత ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్ల సంఖ్య మధ్య తేడా 2009లో –0.50 శాతం; 2014లో 1.08 శాతం; 2019లో 0.54 శాతం కాగా 2024లో ఈ తేడా 7.83 శాతంగా ఉన్నది.

చతుర్థ పర్వం– బోగస్ ఓటింగ్‌తో బీజేపీకి సంఖ్యాధిక్యత: ఇంకా అనేక అవకతవకలు ఉన్నాయి. మహారాష్ట్రలో లక్ష పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అయితే కేవలం 85 నియోజకవర్గాలలోని 12,000 పోలింగ్ బూత్‌లలో మాత్రమే అదనంగా పోలింగ్ జరిగింది. గత లోక్‌సభ ఎన్నికలలో ఈ 85 నియోజకవర్గాలలోనే భారతీయ జనతా పార్టీ పరిస్థితి సజావుగా లేదు. ఈ మేరకు ఈ 12 వేల పోలింగ్ బూత్‌లలో ప్రతి బూత్‌లోను సాయంత్రం 5 గంటల తరువాత సగటున 600మందికి పైగా ఓటర్లు ఓటు వేశారు. ప్రతి ఓటరు ఓటు వేసేందుకు 1 నిమిషం సమయం అవసరమవుతుందనుకుంటే పోలింగ్ విధిగా పది గంటల పాటు కొనసాగవలసి ఉంటుంది. ఇలా ఎప్పుడూ జరగలేదు గనక ఈ పరిస్థితి ఒక ప్రశ్నకు తావిస్తున్నది. అదనపు ఓట్లు వేయడం ఎలా జరిగింది? ఈ 85 సీట్లలో అత్యధిక స్థానాలను ఎన్డీఏ కూటమి గెలుచుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు.

పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఎన్నికల సంఘం పేర్కొంది. యువజనులు ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్నందునే పోలింగ్ శాతం పెరిగిందని, ఇదొక సానుకూల పరిణామమని వ్యాఖ్యానించింది. కావచ్చు. అయితే ఈ సానుకూల పరిణామం కేవలం 12,000 పోలింగ్ కేంద్రాలకే పరిమితమయింది. మిగతా 88,000 కేంద్రాలలో ఇది



మహారాష్ట్ర విధానసభ ఎన్నికలలో రిగ్గింగ్‌కు అనుసరించిన వ్యూహాలు, పద్ధతులు, ప్రక్రియలు చాలా సంవత్సరాలుగా అమలవుతున్నాయనే అనుమానాలు పలువురిలో ఉన్నాయి. రికార్డులను పరీక్షిస్తే రిగ్గింగ్ కార్యప్రణాళిక, దానిని అమలుపరచడంలో భాగస్వాములు అయిన వారి వివరాలు తప్పక బహిర్గతమవుతాయి. అయితే ఆ రికార్డులను పరిశీలించేందుకు ప్రయత్నించిన ప్రతిపక్షాలు, చైతన్యశీలురు అయిన పౌరులను అడుగడుగునా అడ్డుకోవడం జరుగుతోంది.

సంభవించలేదు. ఈ సానుకూల పరిణామానికి ఒక నిదర్శనాధ్యయనం (కేస్ స్టడీ) కమ్ఠీ నియోజకవర్గాన్ని తీసుకుందాం. 2024 లోక్‌సభ ఎన్నికలలో ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 1.36 లక్షల ఓట్లు రాగా బీజేపీకి 1.19 లక్షల ఓట్లు లభించాయి. 2024 విధానసభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు 1.34 లక్షల ఓట్లు లభించాయి. లోక్‌సభ ఎన్నికలలో ఎన్ని ఓట్లువచ్చాయో విధానసభ ఎన్నికలలో ఇంచుమించు అదే సంఖ్యలో ఓట్లు లభించాయి. బీజేపీ సాధించిన ఓట్ల సంఖ్య 1.75 లక్షలు. లోక్‌సభ ఎన్నికలలో కంటే 56,000 ఓట్లు అధికంగా వచ్చాయి. లోక్‌సభ, విధానసభ ఎన్నికల మధ్య కాలంలో ఈ నియోజకవర్గంలో 35,000 మంది కొత్త ఓటర్లు అదనంగా నమోదయ్యారు. లోక్‌సభ ఎన్నికలలో ఓటువేయనివారు, 35 వేల మంది కొత్త ఓటర్లు అందరూ బీజేపీ పట్ల ఆకర్షితులయ్యారు. ప్రథమ పర్వం నుంచి చతుర్థ పర్వం దాకా చేపట్టిన చర్యల ఫలితంగా 2024 విధానసభ ఎన్నికలలో తాను పోటీ చేసిన 149 సీట్లలో 132ను బీజేపీ గెలుచుకున్నది విజయశాతం 89. విధానసభ ఎన్నికలకు ఐదు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ సాధించిన విజయశాతం 32 మాత్రమే.

పంచమ పర్వం– సాక్ష్యాధారాలు రద్దు చేయడం! మహారాష్ట్ర విధానసభ ఎన్నికలలో అక్రమాలు జరిగినట్టు ప్రతిపక్షాలు ఘోషించాయి. న్యాయం చేయాలని కోరాయి. ఎన్నికల సంఘం మౌనం వహించింది. ఫిర్యాదు చేసిన విపక్షాల పట్ల దురుసుగా కూడా వ్యవహరించింది. 2024 లోక్‌సభ, విధానసభ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను ఓటర్ల ఫోటోలతో సహా అందుబాటులో ఉంచాలని అభ్యర్థించాయి. ఎన్నికల సంఘం ఈ విజ్ఞప్తులను వెన్వెంటనే త్రోసిపుచ్చింది. ఇంతకంటే ఘోరమైన విషయం మరొకటి ఉన్నది. విధానసభ ఎన్నికలు ముగిసిన నెల రోజుల అనంతరం ఒక పోలింగ్ కేంద్రంలో ఓటింగ్‌కు సంబంధించిన వీడియోలను, సీసీటీవీ ఫుటేజీని ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని సంప్రదించిన తరువాత 1961 నాటి ఎన్నికల నిర్వహణ నియమావళిలోని సెక్షన్ 93(2)(ఎ)ను సవరించింది. ఈ సవరణతో సీసీటీవీ ఫుటేజీ, ఎలక్ట్రానిక్ రికార్డుల అందుబాటును పరిమితం చేసింది. ఇటీవల ఐడెంటికల్ / డూప్లికేట్ EPIC నంబర్లు బయటపడడంతో బోగస్ ఓటర్ల విషయమై ఆందోళన మరింత తీవ్రమయింది. ఇది, ఒక బృహత్ సమస్య సూచనప్రాయంగా వెల్లడి కావడమే.

మహారాష్ట్ర విధానసభ ఎన్నికలలో రిగ్గింగ్‌కు అనుసరించిన వ్యూహాలు, పద్ధతులు, ప్రక్రియలు చాలా సంవత్సరాలుగా అమలవుతున్నాయనే అనుమానాలు పలువురిలో ఉన్నాయి. రికార్డులను పరీక్షిస్తే రిగ్గింగ్ కార్యప్రణాళిక, దానిని అమలుపరచడంలో భాగస్వాములు అయిన వారి వివరాలు తప్పక బహిర్గతమవుతాయి. అయితే ఆ రికార్డులను పరిశీలించేందుకు ప్రయత్నించిన ప్రతిపక్షాలు, చైతన్యశీలురు అయిన పౌరులను అడుగడుగునా అడ్డుకోవడం జరుగుతోంది. మహారాష్ట్ర విధానసభ ఎన్నికలలో రిగ్గింగ్ అంత భారీగా ఎందుకు జరిగిందన్నది ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. పాలక, ప్రతిపక్ష కూటముల మధ్య పోటీ తీవ్రంగా ఉన్నది. విజయం అసాధ్యమేమోనని భయపడిన వారు ఎక్కడలేని తెంపరితనంతో అక్రమాలకు పాల్పడ్డారు. అయితే ఎన్నికలలో రిగ్గింగ్ క్రికెట్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ (పోటీని తారుమారు చేయడం) లాంటిదే. ఇటువంటి అక్రమాలకు పాల్పడినవారు ప్రజాస్వామిక సంస్థలకు ఎనలేని నష్టం చేస్తున్నారు. చక్కదిద్దలేని క్లిష్ట పరిస్థితులను కల్పిస్తున్నారు. ఎన్నికల ఫలితాలలో ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారు. ఇలా అయితే మన ప్రజాస్వామ్యం ఏమైపోను? రిగ్గింగ్‌తో ఎన్నికలలో గెలవడం ఏ ప్రజాస్వామ్య వ్యవస్థనూ దృఢతరం చేయదు.

■ రాహుల్‌గాంధీ
లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు

కులగణన ఎలా జరగాలి?

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కులగణన నిర్ణయం వెనుకబడిన కులాలకు సామాజిక న్యాయాన్ని అందించడంలో ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించనుంది. 2011లో జనగణనలో కులగణన చేస్తామని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ప్రకటించి, మరుసటి రోజే మళ్లీ అలా చేయబోమని, ప్రత్యేకించి సామాజిక, ఆర్థిక, కులగణన చేస్తామనీ చెప్పి, ఆ సోషల్ ఎకానమిక్ క్యాస్ట్ సెన్సెస్ రిపోర్టు కూడా బయటపెట్టలేదు. తర్వాత ఆ సెన్సెస్‌లో తప్పులున్నాయని చేతులు దులుపుకుని, రిపోర్ట్‌ను బుట్టదాఖలు చేసింది. అలా ఐదువేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. ఈసారైనా కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణనను చిత్తశుద్ధితో చేయాలి. గత అనుభవాల దృష్ట్యా కులగణనను పారదర్శకంగా, నిజాయితీతో జరపాలి. ఈ దిశగా పలు పద్ధతులను పాటించాల్సిన అవసరం ఉంది.

1) కుల గణన సెన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలోనే జరగాలి. గతంలో కాంగ్రెస్ సోషియో, ఎకానమిక్ కులగణన చేసినప్పుడు గ్రామీణ ప్రాంతంలో రూరల్ డెవలప్‌మెంట్ శాఖ, పట్టణ ప్రాంతంలో అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ వారు దాన్ని చేపట్టారు. వీరికి ఆ వృత్తి నైపుణ్యం లేక ఆ సెన్సెస్ తప్పుల తడకగా మారింది. సెన్సెస్ డిపార్ట్‌మెంట్‌లో శిక్షణ పొందిన అధికారుల ద్వారా జరిగితేనే ఈ ప్రక్రియకు ఒక విశ్వసనీయత ఏర్పడుతుంది. 2) కులగణన జనగణనలో అంతర్భాగం కావాలి. దీని కొరకు సెపరేట్ ఫారం ఉండకూడదు. ఉంటే కొత్త సమస్యలు పుట్టుకొస్తాయి. 3) ఈ సెన్సెస్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల లెక్కలు మాత్రమే గాక, అన్ని కులాల లెక్కలు తీయాలి. అదే విధంగా ముస్లింలలో, క్రిస్టియన్స్‌లో ఉన్న కులాల లెక్కలు కూడా గణించాలి. 4) ప్రతి కులానికి ఒక కోడ్ నంబర్ ఇవ్వాలి. లేదంటే అనేక కులాలు పుట్టుకు వచ్చి డాటా స్వచ్ఛత దెబ్బ తింటుంది. ఉదాహరణకు ఒకే కులాన్ని ఒకే రాష్ట్రంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. ఉదాహరణకు చాకలి వారిని కొన్ని ప్రాంతాల్లో రజక అంటారు, కొన్ని ప్రాంతాల్లో ధోబి అంటారు. వీరందరినీ ఒకే కోడ్ నంబర్‌లోకి తీసుకొచ్చినట్టయితే కులాల లెక్కలు సరిగ్గా వస్తాయి. అలాగే ఓసీ కులాలకు కూడా కోడ్ నంబర్ ఇవ్వాలి. రాష్ట్రాలవారీ కులాల లిస్టులను తయారుచేసి వాటికి కోడ్ నెంబర్ ఇచ్చి పేపర్ ప్రకటనలు ఇవ్వాలి. ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత తుది లిస్టును ప్రకటించాలి. ముస్లిం, క్రిస్టియన్ మతాలలోని కులాల క్రోడీకరణ జరగాలి. 5) ప్రస్తుతమున్న సెన్సెస్ ఫారంలో కాలం నెంబర్ 8లో కులాల వివరాలు తెలియపరచవలసి ఉంటుంది. కాలం నెంబర్ 8లో ఎస్సీ అయితే ఎస్సీ అని టిక్ చేసి కింద 8Aలో ఏ కులమో తెలియచేయాలి. అదేవిధంగా ఎస్టీ అయితే ఎస్టీ అని టిక్ చేసి క్రింద 8Bలో తెగ వివరాలు చెప్పాలి. ఇక్కడ బీసీ లేదా ఓబీసీ అనే కాలమ్ సృష్టించాలి. దాని కింద బీసీ, ఓబీసీ అనే కాలమ్స్ ఉండాలి. ఎందుకంటే, ఉదాహరణకు తెలంగాణలో 134 కులాలు బీసీ లిస్టులో ఉన్నాయి. కాని కేంద్ర ఓబీసీ లిస్టులో 86 కులాలు మాత్రమే ఉన్నాయి. మరి అక్కడ వ్యక్తి ఏ విధంగా సమాధానం ఇవ్వాలి అన్న ప్రశ్న ఉద్భవిస్తుంది. రాజ్యాంగ రీత్యా ఆర్టికల్ 342A1 ప్రకారం కేంద్రం తన స్వంత ఓబీసీ లిస్ట్‌ను కలిగి ఉండవచ్చును. అదే విధంగా రాష్ట్రాలు ఆర్టికల్ 342A3 ప్రకారం తమ స్వంత లిస్ట్ కలిగి వుండవచ్చు. అందువలన ఈ రెండు కాలమ్స్ ఉండటం శ్రేయస్కరం. అయితే మొదట ఈ లిస్టులు పత్రికలలో ప్రకటించాలి. అలాగే ఓసీ కాలమ్ కూడా సృష్టించాలి. అక్కడ కూడా కింద కులాల లిస్ట్ కోడ్ నంబర్లతో ఉండాలి. ముస్లిం, క్రిస్టియన్ ఇతర మతాలకు కూడా కాలమ్స్ సృష్టించాలి. వారి కులాలను కూడా క్రోడీకరించి కోడ్ నంబర్స్ ఇవ్వాలి. 6) ప్రస్తుత సెన్సెస్ ఫార్మేట్‌లో 29 కాలమ్స్ మాత్రమే ఉన్నాయి. ఇందులో ఆర్థికపరమైన డాటా పెద్దగా సేకరించడం లేదు. కేవలం కుల డాటా సేకరించి భూమి, ఆర్థిక వివరాల డాటా సేకరించకపోతే బీసీల సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం తేటతెల్లం కాదు. కాబట్టి సెన్సెస్ కాలమ్స్ కొన్ని పెంచాలి. అదేవిధంగా ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఓటర్ ఐడి కార్డ్ సమాచారాన్ని కూడా సేకరించాలి. 7) ఈ సెన్సెస్‌ను జాతీయ జనాభా రిజిస్టర్‌కు లింక్ చేయకుండా ఉంటే మంచిది. లేనట్టయితే అనవసర రాజకీయాలకు దారితీసి డాటా సమగ్రత దెబ్బతినే అవకాశం ఉంది. 8) సెన్సెస్‌లో డాటా సేకరణ డిజిటల్‌గాను, మాన్యువల్‌గాను కూడా జరగాలి. కొండ ప్రాంతాలలో సెల్ ఫోన్ సిగ్నల్స్ తక్కువ కాబట్టి మాన్యువల్ సెన్సెస్ ఉపయుక్తం. 9) సేకరించిన సమాచారం గోప్యంగా ఉంచాలి. అది వ్యక్తి ప్రైవసీకి భంగం కలగకుండా భద్రపరచాలి. 10) సెన్సెస్ ఆఫ్ ఇండియా ఆక్ట్ 1948 ద్వారా సెన్సెస్ జరుగుతుంది. ఇప్పుడు అన్ని మతాలలోని కులాల జనగణన జరుగుతుంది కాబట్టి ఆ సెన్సెస్ చట్టాన్ని కూడా అవసరమైన మేరకు సవరించాలి. అదేవిధంగా ఒక స్వతంత్ర సెన్సెస్ కమిషన్ వేసి ప్రజాభిప్రాయం ద్వారా ఫార్మేట్స్‌ను రూపొందించి చట్టంలో కావాల్సిన మార్పులు చేర్పులు చేసి ఈ కులగణనను చేయాలి. 11) భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టే అన్ని సర్వేలలో కూడా ఓబీసీ కాలమ్స్ చేర్చి వివరాలు సేకరించాలి. 12) కేంద్ర ప్రభుత్వం కులగణన షెడ్యూల్‌కు ఎంతోముందునుంచే తగు ప్రచారాన్ని కల్పించాలి, ప్రజలను సమాయత్త పరచాలి.



కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవికత. కులం ఎక్కడ ఉందో అక్కడ వివక్ష కూడా ఉంటుంది. అందుకే ఈ కులగణన ఒక రోగ నిర్ధారణ పరికరం. రోగం సరిగా తేలితే అప్పుడు చికిత్స సులభం. కాబట్టి ఈ ప్రక్రియ మొత్తం పారదర్శక విధానాలతో జరగాలి.

కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవికత. కులం ఎక్కడ ఉందో అక్కడ వివక్ష కూడా ఉంటుంది. అందుకే ఈ కులగణన ఒక రోగ నిర్ధారణ పరికరం. రోగం సరిగా తేలితే అప్పుడు చికిత్స సులభం. కాబట్టి ఈ ప్రక్రియ మొత్తం పారదర్శక విధానాలతో జరగాలి. భారతదేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా, మానవ అభివృద్ధి సూచీలో 130వ ర్యాంకులోనే మిగిలిపోయింది. ఈ కులగణన ద్వారా సామాజిక, ఆర్థిక, అవసరమైతే రాజకీయ అంశాలను లెక్కించి రాబోయే కాలంలో తగు విధాన నిర్ణయాలు, ప్రణాళికలు రచించి మానవాభివృద్ధి సూచికలలో, ముఖ్యంగా విద్యా ఆరోగ్యాలలో మన స్థానాన్ని మెరుగుపరుచుకోవచ్చు.

• టి. చిరంజీవులు
రిటైర్డ్ ఐఏఎస్, బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరమ్ చైర్మన్

దళితులను దళితులే ఎన్నుకోవాలి

భారతదేశ ప్రజాస్వామ్యం ప్రపంచంలో అతి పెద్దదిగా ప్రశంసలు అందుకుంటోంది. కానీ ఈ దేశపు అత్యంత పీడితులు అయిన దళితులకు ఇది నిజమైన రాజకీయ అధికారాన్ని ఇప్పటిదాకా నిరాకరించింది. ఈ నిరాకరణ మూలాల్లో ప్రధానమైనది డా. బి.ఆర్. అంబేడ్కర్ ప్రతిపాదించిన 'ప్రత్యేక ఎన్నికల నియోజకవర్గాలు'. ఈ ప్రతిపాదన గతంలో దళితులకు స్వీయ ప్రాతినిధ్యం, స్వయం నిర్ణయాధికారాన్ని హామీ ఇచ్చింది.


1930ల ప్రారంభంలో లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాల్లో 'డిప్రెస్డ్ క్లాసెస్' (ఇప్పటి షెడ్యూల్డ్ కులాలు లేదా దళితులు)కి రిజర్వుడు స్థానాలు కాకుండా ప్రత్యేక ఎన్నికల అవసరముందని అంబేడ్కర్ వాదించారు. ఈ విధానంలో దళిత ప్రతినిధులను కేవలం దళిత ఓటర్లే ఎన్నుకుంటారు. తద్వారా వారు తమ దళిత సమాజం పట్ల బాధ్యత, జవాబుదారీతనం కలిగిన నేతలవుతారు. ఇది విభజన కోసం కాదు– విముక్తి కోసం, శతాబ్దాలుగా కొనసాగుతున్న కుల ఆధిపత్య వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన మార్గంగా అంబేడ్కర్ వాదించారు.

1932లో బ్రిటిష్ ప్రభుత్వం 'కమ్యూనల్ అవార్డ్'లో ఈ ప్రతిపాదనను అంగీకరించింది. దాంతో ముస్లింలు, సిక్కులు, ఇండియన్ క్రిస్టియన్లు, ఆంగ్లో–ఇండియన్లు, యూరోపియన్లు, ముఖ్యంగా దళితులకు ప్రత్యేక ఎన్నికల హక్కు ఇచ్చింది. కానీ కొన్ని వారాల లోపే గాంధీజీ దీన్ని వ్యతిరేకిస్తూ ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించడంతో అంబేడ్కర్ ఒత్తిడికి లోనై పూనా పాక్ట్ అనే ఒప్పందానికి అంగీకరించారు. దళితులకు స్వతంత్ర రాజకీయ ప్రాతినిధ్యాన్ని, నిర్ణయాధికారాన్ని పొందటానికి అవకాశం ఉన్న ప్రత్యేక ఎన్నికల పద్ధతిని ఈ ఒప్పందం అంతమొందించింది.

ప్రత్యేక ఎన్నికల నియోజకవర్గాల పద్ధతిలో, నిర్దిష్ట సముదాయానికి చెందిన ఓటర్లు మాత్రమే తమ సముదాయానికి చెందిన ప్రతినిధులను ఎన్నుకుంటారు. దళిత సమాజం నుంచి వారే తమ నాయకులను ఎన్నుకునే అవకాశం కలిగేది. ఇలా ఎన్నికైన దళిత ప్రతినిధులు ఆ ఓటర్లకు మాత్రమే జవాబుదారీగా ఉండేలా చేస్తుంది, ఇది వారిలో నుంచి నిజమైన దళిత నాయకత్వాన్ని వెలికి తీయగలుగుతుంది.

దీనికి విరుద్ధంగా, స్వాతంత్ర్యానంతర భారత దేశంలో ఉమ్మడి ఓటర్ల వ్యవస్థను అమలు చేస్తున్నారు. ఇది ఆధిపత్య కులాలతో సహా నియోజకవర్గంలోని ఓటర్లందరూ రిజర్వుడు స్థానాల నుంచి పోటీ చేసే అభ్యర్థులకు ఓటు వేయడానికి అనుమతిస్తుంది. ఫలితంగా, దళిత ప్రతినిధులు తరచుగా తమ రాజకీయ మనుగడ కోసం దళితేతర ఓటర్లపై ఆధారపడుతూ, తమ సమాజానికి బదులుగా పార్టీల నాయకులకు విధేయులైపోతున్నారు. ఇది వారి స్వయంప్రతిపత్తిని గణనీయంగా తగ్గిస్తోంది.

శతాబ్దాల పాటు కులవ్యవస్థ ఆధిపత్యానికి, అణిచివేతకు లోనైన దళితుల విముక్తికి రాజకీయ అధికారమే మార్గమని డా. అంబేడ్కర్ విశ్వసించారు. ఈ దిశగా ఆయన ఐదు ప్రధాన సూత్రాల ఆధారంగా ప్రత్యేక ఎన్నికల పద్ధతిని ప్రతిపాదించారు.



1909 నుంచి 1947 వరకు ముస్లింలు, సిక్కులు, ఆంగ్లో–ఇండియన్లు ప్రత్యేక ఎన్నికల ప్రయోజనాన్ని అనుభవించారు. 2020 వరకు కూడా ఆంగ్లో–ఇండియన్లకు నామినేటెడ్ సీట్లు ఉండేవి. దళితులకు మాత్రమే ఇచ్చిన హక్కును తొలగించి ఒక మంచి అవకాశాన్ని అందకుండా చేశారు.

రాజకీయ స్వాతంత్ర్యం– దళిత నాయకులు తమ ఓటర్లకు బాధ్యత కలిగి, జవాబుదారిగా ఉండాలి కాని చారిత్రకంగా రాజకీయ అధికారాన్ని నియంత్రించిన ఆధిపత్య కులాల పట్ల కాదు. లేనిపక్షంలో వారు కేవలం ఆధిపత్యాన్ని, అణిచివేతని కొనసాగించేవారే అవుతారు; నిజమైన ప్రాతినిధ్యం– అగ్ర కులాల అంచనాలను తీర్చడానికి ఎంపిక చేయబడిన నామమాత్ర (టోకెన్) దళిత అభ్యర్థులు కుల అన్యాయాన్ని సవాలు చేస్తారని ఆశించలేం. దళిత ప్రాతినిధ్యం అంటే దళిత ప్రజల జీవిత అనుభవాలను, పోరాటాలను దృఢంగా ప్రతిబింబిస్తూ, ప్రాతినిధ్యం వహించాలి; నాయకత్వ వికాసం– దళిత సమాజంలో ఇది అత్యంత ముఖ్యమైనది. ప్రత్యేక ఎన్నికల వ్యవస్థ ద్వారా నిజమైన దళిత గొంతులకు స్థానం కల్పించడం ద్వారా, సమాజ మార్పు పట్ల నిబద్ధత కలిగిన, ఆత్మవిశ్వాసంతో కూడిన, సమర్థవంతమైన నాయకులను అభివృద్ధి చేయడం దీనితో సాధ్యమవుతుంది; చట్టబద్ధ సాధికారత– కుల వివక్షను నిషేధించే బలమైన, అమలులో పెట్టగలిగే చట్టాలను రూపొందించేందుకు, పరిపాలన వ్యవస్థలో స్వతంత్ర దళిత నాయకత్వమే తోడ్పడగలదు; సాంస్కృతిక గౌరవం– అంబేడ్కర్ దీని మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. రాజకీయ అధికార సాధన ద్వారా దళిత సమాజాలు, తీవ్ర కుల వివక్షతో కూడిన సమాజం ద్వారా తమలో తాము పెంపొందించుకొని, జీర్ణించుకున్న ఆత్మన్యూనత భావాలను ఎదుర్కొని అధిగమించగలవు.

అంబేడ్కర్ ప్రత్యేక నియోజకవర్గాల ప్రతిపాదన ఏ రకమైన విభజన కాదు. వాస్తవానికి అది శక్తివంతమైన విధానంగా అన్ని వర్గాలను కలుపుకునే లక్ష్యంతో కూడినది. దళిత ఓటర్లు ద్వంద్వ ఓటును వినియోగించుకుంటారు. ఒకటి– వారి స్వంత సమాజ ప్రతినిధిని ఎంచుకోవడానికి, మరొకటి– విస్తృత జాతీయ ప్రభుత్వానికి సార్వత్రిక ఎన్నికలలో అందరితో పాటు పాల్గొంటారు. ఈ ప్రతిపాదన దళితులకు చాలా కాలంగా నిరాకరించబడిన అధికారం, గౌరవంతో దళితులను సమగ్ర ప్రజాస్వామ్యంలో చేర్చే ఒక సమన్వయ మార్గం.


1909 నుంచి 1947 వరకు ముస్లింలు, సిక్కులు, ఆంగ్లో–ఇండియన్లు ప్రత్యేక ఎన్నికల ప్రయోజనాన్ని అనుభవించారు. 2020 వరకు కూడా ఆంగ్లో–ఇండియన్లకు నామినేటెడ్ సీట్లు ఉండేవి. దళితులకు మాత్రమే ఇచ్చిన హక్కును తొలగించి ఒక మంచి అవకాశాన్ని అందకుండా చేశారు. ఆధిపత్య కులాలు సంయుక్త ఎన్నికల ద్వారా తమ ఆధిపత్యాన్ని, రాజకీయ నియంత్రణ శక్తిని నిలుపుకున్నాయి.

1950 తర్వాత ప్రత్యేక ఎన్నికలు పూర్తిగా రద్దయ్యాయి. రాజ్యాంగం ప్రకారం, ఆర్టికల్ 330 ద్వారా షెడ్యూల్డ్ కులాలకు, వారి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించారు. కానీ, సంయుక్త ఎన్నికల విధానం కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ సహా ప్రధాన పార్టీలన్నీ తమకు విధేయత చూపే దళిత అభ్యర్థులను ఎంపిక చేయడం ప్రారంభించాయి. ఆ విధంగా దళిత ప్రాతినిధ్యం నిజానికి దూరంగా, కేవలం ప్రతీకాత్మకంగా మారింది. అసలైన స్వయంప్రతిపత్తి కోల్పోయి, ఇప్పుడు కేవలం టోకెనిజం మాత్రమే మిగిలింది. అప్పట్లో ప్రతిపాదించిన రెండు దశల ఎన్నికల విధానాన్ని అమలు చేయకుండా వదిలేసిన భారత రాజ్యాంగ వ్యవస్థ, దళిత రాజకీయ స్వయం ప్రాతినిధ్యాన్ని ఎప్పటికీ కోల్పోయేలా చేసింది. నిజానికి, ముందుగా ప్రతిపాదించబడిన రెండు దశల ఎన్నికల ప్రక్రియ జాతీయ ఐక్యతను కాపాడుతూ దళిత రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడగలిగే ఒక రాజీ. అయినప్పటికీ, స్వతంత్ర భారత దేశంలో దీనిని ఎప్పుడూ ఆమోదించలేదు, దీనికి కారణం ఖర్చు, పరిపాలనా సంక్లిష్టత, రాజకీయ ప్రతిఘటనలను సాకుగా చూపెట్టారు. రాజకీయ పార్టీలు దళిత అభ్యర్థులను తామే ఎంపిక చేయడం ద్వారా రాజకీయ నియంత్రణను నిలుపుకున్నాయి.

దశాబ్దాలుగా రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, దళితుల గొంతులు అణగదొక్కబడ్డాయి. చాలా మంది దళిత ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆయా పార్టీ శ్రేణులు, పద్ధతులతో నిర్బంధించబడ్డారు. వీరు దళిత ప్రయోజనాల కోసం స్వతంత్రంగా ఆలోచించలేరు, పనిచేయలేరు. పార్టీలచే దళిత నాయకత్వాలు కబ్జా చేయబడ్డాయి. అసలైన దళిత గొంతులు మూగబోయేలా చేశారు.

2030లో రాజకీయ రిజర్వేషన్ల గడువు ముగియనున్న నేపథ్యంలో, అంబేడ్కర్ మౌలిక ప్రతిపాదనను పునఃపరిశీలించాల్సిన సమయం వచ్చింది. ప్రత్యేక నియోజకవర్గాలు లేదా కనీసం దళితుల నేతృత్వంలోని అభ్యర్థుల ముందస్తు ఎంపిక, దళితులకు రాజకీయ గౌరవం, దళిత నాయకులకు జవాబుదారీతనాన్ని పునరుద్ధరించగలదు.

◆ లెల్లే సురేష్
దళిత కవి, సాంస్కృతిక కార్యకర్త




ఆనంద కెరటం

మంగినపూడి సముద్రతీరానికి పోటెత్తిన పర్యాటకులు




ఆకట్టుకున్న నిధి అగర్వాల్

మచిలీపట్నంలోని మంగినపూడి తీరం శుక్రవారం జన కెరటమై ఎగసిపడింది. మసులా బీచ్ ఫెస్టివల్ రెండోరోజూ అదే ఉత్సాహం కొనసాగింది. పారాగ్లైడింగ్, స్పీడ్ బోటింగ్, హెలీరైడ్‌లతో పర్యాటకులు సందడి చేశారు. పట్టలేని ఆనందంతో కేరింతలు కొట్టారు. ఎగసి పడుతున్న అలలపై సాగిన కెనోయింగ్, కయాకింగ్ పోటీలు ఆకట్టుకున్నాయి. బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ నువ్వానేనా, అన్నట్టు హోరాహోరీగా సాగాయి. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు కనులవిందు చేశాయి. హీరోయిన్ నిధి అగర్వాల్, యాంకర్ ఉదయభాను, సింగర్ గీతామాధురి సందడి చేశారు.
- మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

- మసులా బీచ్ ఫెస్టివల్ రెండో రోజూ అదే ఉత్సాహం
- ఆకట్టుకున్న పారాగ్లైడింగ్, స్పీడ్ బోటింగ్, హెలీరైడ్
- అలలపై అలరించిన కెనోయింగ్, కయాకింగ్ పోటీలు
- హోరాహోరీగా బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ
- కనులవిందుగా సాంస్కృతిక ప్రదర్శనలు

6








పాటలు పాడుతున్న గాయని గీతామాధురి (ఇన్‌సెట్‌లో) పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు

దుర్గగుడిలో ప్రక్షాళన

ప్రత్యేక నోడల్ ఆఫీసర్ల నియామకం



ఇంద్రకీలాద్రి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంలో మెరుగైన సౌకర్యాలు అందించేందుకు నోడల్ ఆఫీసర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. దుర్గగుడిలో ప్రక్షాళనకు గతనెల 6న ముఖ్యమంత్రి చంద్రబాబు.. దేవదాయ శాఖ మంత్రి, ఆ శాఖ కమిషనర్, ఇతర విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఈనెల 3న దేవదాయ శాఖ కమిషనర్ కొన్ని ఆదేశాలు జారీ చేశారు. ఈవో శీనానాయక్‌కు మార్గదర్శకాలను నిర్దేశిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఈ ఉత్తర్వుల అమలుకు సంబంధించిన కార్యాచరణ నివేదికను కూడా ఈనెల 9న జరిగే సమీక్షలో సమర్పించాలని కూడా ఆదేశించారు. ఈ క్రమంలోనే నోడల్ ఆఫీసర్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు శుక్రవారం ఈవో ప్రకటించారు. నోడల్ ఆఫీసర్లుగా నియమితులైన వారంతా రెగ్యులర్ విధులతో పాటు ప్రక్షాళన విధులను కూడా నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

నోడల్ ఆఫీసర్ల బాధ్యతలు ఇవీ..

- ఆలయంలో తయారయ్యే అన్ని రకాల ప్రసాదాలు, అన్నప్రసాదం, సరుకుల నాణ్యతా పరిశీలన, ఇతర ప్రమాణాలపై నివేదికల సమర్పణ, తదితరాలకు నోడల్ ఆఫీసర్‌గా ఏఈవో ఎన్.రమేశ్‌బాబును నియమించారు.
- సీసీ టీవీ ఫుటేజీ, కెమెరాల పనితీరు, కంట్రోల్ రూమ్ తనిఖీ, సీసీ టీవీ ఆపరేటర్ల విధులపై నియంత్రణ తదితరాలకు నోడల్ ఆఫీసర్‌గా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.కోటేశ్వరరావును నియమించారు.
- భక్తులకు మార్గదర్శనం చేసే సమాచార బోర్డుల ఏర్పాటు డిజైన్, తదితర పనులకు పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ (ఏఈవో కేడర్)

మిగతా 6లో..

కరెంట్ షాక్

కానూరు ఆటోనగర్‌లోని పారిశ్రామికవేత్తలకు ఝలక్




స్మార్ట్‌మీటర్లు బిగించక ముందు మే నెల బిల్లు రూ.7,310 | స్మార్ట్‌మీటర్లు బిగించాక జూన్ బిల్లు రూ.లక్షా6వేలు

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పారిశ్రామిక యూనిట్లకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా 'అదానీ' సిబ్బంది బలవంతంగా స్మార్ట్ మీటర్లు అమర్చడంపై దుమారం రేగుతోంది. ముందుగా తెలియజేయక పోవడమే కాదు.. పరిశ్రమల యాజమాన్యాల అనుమతి కూడా తీసుకోకుండా, సంతకం లేని ఓ నోటీసును అందజేసి బిగించిన ఈ స్మార్ట్ మీటర్లకు ఇపుడు రూ.లక్షల్లో బిల్లులు బాదుతున్నాయి. వైసీపీ హయాంలో జరిగిన ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వ హయాంలో విద్యుత్ శాఖ అధికారులు దొడ్డిదారిన అమలు చేయటంపై పారిశ్రామికవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జూన్‌లో గుండెలదిరేలా బిల్లులు రావడంతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) రంగాల పారిశ్రామికవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

- ముందస్తు సమాచారం లేకుండా అదానీ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు
- సంతకం లేని ఓ నోటీసు అందజేసి హడావిడిగా..
- నిన్నటివరకు రూ.8 వేల బిల్లు.. నేడు రూ.లక్ష దాటిపోయి..
- స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయటంపై పారిశ్రామికవేత్తల ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కానూరు ఆటోనగర్‌లోని పారిశ్రామిక యూనిట్లకు అదానీ సిబ్బంది నెల రోజుల కిందట బలవంతంగా స్మార్ట్ మీటర్లను బిగించింది. వీటిని బిగించే ముందు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. స్మార్ట్ మీటర్లను ఏర్పాటుచేసే రోజున ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) పేరుతో ఆపరేషన్ సెక్షన్ నుంచి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) ఇచ్చినట్టుగా ఒక నోటీసును అందజేశారు. ఆ నోటీసుపై కనీసం ఆపరేషన్ సెక్షన్‌కు చెందిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతకం కూడా లేదు. కేవలం సర్వీసు నెంబర్, కేటగిరీ, సబ్ డివిజన్ ఖాళీలను పెన్నుతో రాసి మాత్రమే ఇచ్చారు. ఆ నోటీసులో.. మీ సర్వీసు నెంబర్

మిగతా 6లో..

రూ.5 వేల నుంచి రూ.1.16 లక్షల వరకు కరెంటు బిల్లు

ఉదాహరణకు కానూరు ఆటోనగర్‌లో సర్వీసు నెంబర్ 6521223015058 కలిగిన యూనిట్‌కు మే నెలలో యాజమాన్యం అందుబాటులో లేనపుడు, కేవలం సిబ్బంది ఉన్నప్పుడు అదానీ సిబ్బంది వచ్చి హడావిడి చేశారు. అత్యవసరంగా మీటర్ మార్చాలని విద్యుత్ శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయంటూ స్మార్ట్ మీటర్‌ను బిగించారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా సిబ్బందికి చెప్పలేదు. పోనీలే మీటర్ మార్చారని సరిపెట్టుకుంటే, ప్రతినెలా కనిష్ఠంగా రూ.5 వేల నుంచి గరిష్ఠంగా రూ.8 వేలు వచ్చే విద్యుత్ బిల్లు జూన్‌లో రికార్డు స్థాయిలో రూ.1.16 లక్షలు వచ్చిందని పారిశ్రామిక వేత్తలు చెబుతున్నారు. దీనిపై అదానీ సిబ్బందిని ప్రశ్నించగా, కెపాసిటర్ కనెక్షన్ ఉందని, వెంటనే దానిని మార్చుకోవాలని చెబుతున్నారు. ఈ పనిని అదానీ సిబ్బంది ముందే చేయాలి. అలా చేయకుండా బిల్లు వచ్చిన తర్వాత తీరిగ్గా చెబుతున్నారు. కెపాసిటీర్‌ను తొలగించినా రీడింగ్‌లో తేడా కనిపించ్లేదని ఓ పారిశ్రామికవేత్త గమనించారు. దీంతో మీటరు రీడింగ్‌ను తీస్తుండగా, రోజుకు 20 యూనిట్ల పైనే తిరుగుతోందని ఆయన చెబుతున్నారు. ఈ లెక్కన చూసినా నెలవారీ బిల్లు అసాధారణంగా వచ్చే అవకాశం ఉందనేది ఆయన మాట. ఇలా కానూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో యూనిట్లు ఏర్పాటుచేసిన వారంతా ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ బిల్లులు ఈ స్థాయిలో వస్తే తాము యూనిట్లను నిర్వహించలేమని, తామేం పాపం చేశామో అర్థం కావట్లేదని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.



పేదల జీవితాల్లో వెలుగులు నింపిన

విద్యాదాత అస్తమయం

- కోయంబత్తూరులోని స్వగృహంలో వృద్ధాప్యంతో..
- రేపు మచిలీపట్నంలో అంత్యక్రియలు
- ఎంపీగా, ట్రస్టీగా చల్లపల్లి రాజా తనయుడు అంకినీడు ప్రసాద్ సేవలు
- మంత్రి లోకేశ్ సంతాపం

8



వన్‌టౌన్‌లోని పరీక్షా కేంద్రంలో తన బిడ్డను ఆప్యాయంగా ముద్దాడి పరీక్షకు వెళ్తున్న తల్లి

మెగా డీఎస్సీకి 87.65 శాతం హాజరు

గుర్రపు డెక్క ఎందుకు తీయించలేదు

- ఇరిగేషన్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

6

శిథిల శాతవాహన

దశాబ్దాల నాటి సరస్వతీ నిలయం నేలమట్టం.. భూవివాదాలే కారణం



- ఇప్పటికే ఏళ్ల తరబడి కొనసాగుతున్న భూ వివాదం
- కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని గురువారం అర్ధరాత్రి కూల్చివేతలు
- ల్యాబ్‌లో రసాయనాల ధ్వంసం
- కేసు నమోదుచేసిన పోలీసులు
- కన్నీరుపెట్టుకుంటున్న విద్యార్థులు

6

దశాబ్దాల చరిత్ర కలిగిన విద్యాశిఖరం నేలకొరిగింది. వేలమందికి విద్యాబుద్ధులు నేర్పిన సరస్వతీ నిలయం శిథిలమైపోయింది. విశాలాంధ్ర రోడ్డులోని శాతవాహన జూనియర్, డిగ్రీ కళాశాల గురువారం అర్ధరాత్రి నేలమట్టమైంది. ఈ భూమికి సంబంధించి కొద్దిరోజులుగా రకరకాలుగా మలుపులు తిరుగుతున్న పరిణామాలు చివరికి విద్యాలయాన్ని కూల్చే దుస్థితికి చేర్చాయి. ఇన్నాళ్లూ తమకు చదువుచెప్పిన కళాశాల కళ్లెదుటే ధ్వంసం కావడంతో విద్యార్థులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తమ ధ్రువీకరణ పత్రాలు ఏ శిథిలాల కింద పడిపోయాయోనని వెతుకుతున్నారు.



రూ.13,500 కోట్లే లక్ష్యం

- కేడీసీసీబీ ఆర్థిక సంవత్సరం లావాదేవీలు
- ప్రస్తుత లావాదేవీలు రూ.11,500 కోట్లు
- డ్వాక్రా సంఘాలను 10 వేలకు పెంచుతాం
- బంగారు రుణాల లక్ష్యం రూ.1,500 కోట్లు
- కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురామ్

8

ఆపరేషన్ రింకీ

ఎండీఎంఏ కేసులో కొత్త కోణాలు

- జీవన్ గ్యాంగ్‌కు గుంటూరు గ్యాంగ్‌తో సంబంధాలు
- బెంగళూరు నుంచి డ్రగ్‌ను రప్పిస్తున్న గుంటూరు బ్యాచ్
- ఫోరెన్సిక్ ల్యాబ్‌లో నిందితుల ఫోన్ల పరిశీలన

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : నోయిడాకు చెందిన రింకీ, ఢిల్లీకి చెందిన బందోపాధ్యాయ చౌదరి.. ఎండీఎంఏ డ్రగ్‌ను నగరానికి చేర్చడంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తులు వీరు. వీరి చేతికి సంకెళ్లు వేయడానికి పోలీసులు సిద్ధమవుతున్నారు. ఎండీఎంఏను నోయిడా నుంచి హైదరాబాద్ వరకు ట్రాకర్ ఆన్, డీటీడీసీ కొరియర్ల ద్వారా రింకీ పంపితే, దానికి సంబంధించిన డబ్బును బందోపాధ్యాయ చౌదరి క్యూఆర్ కోడ్ స్కానర్‌ను పంపి వసూలు చేసేవాడు. ఇలా హైదరాబాద్‌కు చేరుకున్న ఎండీఎంఏను విజయవాడకు తీసుకొస్తున్న ముగ్గురు యువకులను టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ముగ్గురిలో జీవన్‌కుమార్ మొత్తం గ్యాంగ్‌కు నాయకుడిగా వ్యవహరిస్తున్నాడు. ఈ ముగ్గురు నిందితులకు ఉన్న లింక్‌ల గురించి పోలీసులు కూపీ లాగడం మొదలుపెట్టారు. కాగా, జీవన్ గ్యాంగ్‌కు గుంటూరుకు చెందిన మరో గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నట్టు తెలిసింది.

మిగతా 6లో..



విశ్వాసానికి ప్రతీక బక్రీద్

- నేటి పండుగకు సర్వంసిద్ధం చేసుకున్న ముస్లింలు

8



డ్యాన్సర్లతో హరిహరవీరమల్లు చిత్ర కథానాయకి నిధి అగర్వాల్



బీచ్ ఫెస్టివల్‌కు తరలివచ్చిన పర్యాటకులు



ఫుడ్‌స్టాళ్ల వద్ద జనం

మంగినపూడి బీచ్‌లో ఎగసిన

ఆనంద కెరటాలు!

సముద్రక్రీడలు వీక్షిస్తూ, సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తూ, ఫుడ్‌స్టాళ్లలో రుచులను ఆస్వాదిస్తూ ..

సందడిగా మసులా బీచ్ ఫెస్టివల్ ● రెండో రోజూ ఫెస్టివల్‌కు పోటెత్తిన పర్యాటకులు

మసులా బీచ్ ఫెస్టివల్ శుక్రవారం రెండో రోజుకు చేరింది. మంగినపూడి బీచ్‌కు వేలాదిగా జనం పోటెత్తారు. సముద్ర క్రీడలను ఆస్వాదిస్తూ, సాంస్కృతిక కార్యక్రమా లను తిలకిస్తూ ఫుడ్ స్టాళ్లలో వివిధ రకాల రుచులను ఆస్వాదిస్తూ మదితీరాన ఉప్పొంగిన ఆనంద కెరటాలు ఎదలో సవ్వడి చేస్తుంటే పర్యాటకులు సంతోషంగా గడిపారు.



బీచ్ కబడ్డీలో తలపడుతున్న బిహార్, తెలంగాణ మహిళా జట్లు



కెనోయింగ్ పోటీలో పాల్గొంటున్న క్రీడాకారులు

వాటర్ స్పోర్ట్స్‌కు కేంద్రంగా మచిలీపట్నం బీచ్

● తీర్చిదిద్దుతామన్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): 'మంగినపూడి బీచ్ క్రీడలకు అనువైంది. వాటర్ స్పోర్ట్స్‌కు కేంద్రంగా, బీచ్ క్రీడలకు హబ్‌గా మారుతుంది.' అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం మంత్రి పలు క్రీడలను ప్రారంభించారు. పర్యాటక కేంద్రంగా మంగినపూడి బీచ్‌ను తీర్చిదిద్దేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులను ఆహ్వానించామని మంత్రి తెలిపారు. రానున్న కాలంలో బీచ్‌ను కేంద్ర ప్రభుత్వ నిధులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. బీచ్‌లో పిల్లలు ఆడుకునేందుకు వివిధ క్రీడలను పరిచయం చేస్తున్నామన్నారు. రంగుల రాట్నం తదితర క్రీడలను ఏర్పాటు చేశామన్నారు.

హోరాహోరీగా బీచ్ కబడ్డీ పోటీలు

రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నిర్వహిస్తున్న 12వ జాతీయ బీచ్ సీనియర్ కబడ్డీ పురుషులు, మహిళల పోటీలు హోరాహోరీగా జరిగాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 22 మహిళా జట్లు, 23 పురుష టీములు పాల్గొన్నాయి. మహిళా జట్ల మధ్య జరిగిన పోటీల్లో బిహార్‌పై ఉత్తరప్రదేశ్, గోవాపై హరియాణ, ఢిల్లీపై ఆంధ్రప్రదేశ్, విదర్భపై హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణపై వెస్ట్‌బెంగాల్, పాండిచ్చేరిపై పంజాబ్, ఉత్తరాంచల్‌పై తమిళనాడు, కర్ణాటకపై రాజస్థాన్ జట్లు విజయం సాధించాయి. పురుషుల కబడ్డీ పోటీల్లో ఒడిస్సాపై కేరళ జట్టు, విదర్భపై ఢిల్లీ, చత్తీస్‌ఘడ్‌పై మహారాష్ట్ర, జార్ఖండ్‌పై హరియాణ, తెలంగాణాపై ఏపీ, కర్ణాటకపై ఉత్తరాఖండ్, పాండిచ్చేరిపై ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌పై తమిళనాడు జట్లు విజయం సాధించాయి.

వెలుగుజిలుగుల బందరు



కోనేరుసెంటర్‌లో విద్యుద్దీపకాంతులు

మంగినపూడిలో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్న దృష్ట్యా మచిలీపట్నం నగర వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కోనేరు సెంటర్ తదితర ప్రాంతాల్లో వెలుగుజిలుగులతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా బెల్ యాంటీ డ్రోన్ సిస్టం



ప్రదర్శనలో ఉంచిన యాంటీడ్రోన్ సిస్టం

ఆపరేషన్ సిందూర్‌లో కీలకపాత్ర పోషించిన మచిలీపట్నం బెల్ కంపెనీలో తయారుచేసిన డీ4 యాంటీ డ్రోన్ సిస్టమ్‌ను మసులా బీచ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. ఫెస్టివల్‌లో అది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కొత్త అనుభూతులు పంచుతున్న హెలీరైడ్



హెలీరైడ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్/కృత్తివెన్ను: బీచ్ ఫెస్టివల్‌లో శుక్రవారం హెలీరైడ్స్‌ను కలెక్టర్ బాలాజీతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. అనంతరం హెలీకాప్టర్‌లో బీచ్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. హెలీరైడ్ బందరు నగరాన్ని క్షణాల్లో చుట్టొస్తూ పర్యటకులకు కొత్త అనుభూతిని పంచుతోంది. 6 నుంచి 9 నిమిషాల పాటు రైడ్ ఉండగా, ప్రతి ట్రిప్పుకు ఆరుగురు యాత్రికులు వెళ్లే సదుపాయం ఉంది. ట్రిప్పుకు ప్రతి మనిషికి రూ.4,500 ధరను నిర్ణయించారు. నగరాన్ని పైనుంచి చూసేందుకు యాత్రికులు ఉత్సాహం చూపుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు హెలీరైడ్ జరుగుతుంది. తొలిరోజు వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో 5 గంటలకే నిలిపివేసారు.

గాల్లో చక్కర్లు కొడుతూ ప్యారారైడ్

మచిలీపట్నం(కృత్తివెన్ను): అతి తక్కువ సమయంలో సాగర తీరంలో జరుగుతున్న బీచ్ ఫెస్టివల్‌ను పై నుంచి వీక్షించేందుకు ప్యారారైడ్‌ను ఏర్పాటు చేశారు. 1 లేదా 2 నిమిషాల్లోనే గాల్లో చక్కర్లు కొడుతున్న ఈ రైడ్‌లో ఒకరు మాత్రమే వెళ్లే వెసులుబాటు ఉంది. దీనికి టికెట్ ధరను రూ.2,000గా నిర్ణయించారు. వీటితోపాటు స్పెషల్ కార్ల రైడ్స్, గుర్రపు స్వారీలు, చిన్నారులకోసం జెయింట్ వీల్స్ ఏర్పాటు చేశారు. అవన్నీ పర్యాటకులను మైమరిపిస్తున్నాయి.

ఫెస్టివల్‌లో మొబైల్ టవర్స్

పెద్ద సంఖ్యలో వచ్చే యాత్రికుల వల్ల సెల్‌ఫోన్ సిగ్నల్స్‌కు ఆటంకం కలగకుండా ఉండేందుకు వీలుగా ఫెస్టివల్‌లో మొబైల్ టవర్స్‌ను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు.

రసవత్తరంగా కెనోయింగ్, కయాకింగ్ సముద్ర క్రీడలు

మచిలీపట్నం టౌన్: రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా కెనోయింగ్, కయాకింగ్ జల క్రీడలను మంగినపూడి బీచ్‌లో నిర్వహిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పోటీలను మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ జెండా ఊపి ప్రారంభించారు. కయాకింగ్ క్రీడాకారులు పడవల మీద పోటీ పడగా, కయాకింగ్ క్రీడాకారులు తెడ్లతో పోటీపడ్డారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం



మంగినపూడి బీచ్‌లో ప్రప్రథమంగా జలక్రీడలు నిర్వహిస్తున్నాం. 29 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. మంగినపూడి బీచ్ పోటీలకు ఎంతో అనుకూలంగా ఉంది.

- దావులూరి సురేంద్రబాబు, కయాకింగ్, కెనోయింగ్ క్రీడల రాష్ట్ర అధ్యక్షుడు

కయాకింగ్ క్రీడాకారుడికి అభినందన



లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన చెన్నై క్రీడాకారుడు రమణను అభినందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీ

మంగినపూడి బీచ్ పోటీల్లో చెన్నైకు చెందిన కయాకింగ్ క్రీడాకారుడు రమణ పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాండిచ్చేరి నుంచి చెన్నైకు సముద్రయానం చేసి లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సాధించిన ఆయనను మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ ప్రత్యేకంగా అభినందించారు.

చిలకజోస్యానికి భలే డిమాండ్



చిలక జోస్యం చెప్పేందుకు వచ్చిన జ్యోతిష్యులు

బీచ్ ఫెస్టివల్‌లో చిలకజోస్యం చెప్పేందుకు శ్రీశైలం, కర్నూలు ప్రాంతానికి చెందిన జ్యోతిష్యులు 30 మంది వచ్చారు. జోస్యం చెప్పించుకునేందుకు పలువురు ఆసక్తి చూపారు. దీంతో చిలక జోస్యానికి భలే డిమాండ్ ఏర్పడింది.

వాటర్ మ్యూజిక్ షో



వాటర్ మ్యూజిక్ షో వద్ద పర్యాటకులు

బీచ్ ఫెస్టివల్స్‌లో వాటర్ మ్యూజిక్ షో చిన్నారులను ఆకట్టుకుంది. సంగీతంకు తగ్గట్టుగా లైటింగ్ వాటర్ ప్రదర్శన జరుగుతుండటంతో చిన్నారులు ఉత్సాహంగా వీక్షిస్తున్నారు.

గుర్రపుడెక్క ఎందుకు తీయించలేదు

● ఇరిగేషన్ అధికారులపై కలెక్టర్ లక్ష్మీశ ఆగ్రహం..

ఇరిగేషన్ పనులపై అసంతృప్తి



రైతుల సమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్నా కాలువల్లో గుర్రపు డెక్క తీయడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇరిగేషన్‌శాఖ అధికారులపై కలెక్టర్ జి.లక్ష్మీశ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వెలగలేరు వద్ద పులి వాగు గండ్ల మరమ్మతులు, వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ ఆధునీకరణ పనులు, బీడీసీ లెఫ్ట్ బండ్‌పై 3.9 కిలోమీటర్ల వద్ద నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ కాంక్రీట్ పనుల్ని ఇరిగేషన్‌శాఖ అధికారులతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుడమేరు పరివాహక ప్రాంతంలో పంట పొలాలకు నష్టం కలగకుండా కాలువల్లో గుర్రపుడెక్క, తూటు కాడ, జమ్మి పూర్తిగా తొలగించాలని ఆయన ఆదేశించారు. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద బుడమేరు ప్రక్షాళనకు మ్యాప్‌ను పరిశీలించారు. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ కింద నుంచి ఎనికేపాడు యూటీ వరకు పాత కాలువకు సమాంతరంగా కొత్త కాలువ నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభించలేదని అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. పాత కాలువకు సమాంతరంగా కొత్త కాలువ తవ్వితే ఎనికేపాడు యూటీ వరకు ఎంత వరదను కొల్లేరులోకి పంపవచ్చని కలెక్టర్ అడుగగా 30 వేల క్యూసెక్కుల వరదను పంపొచ్చని అధికారులు సమాధానమిచ్చారు. అక్కడి నుంచి బీడీసీ లెఫ్ట్ బండ్‌పై 3.9 కిలోమీటర్ వద్ద నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ కాంక్రీట్ పనుల్ని కలెక్టర్ పరిశీలించారు. పను లు వేగంగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి విజయవాడ పల్లపు ప్రాంతాల ప్రజలకు బుడమేరు వరద ముంపు భయం లేకుండా చూడాల్సిన బాధ్యత ఇరిగేషన్ అధికారులపై ఉందన్నారు. పులివాగు గండ్ల మరమ్మతులపై తప్ప మిగిలిన పనులపై అసంతృప్తిని వ్యక్తం చేశారు.

నా పొలంలో గుంతను పూడ్పించండయ్యా

● కలెక్టర్‌కు కవులూరు రైతు మొర

పనుల పరిశీలనకు వచ్చిన కలెక్టర్ ఎదుట కవులూరు గ్రామానికి చెందిన రైతు చెరుకూరి సాంబశివరావు తన గోడును వెల్లబోసుకున్నాడు. గత ఏడాది బుడమేరు వరదలకు పడిన గండ్ల వల్ల తన పొలంలో 20 అడుగుల గొయ్యి పడిందని దాన్ని గండ్ల మరమ్మతుల చేస్తున్న కాంట్రాక్టర్‌ను పూడ్పించమంటే నువ్వే పూడ్చుకోమన్నాడని తెలిపారు. కలెక్టర్ అధికారులను పిలిచి గండిని పూడ్చాలని ఆదేశించారు. ఇరిగేషన్ ఎస్ఈ మోహన్‌రావు, స్పెషల్ డివిజన్ ఈఈ గంగయ్య, డీఈ సత్యనారాయణ, డీఈ అప్పారెడ్డి, ఏఈ వెంకటేష్ పాల్గొన్నారు.

దుర్గగుడి ప్రక్షాళన

(5వ పేజీ తరువాయి)

డాక్టర్ కె.గంగాధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.అశోక్‌కుమార్‌ను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు.

● అమ్మవారిని దర్శించుకోవటానికి వచ్చే పాలు తాగే పిల్లలున్న తల్లులకు సౌకర్యవంతంగా ఉండేందుకు బేబీ ఫీడింగ్ రూమ్‌ల ఏర్పాటు, సౌకర్యాల పర్యవేక్షణకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.అశోక్ కుమార్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించారు.

● నీటి పరీక్షలు చేయటం, ట్యాంకుల శుభ్రం చేయటం పనులకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.కుటుంబరావును నోడల్ ఆఫీసర్‌గా నియమించారు.

● ఆలయానికి వచ్చే భక్తుల అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా సేకరించే విధానానికి శ్రీకారం చుడుతూ ఐటీ కో-ఆర్డినేటర్ పి.హరీశ్, ఏఈవో సీహెచ్ సునీల్ కుమార్‌ను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు.

టీడీపీతోనే సహకార సంఘాలు బలోపేతం

● ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ప్రమాణస్వీకార సభలో మంత్రి అచ్చెన్నాయుడు



జ్యోతి వెలిగిస్తున్న మంత్రులు అచ్చెన్నాయుడు, పార్థసారథి, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

గన్నవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే సహకార సం ఘాలు బలోపేతం అవుతాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. గన్న వరం ఏటీ కన్వెన్షన్‌లో ఆప్కాబ్ చైర్మన్‌గా టీడీపీ ఏలూరు పార్లమెంట్ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శుక్ర వారం ఘనంగా నిర్వహించారు. మంత్రి మంత్రి కొలుసు పార్థసారథి, విప్ యార్లగడ్డ వెంకట్రావు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే సీటు త్యాగం చేసిన ప్రతి ఒక్కరికీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ న్యాయం చేశారని అచ్చెన్నాయుడు తెలిపారు. గత వైసీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం లేదని వ్యవస్థలన్నింటినీ భ్రష్టు పట్టించారని అ న్నారు. రైతు సంక్షేమం గ్రామీణ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టు బడి ఉందన్నారు. ఆప్కాబ్‌ను మరింత ప్రజా సంబంధమైన సంస్థగా మార్చడానికి గన్ని వీరాంజనేయులు కృషి చేస్తారని తెలిపారు. రైతుల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా ముందుకు సాగు తోందని మంత్రి కేపీ సారథి అన్నారు. గత ప్రభుత్వం ఎన్నో తప్పులు చేసిందని అయినా వెన్నుపోటు దినాన్ని జరిపిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విమర్శించారు. మంత్రి లోకేశ్ 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వబోతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రావు, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యే గంటా మురళి, మాజీ ఎమ్మెల్సీ రాజశేఖర్, రామ్మోహన్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి జవ హర్, ఏలూరు పార్లమెంట్‌లోని టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిల శాతవాహన

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): 1969లో విజయవాడలో క్రిస్టియన్ మిషనరీ విద్యాసంస్థలు మాత్రమే ఉండేవి. హిందూ విద్యార్థులు చదువుకోవడానికి ఒక విద్యాసంస్థను ఏర్పాటు చేయాలని పలువురు ప్రముఖులు నిర్ణయించుకున్నారు. ఓ సొసైటీ ఆధ్వర్యంలో కళాశాల నడిపితే బాగుంటుందని భావించారు. ఇందులో భాగంగా దుర్గామల్లేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీని ఏర్పాటుచేసి 105/1969తో రిజిస్ట్రేషన్ చేయించారు. 1971వ సంవత్సరంలో శాతవాహన పేరుతో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. కాలక్రమంలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో డిగ్రీ స్థాయి కళాశాల హోదా కల్పించారు. కళాశాలను ప్రారంభించిన తొలిరోజుల్లో సత్యనారాయణపురంలోని రామకోటి (ప్రస్తుత శివరామకృష్ణ క్షేత్రం) వద్ద ఓ ప్రైవేట్ భవనంలో నిర్వహించేవారు. ఏటా విద్యార్థుల సంఖ్య పెరగడంతో ప్రత్యేకంగా భూమి కొనాలని భావించారు. బోయపాటి అప్పారావు అనే వ్యక్తి నుంచి సొసైటీ 2.95 ఎకరాలు కొనుగోలు చేసింది. దీనికి సంబంధించి సొసైటీ ప్రతినిధులు, అప్పారావు అగ్రిమెంట్ రాసుకున్నారు. దీనిపై రిజిస్ట్రేషన్ మాత్రం జరగలేదని సొసైటీ ప్రతినిధులు చెబుతున్నారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో పట్టణ భూపరిమితి చట్టాన్ని అమలు చేయడంతో అప్పారావు సోదరి విజయలక్ష్మి 1.50 ఎకరాల భూమిని సొసైటీకి ఇచ్చారు. కోనేరు లక్ష్మయ్య, ముమ్మనేని సుబ్బారావు, తెన్నేటి భాస్కరరావు, టీవీఎస్ శర్మ వంటివారు ఈ సొసైటీకి కార్యదర్శులుగా, కళాశాలకు కరస్పాండెంట్లుగా పనిచేశారు. గుండవరపు ప్రజాపతి రావు సొసైటీ వ్యవస్థాపక సభ్యుడిగా ఉన్నారు. కొన్నాళ్లు కరస్పాండెంట్, కార్యదర్శిగా వ్యవహరించారు. ఎన్టీ రామారావు అధికారంలోకి వచ్చాక భూపరిమితి చట్టాన్ని రద్దు చేశారు. దీంతో బోయపాటి కుటుంబానికి.. గతంలో విక్రయించి, రిజిస్ట్రేషన్ కాని భూమిపై ఆశ పెరిగింది. కొంతకాలం గడిచాక అప్పారావు కుమారుడు శ్రీనివాస అప్పారావు.. తన ప్రమేయం లేకుండా తాత ఆస్తిని తండ్రి విక్రయించాడని హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. అగ్రిమెంట్ చేసుకున్న భూమికి రిజిస్ట్రేషన్ చేయడం లేదని దుర్గామల్లేశ్వర సొసైటీ జిల్లాకోర్టును ఆశ్రయించింది. ఈ భూమిని సొసైటీ రిజిస్టర్ చేయాలని జిల్లాకోర్టు తీర్పును ఇవ్వడంతో బోయపాటి శ్రీకృష్ణ అప్పారావు హైకోర్టును ఆశ్రయించారు.

2009లో మరో మలుపు

ప్రజాపతిరావు కరస్పాండెంట్‌గా ఉన్న సమయంలో 2009లో అమెరికాలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లారు. తర్వాత ఆయన కుమార్తె చనిపోయింది. తాను తిరిగి వచ్చే వరకు కార్యదర్శి, కరస్పాండెంట్ బాధ్యతలను వంకాయలపాటి కామేశ్వరరావుకు అప్పగించారు. అప్పటికే ఆయన కుమారుడు వంకాయలపాటి శ్రీనివాస్ ఈ కళాశాలలో హిందీ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. కార్యదర్శి, కరస్పాండెంట్ సీటులో కామేశ్వరరావు కూర్చున్నా మొత్తం వ్యవహారాలను శ్రీనివాస్ చక్కబెట్టేవారు. ఈయనే కళాశాలకు ప్రస్తుతం ప్రిన్సిపాల్ హోదాలో ఉన్నారు. ప్రజాపతిరావు అమెరికా నుంచి రావడానికి ముందు అప్పటికి మంత్రిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సొసైటీలో స్థానం కల్పించారు. ఆయన్ను కార్యదర్శిగా ప్రకటించారు. ప్రజాపతిరావు ఇక్కడికి వచ్చాక ఆయనకు పదవులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టి దాడి చేశారు. దీనిపై ఆయన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌కు ఫిర్యాదు చేశారు. మొత్తం రికార్డులను పరిశీలించిన ఆ శాఖ ఈ విషయాన్ని జిల్లాకోర్టులో తేల్చుకోవాలని సూచించింది.

'అదాలత్'లో అవునని...

రిజిస్ట్రేషన్ చేయడం లేదని సొసైటీ దాఖలు చేసిన పిటిషన్‌లో వంకాయలపాటి కామేశ్వరరావు, బోయపాటి శ్రీనివాస అప్పారావు జిల్లాకోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో రాజీపడ్డారు. కానీ, ఆ ఒప్పందం రాజీ తర్వాత అమలు చేయలేదు. దీంతో కామేశ్వరరావు 2011 ఆగస్టులో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను సొసైటీలోకి, శాతవాహనలోకి ఆహ్వానించారు. శ్రీనివాస అప్పారావుకు వ్యతిరేకంగా కామేశ్వరరావు హైకోర్టును ఆశ్రయించారు. ఇందులో ఆలపాటి ఇంప్లీడ్ అయ్యారు. హైకోర్టులో ఎదురుదెబ్బ తగలడంతో బోయపాటి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో కామేశ్వరరావు, ప్రజాపతిరావు, సొసైటీ రెస్పాండెంట్లుగా ఉన్నారు. కామేశ్వరరావు, ప్రజాపతిరావు పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్టు కోర్టుకు తెలిపారని బోయపాటి న్యాయవాది చెబుతున్నారు. తన సంతకాన్ని ఫోర్జరీ చేసి కోర్టుకు ఇచ్చారని ప్రజాపతి రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే సమయంలో అక్రమంగా శాతవాహన ప్రాంగణంలోకి ప్రవేశించి కూల్చివేతలు చేశారని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కూల్చివేతలు చేయడానికి బోయపాటి, ధూళిపూడి శ్రీకాంత్ గురువారం రాత్రి వెళ్లారు. పోలీసులు వారిని హెచ్చరించి పంపేశారు. అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు నటించి అర్ధరాత్రి కూల్చివేశారు. దీనిపై శ్రీనివాస అప్పారావు, శ్రీకాంత్‌తో పాటు వంకాయలపాటి శ్రీనివాస్, నిడుమోలు రమాసత్యనారాయణపై కేసులు నమోదు చేశారు. భవనాలను కూల్చివేయాలని సంతకాలు చేసినందుకు శ్రీనివాస్, రమాసత్యనారాయణపై కేసులు నమోదు చేశామని పోలీసులు చెబుతున్నారు. తాము ఆవిధంగా సంతకాలు చేయలేదని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కాపీ అందిందని సంతకాలు చేశామని వారు చెబుతున్నారు.

ముస్లింలకు ఎంపీ కేశినేని చిన్ని

బక్రీద్ శుభాకాంక్షలు

వన్‌టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలకు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం, దానం బక్రీద్ పండగ ఇచ్చే సందేశమని ఆయన పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా, దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవించమని సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ ఆయన మార్గంలో నడుస్తూ అల్లా ఆశీస్సులు అందుకోవాలని ఆయన సూచించారు. ప్రజలందరినీ అల్లా సుఖశాంతులతో చూడాలని ఎంపీ ఆకాంక్షించారు.

ఆపరేషన్ రింకీ

(5వ పేజీ తరువాయి)

జీవన్ సరుకును నోయిడా నుంచి రప్పిస్తుంటే, గుంటూరు గ్యాంగ్ మాత్రం బెంగళూరు నుంచి సరుకును రప్పిస్తున్నట్టు గుర్తించారు. ఈ రెండు గ్యాంగ్‌ల మధ్య అనేకసార్లు సరుకు మార్పిడి జరిగినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

సాంకేతిక విశ్లేషణ ఆధారంగా..

తిరుమలశెట్టి జీవన్‌కుమార్, బొంతు నితీష్‌కుమార్, తూలిమెల్లి తరుణ్ ప్రసాద్‌ను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిలో జీవన్ తెలివిగా వ్యవహరించాడు. ఎప్పుడైనా పోలీసులకు చిక్కితే ఎలాంటి వివరాలు వారికి తెలియకుండా ఉండటానికి రింకీ, బందోపాధ్యాయ చౌదరితో చేసిన చాటింగ్‌ను డిలీట్ చేశాడు. నితీష్ కుమార్, తరుణ్‌ప్రసాద్ చేసిన చాటింగ్‌నూ తొలగించాడు. అయితే, సాంకేతిక విశ్లేషణ కోసం నిందితులు ముగ్గురి ఫోన్లను పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. జీవన్‌కుమార్ తొలగించిన మొత్తం డేటాను రిట్రీవ్ చేయాలని నిర్ణయించారు. ఈ ముగ్గురి ఫోన్లలో ఎండీఎంఏను కొనుగోలు చేసిన విద్యార్థుల జాబితా భారీగానే ఉన్నట్టు తెలిసింది. ఈ కేసులో పోలీసులు రింకీని ఏ1గా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. క్యూఆర్ కోడ్‌ను పంపి పేమెంట్ గేట్‌వేల ద్వారా డబ్బు తీసుకున్న బందోపాధ్యాయ చౌదరిని ఏ2గా చేర్చారు. నితీష్, తరుణ్ ఫోన్లలో మాత్రం జీవన్‌తో చేసిన చాటింగ్‌లకు సంబంధించిన కొంత డేటా అందుబాటులో ఉన్నట్టు తెలిసింది. ఎండీఎంఏ ఆర్డర్ కావాల్సినప్పుడల్లా జీవన్, రింకీతో ఎక్కువగా వాట్సాప్ కాల్స్ మాట్లాడినట్టు పోలీసులు గుర్తించారు. మరోపక్క జీవన్‌కు ఎండీఎంఏ రుచి చూపించిన నూజివీడుకు చెందిన మనోహర్ చరిత్రను కూడా పోలీసులు బయటకు లాగుతున్నారు. పార్శిల్‌లో వచ్చిన డ్రగ్‌ను హైదరాబాద్‌కు చేర్చిన ట్రాకర్ ఆన్, డీటీడీసీ కొరియర్ సంస్థలకు పోలీసులు నోటీసులిచ్చే యోచనలో ఉన్నారు.

కరెంట్ షాక్

(5వ పేజీ తరువాయి)

ఫలానా అంటూ ఏపీఈఆర్సీ టారిఫ్ ఆర్డర్ 2019-20, 398 గైడ్‌లైన్స్ ప్రకారం లీడ్‌బ్లాక్‌ను మీటరు నుంచి తొలగించామని, ఇక నుంచి యుటిలిటీ పవర్ ఫ్యాక్టర్‌ను మెయిన్‌టైన్ చేయాల్సిందిగా పేర్కొన్నారు. లోడ్ లేనపుడు కెపాసిటర్‌ను ఆఫ్ చేసుకోవాలని, పీఎఫ్‌కు తగినంత (ఎక్కు వ, తక్కువ కాకుండా) కెపాసిటర్‌ను కలుపుకోవాలని, అవసరమైతే ఆటోమేటిక్ పవర్ ఫ్యాక్టర్ కంట్రోలర్(ఏపీఎఫ్‌సీ) పెట్టుకోవాలని కూడా నిర్దేశించారు. రోజూ మీటర్ కేడబ్ల్యూహెచ్, కేవీఏహెచ్, పవర్ ఫ్యాక్టర్‌ను చె క్ చేయాలని, ఇవన్నీ పాటించకపోతే అధిక విద్యుత్ బిల్లులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. అయితే, ఈ నోటీసుపై విద్యుత్ శాఖ అధికారుల సంతకాలు లేవు. నోటీసులను విద్యుత్ శాఖ అధికారులు ఇవ్వలేదు. అదానీ సిబ్బందే ఈ సంతకం లేని నోటీసులను తీసుకురావటం గ మనార్హం. విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తే తాము నోటీసులు ఇవ్వలేదంటున్నారు. అలాంటపుడు అదానీ సిబ్బందికి దుందుడుకుతనంగా వ్యవహరించే అధికారం ఎవరిచ్చారని పారిశ్రామికవేత్తలు ప్రశ్నిస్తున్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

ముగిసిన శిక్షణ తరగతులు

భారతీనగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన ఇన్ఫోసిస్ ల్యాబ్ ఆన్ వీల్స్ ఆన్‌లైన్ శిక్షణా తరగతులు శుక్రవారం ముగిసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. విజయసారథి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతులలో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక నైపుణాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణ విద్యార్థుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించడానికి, భవిష్యత్తులో ఉద్యోగావకాశాలను మెరుగుపరచడానికి ఎంతో సహాయపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధికల్పన అధికారి వై సత్యబ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తెగిన ఇనుప గొలుసు



ఊడిపోయిన సీటు



పాక్షికంగా దెబ్బతిన్న బెంచ్

పనిచేయని ఆటపరికరాలు

- చెత్తాచెదారంతో దర్శిపేట పార్క్
- ఆటపరికరాలకు మరమ్మతులు చేయించండి: స్థానికులు

పటమట, ఆంధ్రజ్యోతి: పటమట దర్శిపేటలో ఉన్న పార్క్‌లో పనిచేయని పరికరాలు, చెత్తచెదారంతో అధ్వానంగా ఉంది. ఈ పార్క్‌కు ఉదయం, సాయంత్రం పెద్దలు, చిన్నలు అధిక సంఖ్యలో వెళుతుంటారు. పెద్దలు వ్యాయామం చేసేందుకు పరికరాలు ఉన్నాయి. పిల్లలు ఊగే ఊయల, సీసా ఆట పరికరాలు ఉన్నాయి. అయితే పిల్లల ఊయల పెద్దలు ఊగడంతో అవి ఊడిపోయి ఇనుప గొలుసులు దర్శనమిస్తున్నాయి. సీసా ఆట పరికరానికి ఒక వైపు సీటు ఊడిపోయింది. ఊయల తిప్పితే తిరగడం లేదు. బల్లలు దెబ్బ తిన్నాయి. వేసవి కావడంతో చెట్ల నుంచి రాలిన ఆకులు, వ్యర్థాలతో పార్క్‌లో అపరిశుభ్రం నెలకొంది. పెద్ద మొత్తంలో వ్యర్థాలను ఒక గుట్టగా పెట్టారు. సంబంధిత అధికారులు స్పందించి ఆట పరికరాలకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



పార్క్‌లో వ్యర్థాల గుట్ట

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాణిగారితోట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు స్క్యూ బ్రిడ్జి సెక్షన్, స్క్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ పోలీస్ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్య నిర్వాహక ఇంజనీర్ పి. రవీంద్రబాబు తెలిపారు. సత్యనారాయణ నగర్, పోలీస్ కాలనీ, హెడ్ పోస్టాఫీసు, ఎస్‌బీఐ బాలాజీ నగర్, ఉదగిరి గంగయ్య రోడ్డు, కోరవారి వీధి, కొత్త ఆంజనేయ స్వామి గుడి, జీఎల్ రావు ప్లాట్స్, మహితా పబ్లిక్ స్కూల్, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాలను నివారించండి

- ఆర్అండ్‌బీ ఎస్ఈకి యర్రంశెట్టి వినతి

కృష్ణలంక, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక జాతీయ రహదారిపై సత్యం హోటల్ సెంటర్‌లో నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడంలో తమ వంతు పాత్ర పోషించాలని రోడ్డు సేఫ్టీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు శుక్రవారం ఆర్అండ్‌బీ ఎస్ఈ టి.సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం కృష్ణలంక నుంచి జాతీయ రహదారిని దాటే సమయంలో పలువురు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో సబ్‌వే ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్స్‌కు ఏర్పాటుకు సహకరించాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎస్ఈ పై సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు.

దుర్గాఘాట్ ప్రక్షాళన పనులు

ఇంద్రకీలాద్రి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు పుణ్యస్నానాలు చేసే దుర్గాఘాట్‌లో పరిస్థితులు అధ్వానంగా ఉండటాన్ని దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్ పలుమార్లు స్వయంగా పరిశీలించారు. ఘాట్‌లో సమస్యలు పరిష్కరించాలని, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అందులో భాగంగా శుక్రవారం డీఈఈ రవీంద్రనాథ్ ఠాగూర్ ఆధ్వర్యంలో దుర్గాఘాట్‌లో పనులు కొనసాగాయి. భక్తులు కాళ్లు కడుగుకునే నీళ్లు మళ్లీ రేవులోకి చేరకుండా ఏర్పాట్లు, మెట్ల మీద మట్టి తొలగింపు, వివిధ సూచిక బోర్డులు ఏర్పాటు, నదిలో షాంపూ, సబ్బు వాడకుండా నిరంతరం మైక్ ప్రచారం ఏర్పాటు చేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. కృష్ణానది పవిత్రత కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని, భక్తుల సౌకర్యార్థం స్నానాల రేవులో ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి, సమాచారం అందించాలని ఈవో ఆదేశించారు.



పనులు చేయిస్తున్న ఆలయ ఇంజనీరింగ్ అధికారులు

వర్షాకాలంలో తలెత్తే సమస్యలపై
ముందస్తు చర్యలు చేపట్టాలి

టెలీకాన్ఫరెన్స్‌లో నగర కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వర్షంకాలంలో తలెత్తే సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని శాఖాధిపతులను వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వర్షాకాలానికి ముందు సమగ్ర ప్రణాళికపై నగర కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ శాఖాధిపతులు, సచివాలయం సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో వర్షాలు కురిసినప్పుడు ఎటువంటి సమస్యలు తలెత్తుతాయి, ఏ విధంగా పరిష్కరించాలి, తాత్కాలికంగా ఎటువంటి చర్యలు తీసుకోవాలి, శాశ్వత పరిష్కారానికి ఏం చేయాలో వంటి అంశాలతో పూర్తి నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రమాదకరమైన గుంతల వివరాలపై నివేదికలు సమర్పించాలన్నారు. వర్షం కురిసినప్పుడు రోడ్లపైన ఏఏ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటుందో ఆ ప్రదేశాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి అక్కడ నీరు తొలగించడానికి వీలుగా నగరపాలక వాహనాలను కేటాయించేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వర్షం కురిసిన సమయంలో గుంతల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకవేళ ప్రమాదవశాత్తు వరదలు వస్తే ముంపు ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతవాసులను పునరావాస కేంద్రాలకు తరలించేటట్లు చర్యలు తీసుకునేలా ప్రణాళికలు చేపట్టాలన్నారు. మరోవైపు నగరంలో ఉన్న కాలువల్లో డీసిల్టింగ్ ప్రక్రియను శరవేగంగా నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు.

మలేరియాపై విస్తృతంగా అవగాహన కల్పించండి

వర్షాకాలం దృష్ట్యా నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో దోమలు ఉత్పత్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలకు విస్తృతంగా మలేరియాపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగరపాలకసంస్థ ప్రధానకార్యాలయంలోని ఆయన చాంబర్‌లో శుక్రవారం మలేరియా మాసోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంలో కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రతి సచివాలయంలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఫ్రైడే డ్రై డే గా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, బయాలజిస్ట్ సూర్యకుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మలేరియా మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

కబేళాలో పశువధకు ఏర్పాట్లు

కార్పొరేషన్: గోహత్య నిషేధ చట్టం అమలులో ఉందని, దీని ప్రకారం ఆవులను చంపడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని, బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులను చంపడానికి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పండుగ వేళ పశువధ నిర్వహించుకునేందుకు నగరపాలకసంస్థ కబేళాలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు, వసతులు కల్పించినట్లు తెలిపారు. నగరంలో బీఫ్ వ్యాపారులు విధిగా సూచనలు పాటిస్తూ, అధికారులతో సహకరించి ప్రభుత్వం ఇచ్చిన సూచనలకు అనుగుణంగా వ్యాపారాలు సాగించుకోవాలని కమిషనర్ సూచించారు.

9 నుంచి పటమట రైతుబజారుకు సెలవులు

పటమట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పటమట రైతు బజారు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 9 నుంచి 11 వరకు సెలవులు ప్రకటించినట్లు పటమట రైతు బజారు ఎస్టేట్ అధికారి రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదార్లు ఈమూడు రోజులు ఏపీఐఐసీ కాలనీలో ఉన్న రైతు బజారు సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కబేళా వద్ద పోలీసు బందోబస్తు

ఆవులను సురక్షిత ప్రాంతాలకు తరలించిన పోలీసులు

విద్యాధరపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బక్రీదు పండగను పురస్కరించుకుని విద్యాధరపురం కబేళాలో ఆవులను వధించకుండా భవానీపురం సీఐ ఉమామహేశ్వర రావు పర్యవేక్షణలో అక్కడ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కబేళాలో ఉన్న ఆవులను వాటి యజమానులకు అప్పగించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బక్రీదు సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి ఆవులను కబేళాకు తరలించే అవకాశం ఉందనే సమాచారంతో గో పరివార్ జేఏసీ నాయకులు వారం రోజుల నుంచి కబేళా వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

కొందరు గోవులను కబేళాకు తీసుకురావటం గమనించి వారిని అడ్డుకుని భవానీపురం పోలీసులకు సమాచారం తెలియపరిచారు. పశ్చిమ ఏసీపీ దుర్గారావు, భవానీ పురం సీఐ ఉమామహేశ్వర రావు, పలువురు సీఐలు తమ సిబ్బందితో వెళ్లి కబేళాలో ఉన్న ఆవుల వివరాలను అక్కడ ఉన్న కార్పొరేషన్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న ఆవులను పోలీసులు వాటి యజమానులకు అప్పగించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గత మూడు నాలుగు రోజుల నుంచి మొత్తం సుమారు 80 ఆవులను కబేళా నుంచి పంపినట్లు సీఐ తెలిపారు. ప్రస్తుతం కబేలా వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.



గో పరివార్ జేఏసీ నాయకులతో కలిసి కబేళాలో ఉన్న ఆవులను పరిశీలిస్తున్న భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు

దుర్గగుడిలో అలరించిన నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం మహామండపం ప్రాంగణంలో ఉన్న కళావేదికపై శుక్రవారం శ్రీలిఖిత శ్రీ నృత్య కళాశాల, నందికొట్కూరుకు చెందిన కళాబృందం అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. శ్రీలిఖిత శ్రీ నృత్య కళాశాల గురువు డి.సాయి లిఖితశ్రీ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. పలు కీర్తనలకు 9 మంది కళాకారులు లయబద్ధంగా కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం దేవస్థానం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.



ముగిసిన చెస్ క్రీడా సంబరాలు

విజయవాడ(స్పోర్ట్స్), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గత వారం రోజుల నుంచి జరుగుతున్న చెస్ క్రీడాసంబరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఇండియా 11వ గ్రాండ్ మాస్టర్ తెజేష్ బకరే మాట్లాడుతూ రాష్ట్రంలో చెస్ క్రీడాకారులందరూ ఎంతో నైపుణ్యత కలిగిన వారని, వారికి మంచి భవిష్యత్తు ఉందని రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా మంచి మెడల్స్ తెస్తారని తెలిపారు. అనంతరం చెస్ కోచింగ్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్, మొమెంటోస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సీఈవో కొడాలి జాహ్నవి, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ పి.రేణుక, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ఎం.ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఐటీఐలో జనరల్ పూల్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ 9న

భారతీనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో అడ్మిషన్లకు ఈ నెల 5,6 తేదీల్లో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సీటు రాని అభ్యర్థులు ఈ నెల 9న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్న జనరల్ పూల్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి మార్కుల జాబితా, టీసీ, కులధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీసర్టిఫికెట్ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్ పొందిన అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మినహా ఇతర కేటగిరీల అభ్యర్థులు రూ.60 డిపాజిట్ చెల్లించాలని, ప్రైవేట్ ఐటీఐలో చేరే అభ్యర్థులు వారి నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 0866-2475575, 9490639639, 7780429468 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

87మంది విద్యార్థులకు అడ్మిషన్లు

2025-26 విద్యా సంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో మొదటి విడత అడ్మిషనకు శుక్రవారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన రెండో రోజు కౌన్సెలింగ్‌లో 161 మంది అభ్యర్థులను ఆహ్వానించగా 102 మంది హాజరయ్యారు వారిలో 87మంది విద్యార్థులకు వివిధ ట్రేడ్లలో అడ్మిషన్లు కేటాయించినట్లు ప్రిన్సిపాల్ కనకారావు తెలిపారు.

నాలుగు కేంద్రాల్లో మెగా డీఎస్సీ - 2025



కానూరు డొంకరోడ్డులోని శ్రీ విజయదుర్గా ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ కేంద్రంలో నెంబర్ చూసుకుంటున్న అభ్యర్థులు, సెంటర్‌లో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు చెక్ చేస్తున్న సిబ్బంది

కానూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా శుక్రవారం మెగా డీఎస్సీ-2025 కానూరులోని నాలుగు కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ, ఆయాన్ డిజిటల్ జోన్ ఐడీజడ్, ప్రసాద్ వీ పొట్లూరి సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కానూరు డొంకరోడ్డులోని శ్రీ విజయదుర్గా ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ కేంద్రాల్లో డీఎస్సీ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహించారు. అభ్యర్థులను తనిఖీలు నిర్వ హించి పరీక్షా కేంద్రాలకు అనుమతించారు. ఎలక్ట్రానిక్ వస్తువుల సహా అభ్యర్థులు ఎలాంటి వస్తువులను పరీక్షా కేంద్రాలకు అనుమతించలేదు.

రీ వెరిఫికేషన్‌తో మారిన టెన్త్ ఫలితాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి మూల్యాంకనలో తప్పులు రీవెరిఫికేషన్‌తో బయటపడుతున్నాయి. తప్పిన విద్యార్థులు పాసవుతుండటంతో పాటు మార్కుల్లో భారీ వ్యత్యాసాలు బయటపడ్డాయి. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో వీరవల్లికి చెం దిన దిమ్మిట జయశ్రీ అన్ని సబ్జెక్టలలోను 90పైగా మార్కులు సాధించి గణితంలో (24 మార్కులు) ఫెయిల్ అయ్యింది. రీ వెరిఫి కేషన్‌కు దరఖాస్తు చేయగా గణితంలో 93మార్కులు రావడం తో ఫలితం మారి పాసైంది. డి.జయశ్రీ సోషల్‌లో 29 మార్కులతో ఫెయిల్ అవ్వగా రీవెరిఫికేషన్‌లో 35 మార్కులతో పాసైంది. జి. శ్రావ్యశ్రీ సోషల్ మార్కులకు రీవెరిఫికేషన్ దరఖాస్తు చేయగా గతంలో 97 మార్కులు రాగా ఇప్పుడు 99 మార్కులు సాధించడంతో మండల స్థాయిలో 591 మార్కులు సాధించి ప్రథమస్థానం కైవసం చేసుకుంది. గ్రామీణ ప్రాంతమైన వీరవల్లిలోని వాణివిద్యానికేతన్ విద్యార్థులైన వీరిని ప్రిన్సిపాల్ నందిగం రవికుమార్ అభినందించారు.





క్షిప్ర గణపతి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న నందమూరి మోహనకృష్ణ దంపతులకు ప్రసాదం అందజేస్తున్న ఎస్ఎల్‌వీ గ్రూప్ ఛైర్మన్ పెన్మెత్స శ్రీనివాసరాజు దంపతులు

ఎస్ఎల్‌వీ అమరావతి గ్రాండ్-3లో వైభవంగా క్షిప్ర గణపతి విగ్రహ ప్రతిష్ఠ

గుణదల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇన్నర్ రింగ్ రోడ్డు వద్దగల ఎస్ఎల్‌వీ అమరావతి గ్రాండ్-3 నందు క్షిప్ర గణపతి విగ్రహ, ఆలయ శిఖర ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా జరిగిది. ఎస్ఎల్‌వీ గ్రూప్ ఛైర్మన్ పెన్మత్స శ్రీనివాసరాజు దంపతుల ఆధ్వర్యంలో జరిగిన క్షిప్ర గణపతి విగ్రహ ప్రతిష్ఠలో నందమూరి మోహన కృష్ణ దంపతులు ప్రత్యేక అతిథులుగా విచ్చేశారు. ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎస్ఎల్‌వీ సీఈవో, డైరెక్టర్ వేగేశ్న అప్పల నరసింహరాజు (నాని), ఎస్ఎల్‌వీ డైరెక్టర్ ఉప్పలపాటి చైతన్య వర్మ, ఎం.నగేష్, ఏపీఐఐసీ ఛైర్మన్ ఎం.రాంబాబు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎస్ఎల్‌వీ గ్రూప్ ఛైర్మన్ పెన్మత్స శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలన్న ఆలోచనతో ఎస్ఎల్‌వీ అమరావతి గ్రాండ్-3 వద్ద క్షిప్ర గణపతి ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ అనంతరం అన్న సంతర్పణ చేశారు.



విమానాశ్రయంలో దుర్గమ్మ చిత్రపటాలను వీక్షిస్తున్న ఈవో శీనానాయక్

విమాన ప్రయాణికులకు దుర్గమ్మ కరుణాకటాక్షాలు

వన్‌టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : విమాన ప్రయాణికులకు దుర్గమ్మ కరుణాకటాక్షాలు అందుబాటులో ఉండేలా విజయవాడ విమానాశ్రయంలో ఏర్పాట్లు చేస్తామని దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్ అన్నారు. ఎరైవల్, డిపార్చర్ బ్లాక్‌ల వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ ప్రత్యేక చిత్రపటం, కౌంటర్‌ను శుక్రవారం సందర్శించారు. గతంలో ప్రతి శుక్రవారం అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో పూజలు జరిపే వారని, నాలుగైదు సంవత్సరాలుగా అందుబాటులో లేవని విమానాశ్రయం సిబ్బంది ఈవో శీనా నాయక్‌కు వివరించారు. కనకదుర్గమ్మ ఆశీస్సులు అందరికీ అందేలా పూర్వం మాదిరిగా ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేస్తానని ఈవో శ్రీనానాయక్ తెలిపారు. త్వరలో అధునాతన కౌంటర్ ఏర్పాటు చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వరరావును ఆదేశించారు.



బాలకార్మిక నిర్మూలనపై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఐక్య కృషి

కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపైనా వుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో శుక్రవారం కార్మిక, మహిళా శిశు సంక్షేమ శాఖ, చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (సీఆర్ఏఎఫ్) ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై రూపొందించిన వాల్ పోస్టరును లక్ష్మీశ ఆవిష్కరించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బాలకార్మిక వ్యతిరేక మాసం సందర్భంగా ఈనెల 30వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బాల కార్మికులను గుర్తించాలన్నారు. బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే ఫోన్ నెం.100, 1098, 1800 102 7222 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఉప కార్మిక కమిషనర్ సిహెచ్.ఆశారాణి, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.రాజేశ్వరరావు, వాసవ్య మహిళా మండలి డాక్టర్ వి.కీర్తి, సీఆర్ఏఎఫ్ ప్రతినిధి ప్రభాకర్, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ సభ్యులు ఎ.రమేష్, సహాయ కార్మిక అధికారులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, వేదికపై మాజీ మంత్రి వడ్డే తదితరులు

ఆపరేషన్ బుడమేరు అమలు కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన దీక్ష 14న

వన్‌టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ బుడమేరును అమలు చేయాలని కోరుతూ సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 14న నిరసన దీక్ష చేపట్టాలని శుక్రవారం గాంధీనగర్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, విశ్రాంత ఇరిగేషన్ ఇంజనీర్ కంభంపాటి పాపారావు, ఐఎఫ్‌టీయు నాయకుడు ప్రసాద్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. తక్షణం ఆపరేషన్ బుడమేరును అమలు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఎనిమిది నెలల క్రితం బుడమేరు వరదల వల్ల చోటు చేసుకున్న పరిణామాలను గుర్తు చేశారు. విశ్రాంత ఇరిగేషన్ అధికారి కంభంపాటి పాపారావు మాట్లాడుతూ బుడమేరు సమస్యకు పరిష్కారం చూపకపోతే ప్రతిఏటా నగరానికి ముప్పు తప్పదన్నారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ పైభాగాన అవసరమైన జలాశయాలను నిర్మించి వరద ముంపును కొంతమేరకు తగ్గించవచ్చన్నారు. దోనేపూడి శంకర్ మాట్లాడుతూ, ఎనికేపాడు నుంచి సముద్రం వరకు బుడమేరు కాలువపై ఉన్న ఆక్రమణలు తొలగించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని, ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో రైతుల అర్జీల పరిష్కారం

కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : అసైన్డ్ భూములపై రైతుల నుంచి అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సాయి సూర్యప్రవీణ్‌చంద్ తెలిపారు. రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. అసైన్డ్ భూముల సమస్యలకు సంబంధించి, రిటర్నబుల్ ప్లాట్ల వీధి పోటు సమస్యల గురించి రాజధాని ప్రాంతవాసులు అర్జీలను అందజేశారు. వీధి పోటు అర్జీలను సీఆర్‌డీఏ ప్లానింగ్ విభాగానికి పంపించి పరిష్కరిస్తామన్నారు. సీఆర్‌డీఏలోని వివిధ విభాగాల అధికారులు హాజరై అధిక శాతం ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి.సాయి శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, కె.ఎస్.భాగ్యరేఖ, పి.పద్మావతి, ఏజీ చిన్నికృష్ణ, కె.స్వర్ణమేరీ, జి.భీమారావు, సీఆర్‌డీఏ డీసీడీఓ బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విశ్వాసానికి ప్రతీక బక్రీద్



(ఆంధ్రజ్యోతి- విజయవాడ) : ముస్లింలకు అత్యంత ముఖ్యమైన బక్రీద్ (ఈద్-అల్- అజ్హా)ను త్యాగానికి, విశ్వాసానికి, దైవభక్తికి ప్రతీకగా పేర్కొంటారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో 12వ నెలైన జుల్-హిజ్జాలో పదో రోజున, రంజాన్ పండుగ పూర్తైన 70 రోజులకు బక్రీద్‌ను జరుపుకుంటారు. బక్రీద్ పండుగతోనే హజ్ యాత్ర కూడా ముగుస్తుంది. జూన్ 7న బక్రీద్ సందర్భంగా ప్రత్యేక కథనం.

బక్రీద్ పరమార్థం..

ప్రవక్త ఇబ్రహీం(అలైహిస్సలాం) తన కుమారుడైన ఇస్మాయిల్‌ను అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం బలి ఇవ్వడానికి సిద్ధమవుతాడు. కానీ అల్లాహ్ ప్రవక్త విశ్వాసాన్ని పరీక్షించి, చివరి క్షణంలో ఇస్మాయిల్‌కు బదులుగా ఒక పొట్టేలును బలిగా ఇవ్వమని కోరుతాడు. ఈ సంఘటన భక్తికి, విశ్వాసానికి ప్రతీకగా ముస్లిం సోదరులు నమ్ముతారు. ఈ సంఘటనను స్మరించుకోవడానికి బక్రీద్ పండగను జరుపుకుంటారు. బక్రీద్ అంటే బకర్ ఈద్ అని అర్థం. బకర్ అంటే జంతువు అని, ఈద్ అంటే పండుగ అని అర్థం ఉన్నాయి. జంతువును ఖుర్బానీ (దానం) ఇచ్చే పండుగ కావడంతో దీనిని ఈదుల్ ఖుర్బానీ అని కూడా పిలుస్తారు. త్యాగ నిరతిని కలిగి ఉండడం, స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవతను చూపాలన్నదే బక్రీద్ పండుగలోని ప్రధాన పరమార్థం. బక్రీద్ త్యాగం, నిస్వార్థం, దైవభక్తికి ప్రతీకగా నిలుస్తుంది. సమాజంలో ఐక్యత, దయ, పరుల పట్ల ఉపకార భావనను ప్రోత్సహించేలా చేస్తుంది. బక్రీద్ పండగ రోజు పేదలకు దానం చేయడం ద్వారా సమా జంలో సామాజిక న్యాయానికి దోహదపడుతుంది.

ఈర్ష్యా, ద్వేషాలను త్యాగం చేయాలి



బక్రీద్ అంటే ఈర్ష్య, ద్వేషాలను త్యాగం చేయడమే. ఖుర్బానీ ఇచ్చే జంతువు రక్తం లేదా మాంసం అల్లాహ్‌కు అవసరం లేదు. అందుకే బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీకగా చూస్తాం. అమితంగా ఇష్టమైన వాటిని త్యాగం చేయాలని హజ్రత్ ఇబ్రహీం ప్రవక్తకు అల్లాహ్ ఆదేశిస్తే తన ప్రాణానికి ప్రాణమైన సొంత కొడుకునే త్యాగం చేయడానికి సిద్ధం అవుతాడు. అల్లాహ్ పెట్టిన పరీక్షలో తండ్రీకొడుకులిద్దరూ దీవెనలు పొందుతారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏం త్యాగం చేయాలో మా మనస్సులకు బాగా తెలుసు. జంతువు ఖుర్బానీ కేవలం ప్రవక్త ఇబ్రహీం ఆచరణ మాత్రమే. నిజమైన త్యాగమంటే ఏంటనేది ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి. **- షబ్లీ, మత పెద్ద**

హజ్ యాత్రతో సంబంధం

బక్రీద్ పండుగ, హజ్ యాత్ర ముగింపు ఒకే రోజు జరుపుకుంటారు. హజ్ యాత్ర చేసే వారు మక్కాలో కాబా చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ప్రపంచంలోని ముస్లింలు హజ్ యాత్రికులతో సమానంగా ప్రార్థనలు చేస్తారు. బక్రీద్ అల్లాహ్‌పై ముస్లింలకున్న నమ్మకాన్ని మరింత దృఢపరుస్తుందని విశ్వసిస్తారు.

దానం చేయడం కోసమే..

బక్రీద్ రోజు మేకలు, గొర్రెలు, ఒంటెలను బలివ్వడంతో పాటు మాంసాన్ని మూడు భాగాలుగా చేస్తారు. ఇందులో ఒక భాగం పేదలకు, రెండో భాగం బంధువులకు ఇవ్వగా, మూడో భాగాన్ని కుటుంబ సభ్యులు ఆహారంగా తీసుకుంటారు. ఈ ఆచారాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లింలు పాటిస్తారు. త్యాగం, దానం, ధర్మం, సామాజిక సమతుల్యతకు ప్రతీకగా బక్రీద్‌ను భావిస్తారు. బక్రీద్ రోజు 'ఈద్ నమాజ్' నిర్వహిస్తారు. మటన్ బిర్యానీ, షీర్ కుర్మా వంటి ప్రత్యేక వంటకాలు తయారు చేసి బంధువులు, ఇరుగుపొరుగుతో కలిసి ఆనందంగా పండగ చేసుకుంటారు.



ప్రత్యేక నమాజ్ వేళలు

బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ముస్లిం సోదరులు ఉదయం నుంచే అధిక సంఖ్యలో ప్రార్థనల్లో పాల్గొంటారు. విజయవాడ నగరంలోని పలు మసీదుల్లో నమాజ్ వేళలు ఇలా ఉన్నాయి. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఉదయం 7 గంటలకు నమాజ్ ప్రారంభమవుతుంది. సనత్‌నగర్ అక్బర్ సహాబ్ గోడౌన్ మసీదులో ఉదయం 6.10 గంటలకు, పంటకాలువ రోడ్ మసీదులో ఉదయం 6.30 గంటలకు, భవానీపురం మదర్సా జామియా మసీదులో ఉదయం 6 గంటలు, శాంతినగర్, సింగ్‌నగర్ ఆమినాహ్ మసీదులో ఉదయం 6.15 గంటలకు, పంజాసెంటర్ మసీదులో ఉదయం 7 గంటలకు బక్రీద్ ప్రార్థనలు మొదలవుతాయి.

విద్యాదాత అంకినీడు ప్రసాద్ అస్తమయం

చల్లపల్లి/వన్‌టౌన్/విజయవాడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చల్లపల్లి రాజా తనయుడు, మచిలీపట్నం మాజీ పార్లమెంటు సభ్యుడు శ్రీమంతు రాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్ (86) శుక్రవారం ఉదయం తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. అంకినీడు ప్రసాద్ అప్పుడప్పుడూ చల్లపల్లి కోటకు వచ్చి కొన్నాళ్లు ఇక్కడ ఉండేవారు. చల్లపల్లిలోని శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామప్రసాద్(ఎస్ఆర్‌వైఎస్‌పీ) హైస్కూల్ అండ్ కళాశాలకు ఆయన కరస్పాండెంట్‌గా ఉన్నారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేశారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాలైన మోపిదేవి సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం, పెదకళ్లేపల్లి దుర్గా నాగేశ్వరస్వామి ఆలయం, శ్రీకాకుళం శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయం, యార్లగడ్డ శివాలయానికి ట్రస్టీగా కొనసాగుతున్నారు.

బందరు ఎంపీగా సేవలు

1967లో భారత పార్లమెంటుకు నాల్గవసారి జరిగిన ఎన్నికల్లో మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన అంకినీడు ప్రసాద్ 60 వేల పైచిలుకు ఆధిక్యంతో ఘనవిజయం సాధించారు. 1967-72 మధ్య బందరు ఎంపీగా ప్రజలకు సేవలు అందించారు.

మచిలీపట్నంలో అంత్యక్రియలు

అంకినీడు ప్రసాద్ అంత్యక్రియలు ఆదివారం మచిలీపట్నం శివగంగలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కోయంబత్తూరు నుంచి ఆయన భౌతికకాయాన్ని శనివారం ఉదయం హైదరాబాద్‌కు, అక్కడ నుంచి రోడ్డుమార్గంలో మధ్యాహ్నానికి చల్లపల్లి తీసుకురానున్నారు. ప్రజల సందర్శనార్థం చల్లపల్లి రాజా హైస్కూల్‌లో భౌతికకాయాన్ని ఉంచి రాత్రికి శివగంగ తీసుకువెళతారు. ఆదివారం ఉదయం శివగంగలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంకినీడు ప్రసాద్ కుమార్తె అమెరికా నుంచి ఆదివారం ఉదయం శివగంగకు చేరుకుంటారు.

పేదల విద్యాభివృద్ధికి విశేష కృషి: మంత్రి నారా లోకేశ్

రాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్ మృతి పట్ల రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సంతాపం ప్రకటించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విడుదల చేసిన ఒక సందేశంలో విద్య, రాజకీయ, సామాజిక రంగాలలో అంకినీడు ప్రసాద్ చేసిన విశేష సేవలను కొనియాడారు. చల్లపల్లిలో ఎస్ఆర్‌వైఎస్‌పి జూనియర్ కళాశాల కరస్పాండెంట్‌గా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. జమిందార్ వ్యవస్థలో ప్రజలకు అన్ని విధాల అండగా నిలిచిన చరిత్ర చల్లపల్లి జమీందారు, ఆయన వంశీయులకే సొంతమని పేర్కొన్నారు. మోపిదేవి, శ్రీకాకుళం, పెదకళ్లేపల్లి, యార్లగడ్డ, శివగంగ ప్రాంతాలలో దేవాలయాల అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. ఆయన మరణం చల్లపల్లి ప్రాంతానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎమ్మెల్యేలు బుద్ధప్రసాద్, యార్లగడ్డ సంతాపం

అంకినీడు ప్రసాద్ మృతిపై అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రగాఢ సంతాపం తెలిపారు. అంకినీడు ప్రసాద్ మృతి చల్లపల్లి ప్రాంతానికి తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ప్రసాద్ బహద్దూర్ మరణం తమ కుటుంబానికి, సమాజానికి తీరని లోటన్నారు.



ఒత్తిడి రహిత జీవితానికి యోగా

సత్యనారాయణపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఒత్తిడి రహిత జీవితానికి యోగా ఉపయోగపడుతుందని, అనేక రుగ్మతల నుంచి యోగా రక్షణ కల్పిస్తుందని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టిఎస్‌రోడ్డు యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికార యంత్రాంగం, నగరపాలకసంస్థ, బార్ అసోసియేషన్ భాగస్వామ్యంతో శుక్రవారం లాయర్‌లతో థీమ్ యోగా కార్యక్రమం జరిగింది. కలెక్టర్ లాయర్లతో కలిసి యోగాసనాలు వేశారు. ఆర్డీవో కావురి చైతన్య, బెజవాడబార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏకే. బాషా, సెక్రటరీ వి.రంగారావు, జున్ను శ్రీధర్, పి.శ్రీనివాసరావు, డీ ఎంహెచ్‌వో డా.ఎం.సుహాసిని, ఆయుష్ అధికారులు డాక్టర్ వి.రాణి, డాక్టర్ రత్నప్రియదర్శిని పాల్గొన్నారు.



ఎన్టీటీపీఎస్‌లో ఏపీ ఎస్పీఎఫ్ యోగా

ఇబ్రహీంపట్నం : యోగా వల్ల శారీరక, మానసిక, సామాజిక, అధ్యాత్మిక ప్రయోజనాలు కలుగుతాయని ఏపీఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీఎం త్రివిక్రమ వర్మ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల సందర్భంగా ఏపీ ఎస్పీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్టీటీపీఎస్‌లో ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు చెందిన 300 మంది అధికారులు 50 నిముషాల పాటు యోగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా త్రివిక్రమ పాల్గొని యోగాసనాలు వేశారు. యోగా ప్రోటోకాల్ కార్యక్రమాన్ని శాంతివన్ యోగ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లంకే జనార్ధన్ నిర్వహించారు. ఎస్‌పీ.ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ బి.వెంకట రామిరెడ్డి, డాక్టర్ ఎన్టీటీపీఎస్ ఎస్ఈ పి.శివ రామాంజనేయులు, విజయవాడ జోన్ కమాండెంట్ కృష్ణమాచారి, సెక్రటేరియేట్ ఎ.సి.పి.వి.ఎ్ న.ఎన్ మల్లికార్జునరావు, హైకోర్టు ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కె.శ్రీనివాసులు, గన్నవరం ఎయిర్ పోర్టు అసిస్టెంట్ కమాండెంట్ టి.కె.రావు, విజయవాడ గాట్స్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, ఎస్సైలు, ఏఎస్సైలు సిబ్బంది, లంకే లక్ష్మి, సుబ్రహ్మణ్యం, ఎ.శ్రీనివాసరావు, ఎన్.కృష్ణవేణి, ఉమా, రఘు, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బెజవాడలో కరోనా కలకలం

- ప్రస్తుతం నాలుగు యాక్టివ్ కేసులు
- ఎలాంటి ప్రమాదం లేదన్న జీజీహెచ్ వైద్యులు

విజయవాడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కరోనా మళ్లీ విజృంభిస్తోంది. విజయవాడ నగరంలో ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదవ్వగా ప్రస్తుతం నలుగురు ఐసోలేషన్ వార్డులో ఉన్నారు. వారిలో ముగ్గురు వివిధ వ్యాధులతో బాధపడుతున్నారు. ఒకరికి మాత్రం ఎలాంటి దీర్ఘకాలిక సమస్యలు లేవు. కేవలం కరోనా సోకడంతో ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాదం లే దని జీజీహెచ్ సిబ్బంది తెలిపారు. దీర్ఘకాలిక సమస్యలు లేనివారికి కొత్త వేరియంట్‌తో ప్రమాదం లేదని తెలిపారు.

రూ.13,500 కోట్లే లక్ష్యం

- కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం

మచిలీపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కేడీసీసీబీ) ప్రస్తుతం రూ.11,500 కోట్ల లావాదేవీలతో కొనసాగుతోందని, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రూ.13,500 కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురామ్ అన్నారు. శుక్రవారం తొలిసారిగా మచిలీపట్నంలోని కేడీసీసీబీ ప్రధాన కార్యాలయానికి ఆయన వచ్చారు. వివిధ విభాగాలను సీఈవో శ్యామ్‌మనోహర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేడీసీసీబీ పరిధిలో డ్వాక్రా సంఘాలను రూ.10వేలకు పెంచుతామన్నారు. ఆర్థిక లావాదేవీలు సక్రమంగా నిర్వహించే ఒక్కో డ్వాక్రా సంఘానికి సీఎం చంద్రబాబు సూచనలతో రూ.20 లక్షల వరకు రుణం అందిస్తామని తెలిపారు. ఈ ఏడాది రైతులకు పంట రుణాలు రూ.2వేల కోట్లకు పెంచు తున్నట్లు చెప్పారు. గృహ రుణాలు, విద్యా రుణాలు రూ.75 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఈ మొత్తాన్ని రూ.100 కోట్లకు పెంచాలని ప్రణాళికలో మార్పులు చేశామన్నారు. కేడీసీసీబీ ప్రస్తుతం రూ.75 కోట్ల లాభాల్లో ఉందని, ఈ లాభాలు రూ.100 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బ్యాంకులో డిపాజిట్లు రూ.3,200 కోట్లు ఉన్నాయని, వాటిని రూ.3,500 కోట్లకు పెంచేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లు కంప్యూటరీకరణ చేసిన నేపథ్యంలో రైతులకు పీఏసీఎస్‌ల ద్వారా ఫోన్‌పే సౌకర్యం త్వరలో కల్పించనున్నట్లు చెప్పారు. ఉద్యోగులకు ఇప్పటి వరకు రూ.5లక్షల మేర బీమా సౌకర్యం ఉండగా, ఈ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచుతామన్నారు. ఈ నెలాఖరు నాటికి కేడీసీసీబీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు.



మెగా డీఎస్సీ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తొలిరోజు మెగా డీఎస్సీకి 87.65 శాతం హాజరు

గవర్నర్‌పేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నెల రోజుల పాటు జరిగే మెగా డీఎస్సీ తొలి రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. మొదటి రోజు 87.65 శాతం హాజరు నమోదైంది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన సెషన్-1కు 1,150 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1,008 మంది హాజరయ్యారు. జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 10 పరీక్షా కేంద్రాలతో పాటు తెలంగాణాకు చెందిన కోదాడలో ఒక పరీక్షా కేంద్రంలో నెల రోజుల పాటు 30 వేల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. విజయవాడలో ఎనిమిది సెంటర్లు, మైలవరం, తిరువూరు, కోదాడలలో ఒక్కొక్క పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) కావడంతో సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్‌ను అమలు చేశారు. తిరువూరు, మైలవరం వంటి దూర ప్రాంతాలకు అభ్యర్థులు చేరుకునేందుకు విజయవాడ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. డిఎస్సీ జరుగుతున్న వన్‌టౌన్‌లోని పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు కలెక్టర్ తెలిపారు.

బీటెక్ ఎనిమిదో సెమిస్టర్ ఫలితాలు విడుదల

మచిలీపట్నం టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : బీటెక్ ఎనిమిదో సెమిస్టర్ ఫలితాలను కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాంజీ శుక్రవారం విడుదల చేశారు. 204 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయగా నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు. రిజిస్ట్రార్ ఎన్.ఉష, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ వి.వీరబ్రహ్మాచారి, ఎం.వి.బశ్వేశ్వరరావుపాల్గొన్నారు. పరీక్షల పునః మూల్యాంకనం కోసం జూన్ 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ తెలిపారు. కాగా, కృష్ణా విశ్వవిద్యాలయం స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన హైకోర్టు అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌ను శుక్రవారం ఉపకులపతి మర్యాదపూర్వకంగా కలిశారు.

పర్వతనేని కోటేశ్వరరావు మృతికి సీఎం చంద్రబాబు సంతాపం

ఆటోనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నవత ట్రాన్స్‌పోర్టు వ్యవస్థాపకులు పర్వతనేని కోటేశ్వరరావు (87) మృతికి ముఖ్యమంత్రి చంద్రబాబు తన ట్విట్టర్ ద్వారా సంతాపం వ్యక్తం చేశారు. 1982లోనే దేశం లో మొట్టమొదటిసారిగా నాణ్యమైన రవా ణా సేవలకు శ్రీకారం చుట్టి తొమ్మిది రాష్ట్రాలకు సంస్థ కార్యకలాపాలను వ్యాపింపచేసిన కోటేశ్వరరావు వేలాది మందికి ఉపాధి చూపించారన్నారు. కోటేశ్వరరావు మృతి రవాణా రంగానికి తీరని లోటన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తె లుపుతున్నాను అని ట్విట్టర్‌లో పోస్టు చేశారు.

ఖజానాకు రవాణా వసూళ్లు జమ

జగ్గయ్యపేటరూరల్, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి):

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

దారిలో దందా శీర్షికన ఆంధ్రజ్యోతిలో చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద రవాణ శాఖ వసూళ్లపై వచ్చిన కథనంతో అధికారులు ఉలిక్కిపడ్డారు. విజిలెన్స్ అధికారులతో కలిసి చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద రవాణా అధికారులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. గరికపాడు వద్ద నిబంధనలకు విరుద్ధంగా వెళ్తున్న ఎనిమిది వాహనాలకు రూ.50 వేలు జరిమానా వేశారు. చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద మరో రూ.20వేలు జరిమానా వసూ లు చేశారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు. అనధికార వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తు న్నట్టు ఆధారాలతో ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవటంతో ఇప్పుడు అధికారికంగా జరిమానాలు వేసి ఖజానాకు జమ చేశారు.

ఆటోను ఢీకొన్న కారు

- ఆటో డ్రైవర్ మృతి

పెనుగంచిప్రోలు, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి) : నవాబుపేట క్రాస్ రోడ్డు సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ జాని (40) మృతి చెందాడు. విజయవాడ వైపు నుంచి చిల్లకల్లు వైపు వెళుతున్న ఆటో ను సడన్‌గా పక్కకు తిప్పడంతో వెనుక వస్తున్న కారు ఢీకొట్టింది. ఈఘటనలో ఆటో డ్రైవర్ జానీ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలో ఉన్న కూరగాయలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడ్డాయి. జానీని వైద్యం కోసం నందిగామ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై ఎం.ఎస్.కె అర్జున తెలిపారు.

లారీని ఢీకొన్న బస్సు

తోటచర్ల సమీపంలో 65.వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదే రూట్‌లో వెళుతున్న లారీని ఢీకొంది. అదుపు తప్పిన బస్సు రోడ్డు దిగి చెట్టుకు ఢీకొని ఆగింది. బస్సులో మొ త్తం 40 మంది ప్రయాణికులు ఉన్నారు. గుంటూరుకు చెందిన విజయలక్ష్మికి, బస్సు డ్రైవర్ ఎం.రవి శంకర్‌కు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెజవాడకు చేరిన జగ్గయ్యపేట వైసీపీ పంచాయితీ

- తన్నీరుకు వ్యతిరేకంగా తరలిన కార్యకర్తలు
- సజ్జల, అవినాష్‌లకు పట్టణ వైసీపీ అధ్యక్షుడు వట్టెం ఫిర్యాదు

జగ్గయ్యపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట వైసీపీ కార్యాలయంలో బాహాబాహీ అనంతరం పంచాయితీ బెజవాడకు చేరింది. పార్టీ వాట్సప్ గ్రూపులో పట్టణ వైసీపీ అధ్యక్షుడు వట్టెం మనోహర్, అతని అనుచరుల నెంబర్లను దుర్గగుడి మాజీ డైరెక్టర్ నంబూరి రవి తొలగించటంతో ఏర్పడ్డ వివాదం ముదిరి బాహాబాహీకి దారి తీసిన సంగతి తెలిసిందే. రెండు వర్గాల ఫిర్యాదులతో జగ్గయ్యపేట పోలీసు లు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల కొందరు నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు మద్దతుదారులు జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ వద్దకు వెళ్లి పట్టణ వైసీపీ అధ్యక్షుడు వట్టెం మనోహర్‌ను సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. దీనిపై చర్చించేందుకు జిల్లా మనోహర ఆయన పిలిచారు. శుక్రవారం నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి నేతలు, కార్యకర్తలతో వట్టెం విజయవాడ వెళ్లారు. జిల్లా అధ్యక్షుడు అవినాష్‌కు నియోజకవర్గంలోని పరిస్థితిని వివరించారు. సీనియర్లను విస్మరించి, కొత్త వారికి పదవులు ఇస్తున్నారని, అందరినీ కలుపుకోవటం లే దని ఫిర్యాదు చేశారు. పార్టీ వేదికలపైనా అవకాశం ఇవ్వటం లేదని, ఇలాగే కొనసాగితే పార్టీకి నష్టం జరుగుతుందని వివరించారు. అనంతరం పార్టీ ముఖ్యనేత సజ్జ ల రామకృష్ణారెడ్డిని జగ్గయ్యపేటపై దృష్టి సారించాలని కోరారు. అవినాష్ త్వరలోనే ముఖ్యనేతలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు మనోహర్ చెప్పారు.

మాజీ ఎంపీ జీవీఎల్ మామ ఇంట్లో చోరీ

విజయవాడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు మామ పులిపాక లక్ష్మీనారాయణ ఇంట్లో దొంగలు పడ్డారు. విజయవాడ ఎల్ఐసీ కాలనీ మొదటి రోడ్డులో జీవీఎల్ మామ పులిపాక లక్ష్మీనారాయణకు ఇల్లు ఉంది. లక్ష్మీనారాయణ సతీమణి రామసీతను తీసుకుని రెండు నెలల క్రితం ఢిల్లీకి వెళ్లారు. పనిమనిషి భాగ్యం శుక్రవారం మొక్కలకు నీళ్ల పోయడానికి వెళ్లింది. ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో లక్ష్మీనారాయణకు ఫోన్ చేసి విషయం చెప్పింది. బీరువాలో ఉండాల్సిన రెండు కిలోల వెండి వస్తువులు, రూ.30 వేలు మాయమైనట్టు గుర్తించారు. భాగ్య ఫిర్యాదు మేరకు మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు.


విక్రమ్ సింగ్

రైలులో వైద్య సాయం అందక..

దివ్యాంగ క్రికెటర్ మృతి

న్యూఢిల్లీ: టోర్నమెంట్ ఆడేందుకు వెళ్తున్న దివ్యాంగ క్రికెటర్ ఒకరు రైలులో తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స అందక మరణించిన విషాద ఘటన ఇది. గ్వాలియర్‌లో జరిగే వీల్‌చైర్ క్రికెట్ టోర్నీలో పాల్గొనేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన పంజాబ్ జట్టు బుధవారం రాత్రి ఢిల్లీనుంచి ఛత్తీస్‌గఢ్ ఎక్స్‌ప్రెస్‌లో బయలు దేరింది. రైలు బయలుదేరిన కొద్దిసేపటికే జట్టు సభ్యుడైన 38 ఏళ్ల విక్రమ్‌సింగ్‌కు తీవ్రమైన తల నొప్పి వచ్చింది. దాంతో అతడి సహచరులు అత్యవసర వైద్య చికిత్స కోసం రైల్వే హెల్ప్‌లైన్ నెంబర్ 139కి పదేపదే ఫోన్ చేసినా స్పందన కానరాలేదు. మరోవైపు 90 నిమిషాలు ఆలస్యంగా గురువారం ఉదయం రైలు మథుర స్టేషన్‌కు చేరింది. కానీ అప్పటికే విక్రమ్‌సింగ్ ప్రాణాలు వది లాడు. 'అతడు మా కళ్లెదుటే నొప్పితో విలవిల్లాడాడు. రైల్వే హెల్ప్‌లైన్‌కు పలుమార్లు ఫోన్ చేశాం. కానీ వారి నుంచి స్పందన లేదు' అని విక్రమ్ సింగ్ సహచరుడు కన్నీటి పర్యంతమయ్యాడు. మథుర స్టేషన్‌లో ప్రభుత్వ రైల్వే పోలీసులు విక్రమ్‌సింగ్ భౌతిక కాయాన్ని స్వాధీనం చేసుకొని పోస్ట్‌మార్టానికి తరలించారు. 'ఇది కేవలం విషాదం కాదు. రైల్వే అత్యవసర విభాగం బాధ్యతారాహిత్యానికి అద్దంపడుతుంది' అని విక్రమ్ మరో సహచరుడు మండిపడ్డాడు.

అల్కారజ్ వచ్చేశాడు

ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌కు స్పెయిన్ స్టార్


అల్కారజ్

పారిస్: డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్ ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోకి అడుగుపెట్టాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో అల్కారజ్ ప్రత్యర్థి..ఎనిమిదో సీడ్ లొరెంజో ముసేటి (ఇటలీ) తొడ గాయంతో మ్యాచ్ నుంచి అర్థంతరంగా వైదొలిగాడు. అప్పటికి రెండో సీడ్, స్పెయిన్ స్టార్ అల్కారజ్ 4-6, 7-6 (3), 6-0, 6-2తో ముందంజలో నిలిచాడు. రొలాండ్ గారోస్ తుది పోరులో చోటు ఖాయం చేసుకున్న దరిమిలా..ఓపెన్ ఎరాలో వరుసగా నాలుగేళ్ల ఏదేని గ్రాండ్‌స్లామ్ సింగిల్స్‌లో ఫైనల్‌కు చేరిన పిన్న వయసు ఆటగాడిగా 22 ఏళ్ల అల్కారజ్ రికార్డు సృష్టించాడు. ఈక్రమంలో మాట్స్ విలాండర్, జాన్ బోర్గ్, రఫెల్ నడాల్, బోరిస్ బెకర్ సరసన కార్లోస్ చేరాడు. అల్కారజ్‌తో సెమీఫైనల్లో తొలి సెట్‌ను ముసేటి గెలిచాడు. కానీ పుంజుకున్న అల్కారజ్ రెండో సెట్‌ను టై బ్రేకర్‌లో సొంతం చేసుకొని స్కోరును సమం చేశాడు. ఆపై విజృంభించి మూడో సెట్‌లో అలవోకగా నెగ్గాడు. నాలుగో సెట్‌లోనూ అల్కారజ్ ముందంజలో నిలవగా.. తొడ కండరాల గాయంతో విలవిల్లాడిన ముసేటి మ్యాచ్‌ను కొనసాగించ లేకపోయాడు. రెండున్నర గంటలు సాగిన ఈ పోరులో ముసేటి 2 ఏస్‌లు సంధించగా, అల్కారజ్ ఒకటికే పరిమితమయ్యాడు. అయితే ముసేటి మూడు డబుల్ ఫాల్ట్‌లు, అల్కారజ్ రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. అనవసర తప్పిదాలలో ముసేటి (33), అల్కారజ్ (32) దాదాపు సమంగా నిలిచారు.

'డబుల్' దిశగా సారా: ఇటలీ స్టార్ సారా ఎర్రాని ఫ్రెంచ్ ఓపెన్‌లో 'డబుల్' సాధించే దిశగా దూసుకెళుతోంది. గురువారం మిక్స్‌డ్ డబుల్స్‌లో చాంపియన్‌గా నిలిచిన సారా.. తన దేశానికే చెందిన ఆండ్రియా వవసోరితో కలిసి మహిళల డబుల్స్‌లోనూ ఫైనల్ చేరింది. సెమీఫైనల్లో మూడోసీడ్ సారా/ఆండ్రియా ద్వయం 6-0, 6-1తో రష్యాకు చెందిన నాలుగో సీడ్ జంట మిర్రా ఆండ్రీవా/ష్నిదెర్‌పై గెలిచింది. మరో సెమీస్‌లో అలెగ్జాండ్రా కూనిక్ (సెర్బియా)/అన్నా డానిలినా (రష్యా) జంట 6-7(7), 6-3, 7-5తో ఎకెరి (నార్వే)/హొజుమి (జపాన్) జోడీని ఓడించి సారా ద్వయంతో ఫైనల్‌ఫైట్‌కు సిద్ధమైంది.


1x2

సబలెంకతో గాఫ్ ఢీ

నేడు మహిళల ఫైనల్

సాయంత్రం 6.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

ఫ్రెంచ్ ఓపెన్‌లో శనివారం జరిగే మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ నెం.1 సబలెంక, నెం.2 గాఫ్ అమీ తుమీ తేల్చుకోనున్నారు. ఇద్దరూ రొలాండ్ గారోస్‌లో ఒక్క టైటిల్ కూడా గెలవలేకపోయారు. 2022లో.. 18 ఏళ్ల వయస్సులో గాఫ్ ఇక్కడ తుదిపోరుకు చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది. ఈసారి మాత్రం ట్రోఫీని దక్కించుకోవాలని 21 ఏళ్ల ఈ అమెరికా స్టార్ పట్టుదలగా ఉంది. బెలారస్ భామ సబలెంకతో ముఖాముఖిలో 5-5తో సమంగా ఉండడంతో ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది. గత నెలలో జరిగిన మాడ్రిడ్ ఓపెన్ ఫైనల్లో సబలెంక చేతిలో గాఫ్ ఓడిపోయింది.


సబలెంక


గాఫ్

ఇక్కడ విజేతగా నిలవడం ద్వారా 'మాడ్రిడ్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని గాఫ్ భావిస్తోంది. ఇక ఫ్రెంచ్ ఓపెన్‌లో మూడుసార్లు డిఫెండింగ్ చాంపియన్ స్వియటెక్‌ను సెమీస్‌లో మట్టికరిపించిన సబలెంక రెట్టించిన ఉత్సాహంతో ఉంది. ఈ సీజన్‌లో 27 ఏళ్ల సబలెంక అద్భుత ఫామ్ కనబరుస్తోంది. సీజన్ రికార్డు 40-6గా ఉండడం ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది.

విరాట్ స్వార్థపరుడు..

అతడిని అరెస్ట్ చేయాలి

నెటిజన్ల డిమాండ్



న్యూఢిల్లీ: చిన్నస్వామి స్టేడియం బయట తొక్కిసలాట ఘటన తర్వాత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై సోషల్ మీడియాలో వ్యతిరేకత కనిపిస్తోంది. అలాగే ఎక్స్ వేదికపై 'హ్యాష్ ట్యాగ్ అరెస్ట్ కోహ్లీ' అనే నినాదంతో హోరెత్తిస్తున్నారు. మైదానం బయట 11 మంది అభిమానులు చనిపోవడానికి కోహ్లీనే కారణమంటూ కామెంట్స్ పెడుతున్నారు. బయట అంత విషాదం చోటుచేసుకున్నా.. లోపల మాత్రం సంబరాలు జరుపుకోవడమెందుకంటూ ప్రశ్నించారు. 'తననెంతగానో అభిమానించి చనిపోయిన ఫ్యాన్స్ కుటుంబాలను కోహ్లీ పరామర్శించలేదా? ఇంతటి స్వార్థపరుడు స్టార్ ఎలా అవుతాడు?' అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

రాహుల్ సెంచరీ

భారత్ 'ఎ' 319/7



నార్తాంప్టన్: ఓపెనర్‌గా బరిలోకి దిగిన కేఎల్ రాహుల్ (116) శతకంతో సత్తా చాటాడు. దీంతో ఇంగ్లండ్ 'ఎ'తో జరుగుతున్న రెండో అనధికార టెస్టులో శుక్రవారం తొలిరోజు ఆట ముగిసే సరికి భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 319/7 స్కోరు చేసింది. ధ్రువ్ జురెల్ (52)తో కలిసి నాలుగో వికెట్‌కు రాహుల్ 121 రన్స్ జోడించాడు. ఇక కరుణ్ నాయర్ (40), నితీశ్ (34) పర్వాలేదనిపించారు. జైస్వాల్ (17), కెప్టెన్ ఈశ్వరన్ (11) విఫలం కాగా.. క్రీజులో తనుష్ కోటియన్ (5), అన్షుల్ కంబోజ్ (1) ఉన్నారు. వోక్స్‌కు 3, హిల్‌కు 2 వికెట్లు దక్కాయి.

సాత్విక్ జోడీకి చుక్కెదురు

'ఇండోనేసియా' క్వార్టర్స్‌లో ఓటమి

జకార్తా: బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టికి ఇండోనేసియా ఓపెన్ సూపర్ 1000 టోర్నమెంట్‌లో చుక్కెదురైంది. రెండేళ్ల క్రితం ఇక్కడ చాంపియన్‌గా నిలిచిన ఈ భారత ద్వయం ఈసారి అనూహ్యంగా క్వార్టర్‌ఫైనల్లోనే వెనుదిరిగింది. శుక్రవారం ఇక్కడ జరిగిన డబుల్స్ పోరులో ప్రపంచ మాజీ నెంబర్ వన్ జోడీ సాత్విక్/చిరాగ్ 19-21, 16-21తో మలేసియా జంట మన్ వీ చోంగ్/టీ కాయ్ వున్ చేతిలో పరాజయం పాలైంది. సాత్విక్ జోడీ నిష్క్రమణతో టోర్నీలో భారత్ కథ పూర్తిగా ముగిసింది.

టైటిల్ రేస్‌లో గుకేష్

నార్వే చెస్ తొమ్మిదో రౌండ్‌లో విజయం



స్టావంజర్ (నార్వే): ప్రపంచ చాంపియన్ గుకేష్.. నార్వే చెస్ టోర్నీ టైటిల్ రేసులోకి దూసుకొచ్చాడు. తొమ్మిదో రౌండ్‌లో చైనా గ్రాండ్‌మాస్టర్ వీ యీని చిత్తు చేసి మూడు పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. దాంతో మొత్తం 14.5 పాయింట్లతో గుకేష్ రెండో స్థానంలో నిలిచాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి టై బ్రేకర్ పోరులో హికారు నకమురా చేతిలో పరాజయం పాలయ్యాడు. మొత్తం 11.5 పాయింట్లతో అర్జున్ ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక..తొమ్మిదో రౌండ్‌లో కరువానాపై గెలుపొందిన మాగ్నస్ కార్ల్‌సన్ (15) టాప్‌లో నిలిచాడు. మహిళల విభాగంలో గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తొమ్మిదో రౌండ్‌లో చైనా క్రీడాకారిణి లీ టింగ్‌జీ చేతిలో ఓడింది. ఇప్పటిదాకా టాప్‌లో ఉన్న హంపి (13.5) తాజా ఓటమితో రెండో స్థానానికి పడిపోయింది. ఈ రౌండ్‌లో విజయం అందుకున్న ఉక్రెయిన్ జీఎం అనా ముజిచుక్ (15.5) అగ్రస్థానంలో నిలిచింది. స్పెయిన్‌కు చెందిన సార ఖదెమ్ చేతిలో పరాజయం పాలైన జీఎం వైశాలీ (9.5) ఐదో స్థానంలో కొనసాగుతోంది.

మా సహనాన్ని పరీక్షించేవాడు

పుజారపై రోహిత్



ముంబై: జూనియర్ క్రికెట్ ఆడే రోజుల్లో చటేశ్వర్ పుజారను అవుట్ చేసేందుకు తమకు రోజులు పట్టేదని స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ తెలిపాడు. పుజార భార్య పూజ రాసిన 'ది డెయిరీ ఆఫ్ ఎ క్రికెటర్స్ వైఫ్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రోహిత్ మాట్లాడాడు. 'అప్పట్లో మా జట్టు చర్చలన్నీ పుజారను ఎలా అవుట్ చేయాలన్నదానిపైనే జరిగేవి. అతడి వికెట్ తీయకపోతే మ్యాచ్ ఓడినట్టే. నా 14 ఏళ్ల వయస్సులో ఉదయం క్రికెట్ ఆడేందుకు వెళ్లి సాయంత్రం వచ్చేసరికి నా ముఖం కందిపోయేది. ఎందుకంటే పుజార రోజంతా బ్యాటింగ్ చేసేవాడు. ఒక్కోసారి రెండు, మూడు రోజులు ఫీల్డింగ్ చేసేవాళ్లం. నా శరీర రంగు మార్పు విషయమై మా అమ్మ అడిగేది. మరి..నేనేం చేయను? పుజార అనే ఓ బ్యాటర్ మూడు రోజుల పాటు బ్యాటింగ్ చేస్తాడని చెప్పేవాణ్ణి' అంటూ రోహిత్ నాటి సంఘటనలను గుర్తుచేసుకున్నాడు.

న్యూజిలాండ్ క్రికెట్ చీఫ్ కోచ్.. రాబ్ వాల్టర్



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ పురుషుల క్రికెట్ జట్టు చీఫ్ కోచ్‌గా రాబ్ వాల్టర్ నియమితుడయ్యాడు. గ్యారీ స్టెడ్ స్థానంలో మూడు ఫార్మాట్లకు వాల్టర్‌ను ఎంపిక చేసినట్టు న్యూజిలాండ్ క్రికెట్ ప్రకటించింది. దక్షిణాఫ్రికాకు చెందిన 49 ఏళ్ల వాల్టర్ ఇప్పటిదాకా ఆ దేశ పరిమిత ఓవర్ల జట్టు కోచ్‌గా పనిచేశాడు. వాల్టర్ ఆధ్వర్యంలోనే సఫారీలు 2023 వన్డే వరల్డ్ కప్, ఈ ఏడాది చాంపియన్స్ ట్రోఫీలో సెమీస్ చేరారు. నిరుడు టీ20 వరల్డ్ కప్‌లోనూ ఫైనల్‌కు దూసుకెళ్లారు. వాల్టర్‌తో కివీస్ బోర్డు మూడేళ్ల పాటు ఒప్పందం కుదుర్చుకొంది.

పీయూష్ చావ్లా రిటైర్మెంట్



న్యూఢిల్లీ: వెటరన్ స్పిన్నర్ పీయూష్ చావ్లా దాదాపు రెండు దశాబ్దాల క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 36 ఏళ్ల చావ్లా భారత క్రికెట్ జట్టు గెలిచిన 2007 టీ20 వరల్డ్‌కప్, 2011 వన్డే వరల్డ్‌కప్‌ల్లోనూ సభ్యుడిగా ఉన్నాడు. 2006లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన చావ్లా భారత్ తరఫున 3 టెస్టుల్లో ఏడు వికెట్లు, 25 వన్డేల్లో 32 వికెట్లు, 7 టీ20ల్లో నాలుగు వికెట్లు తీశాడు. 2012లోనే అతను చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. దేశవాళీల్లో ఉత్తరప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించి, 137 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 446 వికెట్లు తీశాడు. అలాగే ఆరంభ ఐపీఎల్ (2008) నుంచి గతేడాది వరకు పంజాబ్, కేకేఆర్, సీఎస్‌కే, ముంబై ఫ్రాంచైజీల తరఫున మొత్తంగా 192 మ్యాచ్‌ల్లో 192 వికెట్లు తీశాడు. దీనికి తోడు 2012, 2014లో కోల్‌కతా నైట్‌రైడర్స్ చాంపియన్‌గా నిలిచిన సందర్భాల్లోనూ చావ్లా ఆ టీమ్ సభ్యుడిగానే ఉన్నాడు.

చిత్రజ్యోతి

SINCE 1965


గర్ల్‌ఫ్రెండ్‌తో అఖిల్ వివాహం





యువ కథానాయకుడు అక్కినేని అఖిల్ బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్‌బై చెప్పేసి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. రెండేళ్ల నుంచి ప్రేమలో ఉన్న జైనబ్‌తో ఆయన వివాహం శుక్రవారం తెల్లవారు జామున మూడున్నర గంటలకు జరిగింది. నాగార్జున నివాసంలో తెలుగు సంప్రదాయం ప్రకారం జరిగిన ఈ వివాహానికి పలువురు చిత్ర ప్రముఖులు హాజరయ్యారు. గత ఏడాది నవంబర్‌లో అఖిల్, జైనబ్‌ల నిశ్చితార్థం జరిగిన విషయం విదితమే. తన కుమారుడి పెళ్లి విషయాన్ని వెల్లడిస్తూ నాగార్జున సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. అలాగే కుమారుడి పెళ్లి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆనందం పట్టలేక నాగార్జున డ్యాన్స్ చేసిన వీడియో కూడా వైరల్ అయింది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపార కుటుంబానికి చెందిన జైనబ్ థియేటర్ ఆర్టిస్ట్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్. జైనబ్ తండ్రి జుల్ఫీరవ్జీ వ్యాపారవేత్త. ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఆయన సన్నిహితుడనే వార్తలు వినిపించాయి. జైనబ్ నటి కూడా. 2004లో వచ్చిన 'మీనాక్షి.. ద టేల్ ఆఫ్ త్రీ సిటీస్' చిత్రంలో ఆమె నటించారు. ఆ చిత్రానికి ఎఫ్ హుస్సేన్ దర్శకుడు. అఖిల్ కంటే వయసులో ఆమె తొమ్మిదేళ్లు పెద్ద. రెండేళ్ల క్రితం పరిచయమై ప్రేమలో పడిన అఖిల్, జైనబ్ పెద్దల అనుమతితో ఇప్పుడు వివాహం చేసుకున్నారు. ఆదివారం గ్రాండ్‌గా ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్‌కు సినీ, రాజకీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. అఖిల్‌కు 2016లో వ్యాపార దిగ్గజం జి.వి. కృష్ణారెడ్డి మనవరాలు శ్రియా భూపాల్‌తో నిశ్చితార్థం జరిగింది. 2017లో వీరి వివాహం జరగాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల రద్దయింది.

వీరమల్లు రాక వాయిదా



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రం విడుదల మరోమారు వాయిదా పడింది. ఈ నెల 12న ఈ చిత్రం విడుదలవ్వాల్సి ఉండగా, మరోసారి వాయిదావేస్తున్నట్లు నిర్మాత ఏ.ఎం.రత్నం తెలిపారు. 'ఎంతో సహనం, నమ్మకంతో 'హరిహర వీరమల్లు' సినిమాకు అండగా నిలిచిన అభిమానులు, శ్రేయోభిలాషులు, సినీ ప్రేమికులకు ధన్యవాదాలు. గతంలో ప్రకటించిన తేదీకే ఈ సినిమాను మీ ముందుకు తీసుకురావాలని తీవ్ర ప్రయత్నం చేశాం. అయితే ఎంత శ్రమించినా ఆ తేదీకల్లా సినిమాను విడుదలకు సిద్ధం చేయలేకపోతున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో విడుదలను వాయిదా వేయాల్సి వచ్చింది. పవన్ కల్యాణ్ ఇమేజ్‌కు తగ్గట్లుగా 'హరిహర వీరమల్లు'ను మరింత గొప్పగా తీర్చిదిద్దాలనేదే మా ఆలోచన. అందుకే మేము మరికొంత సమయం తీసుకుంటున్నాం. మీ ఎదురుచూపులకు బహుమతిగా గొప్ప చిత్రాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నాం' అని ఏ. ఎం రత్నం తెలిపారు. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేసి, కొత్త విడుదల తేదీని వెల్లడిస్తామని ఆయన చెప్పారు. జ్యోతికృష్ణ, క్రిష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఏఎం రత్నం సమర్పణలో ఏ. దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయిక. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

యాక్షన్ షెడ్యూల్ పూర్తి



'బబుల్‌గమ్' చిత్రంతో కథానాయకుడిగా అలరించిన రోషన్ కనకాల నటిస్తున్న తాజా చిత్రం 'మోగ్లీ 2025'. సాక్షి సాగర్ మడోల్కర్ హీరోయిన్. 'కలర్ ఫొటో' ఫేం సందీప్‌రాజ్ దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతీప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. తాజాగా భారీ క్లైమాక్స్ యాక్షన్ షెడ్యూల్ పూర్తయినట్లు యూనిట్ తెలిపింది. మారేడుమిల్లిలో 15 రోజులపాటు సాగిన షెడ్యూల్‌లో రోషన్‌పై యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణ పూర్తి చేశారు. 'ఇంకో షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తిచేసి, ఈ నెలలో టీజర్‌ను, ఏడాది చివర్లో సినిమాను విడుదల చేస్తాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, సినిమాటోగ్రఫీ: రామమారుతి ఎం.

'డెకాయిట్' డబ్బింగ్



అడవి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా షానియెల్ డియో దర్శకత్వంలో 'డెకాయిట్' అనే పాన్ ఇండియా సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ఫైర్ గ్లింప్స్, స్టైలిష్ విజువల్స్‌తో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. తాజాగా అడవి శేష్ డబ్బింగ్ టెస్ట్ పూర్తిచేశారు. దీనికి సంబంధించిన ఫొటోని సోషల్ మీడియాలో ఆయన షేర్ చేశారు. కాగా, ఈనెల 8 నుంచి కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సినిమా క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న విడుదల కానుంది.

వనజీవి రామయ్య స్ఫూర్తితో



అడవులను రక్షించుకోవాలనే సందేశంతో తెరకెక్కిన చిత్రం 'కలివి వనం'. రఘుబాబు, సమ్మెట గాంధీ, బిత్తిరి సత్తి, నాగదుర్గ కీలకపాత్రలు పోషించారు. రాజ్ నరేంద్ర దర్శకత్వంలో మల్లికార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి నిర్మించారు. ఇటీవలే చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. సినీ పాత్రికేయుల చేతుల మీదుగా టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మాకు చెట్లంటే చాలా ఇష్టం. అందుకే 'కలివి వనం' చిత్రాన్ని రూపొందించి, ప్రజల్లో అవగాహన పెంచాలనుకుంటున్నాం. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'వనజీవి రామయ్య, దుశ్చర్ల సత్యనారాయణ స్ఫూర్తితో 'కలివి వనం' చిత్రాన్ని రూపొందించాం. వృక్షాలతో మనిషి అనుబంధాన్ని చర్చిస్తూ సందేశాత్మకంగా సాగుతుంది' అని చెప్పారు.

తెర ముచ్చట్లు

సీక్వెల్ చిత్రం



గీతా సింగ్, కార్తీక్, కాశీ మదన్ ప్రధాన తారాగణంగా రూపొందుతున్న చిత్రం 'బ్యాచిలర్స్ ప్రేమకథలు'. ఎం.ఎన్.వి సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. శుక్రవారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ మొదలైంది. తొలి షాట్‌కు దర్శకుడు వి. సముద్ర కెమెరా స్విచాన్‌చేయగా, దర్శకుడు వీర శంకర్ క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ 'నా గత చిత్రం 'కాలం రాసిన ప్రేమకథలు' చిత్రానికి చక్కటి ప్రేక్షకాదరణ దక్కింది. ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్‌గా 'బ్యాచిలర్స్ ప్రేమకథలు' తెరకెక్కిస్తున్నా. ఇందులో వినోదంతో పాటు నేటి సమాజానికి మంచి సందేశం ఇవ్వబోతున్నాం. ఈ ఏడాదిలోనే సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు.

'దసరా' విలన్ తండ్రి దుర్మరణం


షైన్ టామ్ చాకో

తమిళనాడు రాష్ట్రంలోని ధర్మపురి జిల్లాలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 'దసరా' మూవీ విలన్ షైన్ టామ్ చాకో తండ్రి సీపీ చాకో (70) దుర్మరణం పాలయ్యారు. చాకో భార్య మరియా కార్మెల్ (65)లతో పాటు మొత్తం నలుగురు కుటుంబ సభ్యులు గాయపడ్డారు. రోడ్డు పక్కన నిలిపివున్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు.. లారీ కిందకు వెళ్లిపోవడంతో నుజ్జునుజ్జు అయిపోయింది. దీంతో కారులోని వారంతా అందులో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదాన్ని చూసిన ఇతర వాహనదారులు పోలీసులకు సమాచారమిచ్చి వారిని రక్షించారు. వీరిలో షైన్ తండ్రి సీపీ చాకో ప్రాణాలు కోల్పోగా, మిగిలిన వారు తీవ్రంగా గాయపడ్డారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

మేకప్

ముడతలు దాచే మేకప్



వయసు పైబడేకొద్దీ ముఖం మీద ముడతలు, గీతలు పెరుగుతూ ఉంటాయి. వీటిని మేకప్‌తో దాచేసే వీలుంది. అయితే అందుకోసం కొన్ని మేకప్ మెలకువలు పాటించాలి. అవేంటంటే...

తేమ కోసం...

వేసుకునే మేకప్ ముఖం మీద సమంగా పరుచుకోవాలంటే, ముందుగా ఫేసియల్ సీరమ్‌ను ముఖం మీద అద్దుకోవాలి. ఈ సీరం జిడ్డుగా ఉండకుండా చర్మానికి తేమతో పాటు, సన్‌స్క్రీన్ రక్షణ కూడా అందించేలా ఉండాలి. ఈ సీరమ్ చర్మంలో చక్కగా ఇంకిపోయిన తర్వాతే మేకప్ మొదలుపెట్టుకోవాలి.

ద్రవరూప ఫౌండేషన్

ఫౌండేషన్ ముఖం మీద సన్నని గీతల్లో ఇరుక్కుపోయి ఎబ్బెట్టుగా కనిపించకుండా ఉండడం కోసం ద్రవరూప ఫౌండేషన్ ఎంచుకోవాలి. ఈ రకమైన ఫౌండేషన్ చర్మం మీద పలుచగా పొరలా ఏర్పడి, కాంపాక్ట్, బ్లష్‌ల అప్లికేషన్‌కు అనువుగా ఉంటుంది. అయితే ఫౌండేషన్‌ను నేరుగా అప్లై చేసుకోకుండా, మొదట ముఖమంతా అక్కడక్కడా చుక్కలుగా అద్దుకుని, ఆ తర్వాత స్పాంజ్‌తో ముఖమంతా పరుచుకునేలా చేయాలి

తడిపి, పిండిన స్పాంజ్‌తో...


ఫౌండేషన్, కన్సీలర్‌ల కోసం తడిపి పిండిన మేకప్ స్పాంజ్ వాడుకోవాలి. ఈ పద్ధతితో మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. మరింత సహజసిద్ధంగా కనిపిస్తుంది. అయితే స్పాంజి తేమగా ఉండాలే తప్ప నీరోడుతూ ఉండకూడదు. అందుకోసం గోరువెచ్చని నీటి ధార కింద ఉంచి, గట్టిగా పిండేయాలి.

ద్రవరూప బ్లష్

బ్లష్‌తో అందం రెట్టింపవుతుంది. అయితే అందుకోసం సరైన రంగులను ఎంచుకోవాలి. ముదురు రంగు బ్లష్‌లు, మరీ మెత్తని పౌడర్ రూపంలో ఉండే బ్లష్‌లు ఎబ్బెట్టుగా కనిపిస్తూ, చర్మపు గీతల్లో ఇరుక్కుపోతాయి. కాబట్టి పౌడర్ బ్లష్‌లకు బదులుగా ద్రవరూప బ్లష్‌లు ఎంచుకోవాలి. వీటిని కూడా తడిపి పిండిన స్పాంజ్‌తోనే అద్దుకోవాలి.

స్ఫూర్తి

సాహసమే శ్వాసగా...


పుష్పా ప్రకాష్

పుష్పా ప్రకాష్, మాలా హోన్నతి... కర్ణాటకకు చెందిన వీరిద్దరూ వయసు అనేది కేవలం ఒక సంఖ్య అని... సంకల్ప బలం ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తున్నారు. ఏడు పదుల వయసులో పర్వతాలు అధిరోహిస్తూ... స్కూబా డైవింగ్‌లు చేస్తూ... ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఈ ఇద్దరు బామ్మల సాహస గాథలు ఇవి.

నా కూతురే నాకు ప్రేరణ

నేను కర్ణాటకలోనే పుట్టి పెరిగాను. గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. ఆ తరువాత పెళ్లి, పిల్లలు, కుటుంబ బాధ్యతలతో కొన్నేళ్ల పాటు గడిపేశాను. 50 ఏళ్ల వయసు వచ్చాక పిల్లలు పెద్దవారు అయిపోయారు. నాకు నచ్చినట్లు నా కోసం నా జీవితం గడపాలని నిశ్చయించుకున్నా. మానసిక ఆరోగ్య సలహాదారుగా కొత్త జీవితం ప్రారంభించి ఎంతో మందికి సహాయం చేశా. కొన్ని సంవత్సరాల తరువాత ఓసారి నా కూతురుతో కలిసి ఓ యాత్రకు వెళ్లా. ఆ యాత్ర నా జీవితాన్ని మార్చేసింది. సాహసయాత్రలు చేయాలనే ఆలోచన నాలో రేపింది. అలా 65 ఏళ్ల వయసులో ట్రెక్కింగ్ చేయడం ప్రారంభించా. 3 ఏళ్లలో దేశవ్యాప్తంగా 49 ట్రెక్కింగ్‌లు విజయవంతంగా పూర్తిచేశా. వీటిలో మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ కూడా ఉంది. ట్రెక్కింగ్ మాత్రమే కాక విదేశాల్లో స్కైడైవింగ్, స్కూబా డైవింగ్, బంగీ జంప్‌లు కూడా చేశా. ఇలా 2024లో ట్రెక్కర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ కూడా అందుకున్నా.

క్రమశిక్షణతోనే సాధ్యం

ఈ వయసులోనూ ఇలాంటి సాహస యాత్రలు చేయడానికి శారీరకంగా ఎన్నో సవాళ్లు ఉంటాయి. కానీ నేను శారీరంగానే కాక మానసికంగా కూడా చాలా దృఢంగా ఉన్నాను. జిమ్‌లకు వెళ్లకపోయినా నా శరీరం ఇంత బలంగా ఉండడానికి కారణం ఎన్నో ఏళ్లుగా నేను అనుసరిస్తున్న జీవనశైలి. తెల్లవారుజాము బ్రహ్మ ముహూర్తాన... నిద్ర లేచి యోగాసనాలు వేస్తాను. ధ్యానం చేస్తాను. జంక్ ఫుడ్ తినను. ఇంట్లో వండిన ఆహారం మాత్రమే తీసుకుంటాను. దీని వలన బీపీ, షుగర్ వంటి సమస్యలు కూడా ఇంతవరకు నా దరి చేరలేదు. క్రమశిక్షణతో ఇలాంటి జీవన విధానం పాటించడం వలనే మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండి నేను అనుకున్నది సాధించగలుగుతున్నా.

నేను ఈ కొత్త ప్రయాణం మొదటు పెట్టడానికి కారణం నా కూతురే. ట్రెక్కింగ్ చేయవచ్చని తనే నన్ను ప్రోత్సహించింది. తన ప్రోత్సాహంతోనే ఇన్ని సాహస యాత్రలు పూర్తి చేయగలిగా.

నన్ను నేను తెలుసుకోవాలని...


మాలా హోన్నతి

కర్ణాటకలో నా బాల్యమంతా సాగింది. చదువు పూర్తయ్యాక బ్యాంకు ఉద్యోగం సంపాదించా. బదిలీ మీద ఢిల్లీకి వెళ్లి స్థిరపడ్డా. బ్యాంకులో పదోన్నతి కూడా పొందా. కానీ ఎందుకో నా ఉద్యోగం నాకు నచ్చలేదు. ఎప్పుడూ నిస్తేజంగా అనిపించేది. నన్ను నేను తెలుసుకునేలా ఏదైనా చేయాలనిపించింది. దాంతో ఉద్యోగాన్ని వదిలేశా. మారథాన్‌లు, ట్రెక్కింగ్, పర్వతారోహణ.. వంటివి చేయాలని ప్రయత్నించా. 1984లో 31 ఏళ్ల వయసులో ట్రెక్కింగ్ చేయడం మొదలుపెట్టా. 1986లో డార్జిలింగ్‌లోని హిమాలయాన్ పర్వతారోహణ ఇన్‌స్టిట్యూట్‌లో చేరా. ఆ తరువాత మౌంట్ స్టోక్ కాంగ్రీ, మౌంట్ లడఖ్, మౌంట్ సితిధర్, కిలిమాంజారో వంటి పర్వతాలను అధిరోహించా. దేశంలోనే కాక విదేశాల్లోనూ ఎన్నో మారథాన్లలో పాల్గొన్నా.

కలగానే ఎవరెస్ట్

చాలా పర్వతాలు ఎక్కా కానీ ఎవరెస్ట్ ఎక్కేందుకు మూడు సార్లు ప్రయత్నించి విఫలమయ్యా. మొదటిసారి 1992లో ఎవరెస్ట్ అధిరోహించేందుకు మహిళా బృందంతో కలిసి బయలుదేరా. కానీ నిరంతర హిమానిపాతం కారణంగా ఆ యాత్ర ఆగిపోయింది. 2011లో మారథాన్ కోసం ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు బయటుదేరాం. కానీ నేను పూర్తిగా దానికి సిద్ధంగా లేక మధ్యలోనే వైదొలిగా. ఆ తరువాత మానసికంగా, శారీరకంగా నన్ను నేను సిద్ధం చేసుకున్న తర్వాత నా స్పాన్సర్లు వెనకడుగు వేశారు. దాంతో నా పదవీవిరమణ నిధులు, నా దగ్గర ఉన్న డబ్బు ఖర్చు చేసి 2015లో మళ్లీ ఎవరెస్ట్ ఎక్కేందుకు బయలు దేరా. కానీ దురదృష్టం నన్ను వెంటాడింది. ఆ సమ యంలో భూకంపం సంభవించి నా ఎవరెస్ట్ యాత్ర నిలిచిపోయింది.

ఇలా చేస్తే ఎగ్జాస్ట్ ఫ్యాన్ శుభ్రం!

ఎగ్జాస్ట్ ఫ్యాన్ మీద నూనె జిడ్డు, దుమ్ము లాంటివి చేరుతుంటాయి. దీంతో ఫ్యాన్ ప్రభావవంతంగా పనిచేయలేదు. విద్యుత్ వినియోగం కూడా అధికమవుతుంది. ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను సులువుగా శుభ్రం చేసే చిట్కాలివి...


- ఒక గిన్నెలో నాలుగు చెంచాల బేకింగ్ సోడా, అయిదు చెంచాల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఫ్యాన్ రెక్కలకు, వెనక ఉన్న గ్రిల్‌కు పట్టించాలి. అరగంటసేపు ఆరనివ్వాలి. తరవాత వేడినీళ్లలో ఒక గుడ్డను ముంచి దానితో ఫ్యాన్ మొత్తాన్ని తుడవాలి. నెలకు రెండు సార్లు ఇలా శుభ్రం చేస్తూ ఉంటే ఫ్యాన్ చక్కగా పని చేస్తుంది.



- ఒక్కోసారి ఫ్యాన్ మీద బాగా జిడ్డు పట్టి ఉంటుంది. దీనికి దుమ్ము కూడా చేరడంతో శుభ్రం చేయడం కష్టంగా అనిపిస్తుంది. అలాంటప్పుడు గిన్నెలో అర కప్పు వెనిగర్, పావు కప్పు డిటర్జెంట్ వేసి ఒక కప్పు వేడి నీళ్లు పోసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పలుచని గుడ్డ సహాయంతో ఫ్యాన్ రెక్కలకు, వెనక ఉన్న గ్రిల్‌కు పట్టించాలి. పావు గంట తరవాత తడిగుడ్డతో తుడవాలి. అక్కడక్కడ జిడ్డు మరకలు కనిపిస్తే మరల వెనిగర్ మిశ్రమాన్ని పట్టించి పది నిమిషాల తరవాత తుడవాలి.

భోజనకుతూహలం

బంగారం లాంటి ఆకుకూర



సంస్కృతంలో పొన్నగంటి కూరను 'మత్స్యాక్షి' అని పిలుస్తారు. మత్స్యాక్షి అంటే బంగారపు కళ్ల లాంటి ఆకులు కలిగిందని అర్థం. దీనికి కారణం దీనిలో ఉన్న విటమిన్ ఏ. ఇది ప్రతి గ్రామంలోను ఉచితంగా దొరుకుతుంది. 'భోజన కుతూహలం'లో రఘునాథ సూరి పొన్నగంటి కూరను అద్భుత శక్తిదాయినిగా వర్ణించాడు. రఘునాథ సూరి ప్రకారం- పొన్నగంటి కూర- చల్లదనం నిస్తుంది (శిశిరా), స్త్రీపురుష బంధాన్ని పెంచుతుంది (వృష్యా), క్షీణింపచేసే క్షయ వంటి వ్యాధులను తగ్గిస్తుంది (క్షయాపహా), పుండ్లపై ప్రభావం చూపుతుంది (వ్రణదోషాపహా). అందుకే ఆయుర్వేద వైద్యులు ఈ కూరను ఎక్కువగా తినమని సూచిస్తూ ఉంటారు. ఇక పొన్నగంటి కూర ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాం.

- కాలేయ సమస్యలను పరిష్కరించటంలో పొన్నగంటి కూరకు ప్రత్యేక స్థానముంది. గతంలో కలుషితమైన నీళ్ల వల్ల ఊరంతా కామెర్లు వస్తే- పొన్నగంటి కూరను తినమని సూచించేవారు. చారు కాచుకొని తాగమని చెబుతారు.
- పొన్నగంటి కూర జలుబు, దగ్గు, జ్వరాలను తగ్గిస్తుంది. ఎసిడిటి తగ్గటానికి దీనిని వాడవచ్చు.
- దీనిలో ఎ,బి,సి విటమిన్లు అధికంగా ఉంటాయి. కాల్షియం, ఫాస్పరస్ కూడా తగినంత లభిస్తాయి. దీని వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- దీనిని పరిమితంగా మాత్రమే తినాలి. ఎక్కువ తింటే ఆరోగ్య సమస్యలు ఏర్పడే అవకాశముంది.

చింత చిగురు, పొన్నగంటి కూర కలిపే వండే కూర చాలా శక్తిమంతమైనది. దీనిని తయారుచేయటానికి- ముందు పొన్నగంటి ఆకులను సన్నగా తరగాలి. వీటిలో కొద్దిగా చింత చిగురు కలపాలి. ఈ ఆకులను మిరియాల పొడి, ఉప్పులతో కలిపిన పెరుగులో కలపాలి. ఈ మిశ్రమాన్ని కొద్దిగా వేడి చేసి.. తాళింపు పెట్టాలి.

- పొన్నగంటి ఆకులను బాగా కడిగి మిక్సీలో వేయాలి. దీనిని రెండు గ్లాసుల నీళ్లలో వేసి బాగా మరిగించాలి. ఈ నీళ్లను ప్రతి రోజూ తాగితే కామెర్లు తగ్గుతాయి.

• గంగరాజు అరుణాదేవి

న్యూస్ మేకర్

తిరుగులేని నాయకురాలు



రాధా వెంబు... దేశ ఆర్థిక రంగంలో అత్యంత ప్రభావవంతమైన మహిళా నాయకురాలుగా 'హురున్' జాబితాలో స్థానం సంపాదించారు. భారత తొలి తరం సంపద సృష్టికర్తగా, 'జోహో' సహ వ్యవస్థాపకురాలిగా, సామాజిక కార్యకర్తగా ఆమె ప్రస్థానం అసాధారణం.

భారత దేశపు తొలి తరం సంపద సృష్టికర్తగా, జోహో సహ వ్యవస్థాపకురాలు, రాధా వెంబును హురున్ ఎంపిక చేసింది. ఈమె వ్యక్తిగత సంపద విలువ.. అక్షరాలా 55 వేల 300 కోట్లు. తమిళనాడులోని చెంగల్పట్టులో నివసించే రాధ, జోహో ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ విజయంలో కీలక పాత్ర పోషించారు. జోహో స్కూల్స్, గ్రామీణ అభివృద్ధి ద్వారా సామాజిక ప్రభావానికి దోహదపడుతూ, వ్యాపార నాయకత్వాన్ని సామాజిక సాధికారతతో సమర్థవంతంగా మేళవించారామె. జోహో కార్పొరేషన్‌లో చీఫ్ సైంటిస్ట్, వ్యాపార దిగ్గజమైన శ్రీధర్ వెంబు సోదరి అయిన రాధా వెంబు, ఐఐటి మద్రాసు పూర్వ విద్యార్థిని. ప్రస్తుతం ఆమె జోహో ఇమెయిల్ సర్వీసుకు ప్రొడక్ట్ మేనేజర్‌గా సేవలందిస్తున్నారు. 1972లో చెన్నైలో పుట్టిన రాధ, 1996లో సోదరుడు, శ్రీధర్‌తో కలిసి జోహో కార్పొరేషన్‌ను స్థాపించారు. కంపెనీని నడపడంతో పాటు, దాన్ని ప్రపంచస్థాయికి విస్తరించడంలో, క్లౌడ్‌బేస్డ్ సొల్యూషన్స్‌ను బలోపేతం చేయడంలో రాధ కీలకమైన, బాధ్యతాయుతమైన నాయకత్వ పాత్రను పోషించారు. రాధా వెంబు జోహో కంపెనీలో అతి పెద్ద వాటాదారు. కంపెనీలో ఈమె 47.8 శాతం వాటాను కలిగి ఉంటే, సోదరుడు శ్రీధర్ వెంబు కేవలం ఐదు శాతం వాటాను మాత్రమే కలిగి ఉన్నారు.

ఘనతలు ఎన్నో...

రాధా వెంబు లాంటి మహిళా వ్యాపారులు భారతదేశపు వ్యాపార రంగాన్ని మలుపు తిప్పారని చెప్పవచ్చు. సాంకేతిక రంగంలో పురోగమిస్తున్న రాధా వెంబు, జోహో కార్పొరేషన్‌ను గ్లోబల్ సాఫ్ట్‌వేర్ శక్తిగా విస్తరించడంలో కీలక పాత్రను పోషిస్తున్నారు. 52 ఏళ్ల ఈ మహిళా వ్యాపారి, అనేక విభాగాల్లో గుర్తింపు పొందారు. మరీ ముఖ్యంగా పది అగ్ర తొలితరం మహిళా సంపత్తి సృష్టికర్తలు, పి అగ్ర దాతల జాబితాలో చోటు దక్కించుకున్నారు. అలాగే 2025 హురున్ ఇండియా మహిళా నాయకురాళ్ల జాబితాలో, అనేక విభాగాల్లో అతి తక్కువ వయస్సున్న మహిళా నాయకురాలిగా రాధా వెంబు తొవిన్మిదో స్థానాన్ని సంపాదించారు.

వంటిల్లు

వర్షాకాలం వచ్చేసింది. ఈ కాలంలో కారంగా, ఘాటుగా ఉండే పచ్చడి లేదంటే పొడిని వేడి వేడి అన్నంలో వేసుకుని నెయ్యి కలుపుకుని తింటే... ఆహా... ఆ రుచే వేరు. అలాంటి ఆరోగ్యకరమైన కమ్మని రుచులు మీ కోసం...

వానొచ్చే వేళ కారంగా.. ఘాటుగా




శొంఠి పొడి

కావాల్సిన పదార్థాలు

నెయ్యి- ఒక చెంచా, శొంఠి- 50 గ్రాములు, జీలకర్ర- రెండు చెంచాలు, ఎండు మిర్చి- రెండు, ఉప్పు- తగినంత

తయారీ విధానం

స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నెయ్యి వేసి వేడిచేయాలి. ఇందులో శొంఠి ముక్కలు వేసి కలుపుతూ చిన్న మంట మీద దోరగా వేపాలి. అయిదు నిమిషాల తరవాత శొంఠి ముక్కలు లోపలిదాకా వేగి కొద్దిగా ఉబ్బుతాయి. మంచి వాసన కూడా వస్తుంది. ఇప్పుడు జీలకర్ర, ఎండుమిర్చి ముక్కలు కూడా వేసి మరో రెండు నిమిషాలు వేపాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించి ఈ మిశ్రమాన్ని రోట్లో వేసి కచ్చాపచ్చాగా దంచాలి. తరవాత శొంఠి ముక్కలను చేత్తో మరింత చిన్న ముక్కలుగా తుంచి తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేసి మెత్తని పొడిలా గ్రైండ్ చేయాలి. ఇలా తయారు చేసిన శొంఠి పొడి ఆరు నెలలు నిల్వ ఉంటుంది.

ప్రయోజనాలు

ఈ శొంఠి పొడిని ఆర్నెల్ల పసి పిల్లల నుంచి అరవై ఏళ్లు పైబడిన పెద్దవారి వరకూ ఎవరైనా తినవచ్చు.

ఇది పొట్టను పూర్తిగా శుభ్రం చేస్తుంది. రోజూ ఈ పొడితో ఒక్క ముద్ద తింటే చాలు అజీర్తి తొలగి ఆకలి పెరుగుతుంది. వర్షాకాలంలో చలిగాలుల వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా స్థిరంగా ఉంటుంది. ఊబకాయం తగ్గుతుంది. తరచూ వాతంతో ఇబ్బంది పడే పిల్లలకు మంచి ఔషధంలా పనిచేస్తుంది. మజ్జిగ లేదా మజ్జిగ చారులో చిటికెడు శొంఠి పొడి కలుపుకుని తాగితే జీర్ణాశయ సమస్యలన్నీ మాయమవుతాయి.

జాగ్రత్తలు

- శొంఠిని పెద్ద మంట మీద వేపకూడదు. సన్నని సెగ మీద నిదానంగా వేయించాలి.
- ఎండు మిర్చికి బదులు ముప్పావు చెంచా మిరియాల పొడి కలుపుకోవచ్చు.
- ఈ పొడితో రోజుకు ఒక్క ముద్ద మాత్రమే తినాలి. ఎక్కువగా తింటే విరేచనాలు అవుతాయి.



వాము కారం

కావాల్సిన పదార్థాలు

వాము- పావు కప్పు, మినప గుండ్లు- రెండు చెంచాలు, ధనియాలు- రెండు చెంచాలు, జీలకర్ర- ఒక చెంచా, మిరియాలు- అర చెంచా, నూనె- ఒక చెంచా, ఎండు మిర్చి- అయిదు, కరివేపాకు- రెండు రెమ్మలు, చింతపండు- రెండు రెమ్మలు, వెల్లుల్లి- రెండు రెబ్బలు, ఉప్పు- అర చెంచా

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి వేడి చేయాలి. ఇందులో వాము, మినపగుండ్లు, ధనియాలు, జీలకర్ర, మిరియాలు వేసి విడివిడిగా వేయించుకోవాలి. ఇవి దోరగా వేగిన తరవాత ఒక పళ్లెంలోకి తీసుకోవాలి. తరవాత గిన్నెలో నూనె వేసి వేడి చేయాలి. ఇందులో ఎండు మిర్చి, కరివేపాకు, వెల్లుల్లి వేసి తేమ పోయే వరకూ వేయించి పళ్లెంలోకి తీసి చల్లార్చాలి.
- మిక్సీలో ముందుగా ఎండుమిర్చి, కరివేపాకు, చింతపండు, పొట్టు తీసిన వెల్లుల్లి రెబ్బలు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత ఇందులో వాము, ధనియాలు, జీలకర్ర, మిరియాలు, మినపగుండ్ల మిశ్రమంతోపాటు ఉప్పు వేసి మరోసారి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇలా తయారుచేసిన వాము కారాన్ని బాగా కలిపి గాజు సీసాలో భద్రపరిస్తే నెల రోజులు నిల్వ ఉంటుంది.

ప్రయోజనాలు

భోజనానికి ముందు ఈ వాము కారంతో రెండు ముద్దలు తింటే వర్షాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చు. ముఖ్యంగా జలుబు, దగ్గు, ముక్కు దిబ్బడ, అజీర్తి, కడుపులో మంట, కడుపు ఉబ్బరం లాంటి సమస్యలు తగ్గిపోతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తలనొప్పితో బాధపడేవారికి, కడుపులో నులి పురుగులతో ఇబ్బంది పడే పిల్లలకు ఈ పొడి ఔషధంలా పనిచేస్తుంది.

జాగ్రత్తలు

- ఒక్కోసారి వాములో ఇసుక రేణువులు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తగా శుభ్రం చేసుకోవాలి.
- వామును చిన్న సెగమీద దోరగా వేపాలి. ఇది నల్లగా మారితే వాముకారం చేదుగా ఉంటుంది.
- వెల్లుల్లి తప్పనిసరి కాదు.



వెల్లుల్లి పచ్చడి

కావాల్సిన పదార్థాలు

వెల్లుల్లి రెబ్బలు- 40, జీలకర్ర- రెండు చెంచాలు, ఉప్పు- ఒక చెంచా, కారం- నాలుగు చెంచాలు, నూనె- మూడు చెంచాలు, ఆవాలు- అర చెంచా, కరివేపాకు- రెండు రెమ్మలు, పసుపు- చిటికెడు, ఎండు మిర్చి- రెండు

తయారీ విధానం

- వెల్లుల్లి రెబ్బలకు రెండు చుక్కల నూనె పట్టించి కొద్దిసేపు ఎండలో పెట్టాలి. తరవాత ఒక పలుచని వస్త్రంలో మూటకట్టి అరచేతులతో నలిపితే పొట్టంతా ఊడి వచ్చేస్తుంది. వీటిని వెడల్పాటి పళ్లెం లేదా చాటలో పోసి చెరిగితే పొట్టు ఎగిరిపోయి వెల్లుల్లి పాయలు విడిగులుతాయి. వీటిని పళ్లెంలోకి తీసుకోవాలి. వెల్లుల్లిని కొద్దిగా నూనెలో వేయిస్తే పచ్చి వాసన పోతుంది.
- మిక్సీలో వెల్లుల్లి రెబ్బలు, రెండు రెమ్మల చింతపండు, ఒక చెంచా జీలకర్ర, ఉప్పు, కారం వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గిన్నెలోకి తీసుకోవాలి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి నూనె వేసి వేడిచేయాలి. ఇందులో ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి ముక్కలు, కరివేపాకు, పసుపు వేసి వేపాలి. ఈ తాలింపుని వెల్లుల్లి మిశ్రమంలో వేసి బాగా కలపాలి. ఈ వెల్లుల్లి పచ్చడి ఒక వారం పాటు నిల్వ ఉంటుంది.

ప్రయోజనాలు

ఈ వెల్లుల్లి పచ్చడి కలుపుకుని ఒక ముద్ద అన్నం తింటే శరీరంలో చేరిన కఫం బయటికి వెళ్లిపోతుంది. వాతం తగ్గుతుంది. వర్షాకాలంలో నీటి కాలుష్యం వల్ల టైఫాయిడ్ సోకే ప్రమాదం తగ్గుతుంది. వాతావరణం చల్లబడడం వల్ల వచ్చే కీళ్ల నొప్పులు, ఎముకల వాపు, ఆస్తమా, మలబద్ధకం, కొలెస్ట్రాల్, నరాల సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.


మొబైల్ భూతం

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండడంతో పిల్లలను అమ్మమ్మలు తాతయ్యలు చూసుకునేవారు. కానీ ఇప్పుడలా కాదు. చిన్న కుటుంబాలు కావడంతో ఇల్లు, ఆఫీసు పనులతో సతమతమవుతూ, మరోపక్క చిన్నారులను సముదాయించలేక వారికి మొబైల్ ఫోన్ ఇస్తున్నారు తల్లిదండ్రులు. దాంతో పిల్లలు ఫోన్‌కు బాగా అలవాటు పడుతున్నారు. దీనివల్ల వారికి తీరని నష్టం జరుగుతోంది.



- నిరంతరం ఫోన్‌లో మునిగిపోతుండడంతో పిల్లల్లో ఏకాగ్రత లోపిస్తోంది. దేనిపైనా శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. సృజనాత్మకత కొరవడతోంది. కొత్తగా, సొంతంగా ఆలోచించలేకపోతున్నారు.
- ఫోన్ చూస్తూ పిల్లలు ఆటలు ఆడడం లేదు. దాంతో వారి శారీరక దారుఢ్యం దెబ్బ తింటోంది. ఊబకాయం బారిన పడుతున్నారు.
- మొబైల్ నుంచి వెలువడే నీలి కాంతివల్ల నిద్ర లేమితో బాధపడుతున్నారు. ఇది పలు అనారోగ్య సమస్యలకు దారితీస్తోంది.
- ఫోన్ వ్యసనంలో పడి తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. ఒంటరితనం, మానసిక సమస్యల బారిన పడుతున్నారు. కనుక పిల్లలను మొబైల్‌కు దూరంగా ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఆర్‌బీఐ డబుల్ బొనాంజా



రెపో, సీఆర్ఆర్‌లో భారీ కోత.. ఇక రుణాలు మరింత చౌక!

రెపో రేటు 0.50 శాతం తగ్గింపు ● 5.5 శాతానికి దిగివచ్చిన రెపో

5 ఏళ్లలో ఇదే అతిపెద్ద తగ్గుదల ● బ్యాంకులకు రూ.2.5 లక్షల కోట్ల బూస్ట్

సీఆర్ఆర్ ఒక శాతం తగ్గింపు ● 3 శాతానికి నగదు నిల్వల నిష్పత్తి

ద్రవ్యోల్బణం అంచనా 3.7 శాతం ● జీడీపీ వృద్ధి అంచనా 6.5%

ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు ప్రకటించిన ఆర్‌బీఐ

ఆగస్టు 4-6 తేదీల్లో తదుపరి సమీక్ష

ముంబై: రుణగ్రహీతలు, బ్యాంకింగ్ రంగానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) బంపర్ బొనాంజా ప్రకటించింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయాలతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు మరింత చౌకగా లభించనున్నాయి. ఇప్పటికే తీసుకున్న రెపో ప్రామాణిక రుణాలపై నెలవారీ చెల్లింపుల (ఈఎంఐ) భారం గణనీయంగా తగ్గనుంది. అలాగే, బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యతను భారీగా పెంచేలా చర్యలు చేపట్టింది. బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేయడంతో పాటు దేశ ఆర్థిక వృద్ధికి ఇది దోహదపడనుంది. ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో భాగంగా రెపో రేటును 0.50 శాతం తగ్గిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం ప్రకటించారు. దాంతో రెపో 6 శాతం నుంచి 5.50 శాతానికి దిగివచ్చింది. గడిచిన ఐదేళ్లలో ఇదే అతిపెద్ద రెపో తగ్గుదల. అంతేకాదు, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఆర్‌బీఐ రెపో రేటును 1 శాతం తగ్గించింది. ఈ ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షల్లో 0.25 శాతం చొప్పున కోత పెట్టింది. కాగా, బ్యాంక్‌లకు నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని ఒక శాతం తగ్గిస్తున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. దాంతో సీఆర్ఆర్ 3 శాతానికి జారుకోనుంది. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలో అదనంగా రూ.2.5 లక్షల కోట్ల మేర నిధులు అందుబాటులోకి రానున్నాయి. అయితే, సీఆర్ఆర్ తగ్గింపు సెప్టెంబరు-డిసెంబరు మధ్య కాలంలో నాలుగు విడతల్లో అమలులోకి రానుంది. బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద తప్పనిసరిగా నిల్వ చేయాల్సిన నగదు నిష్పత్తిని సీఆర్ఆర్ అంటారు.

బ్యాంకుల్లో విదేశీ వాటా పరిమితి పెంచం..

దేశీయ బ్యాంకుల్లో విదేశీ యాజమాన్య వాటా పరిమితిని ప్రస్తుతమున్న 15 శాతానికి మించి పెంచే ఆలోచన లేదని ఆర్‌బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో మరిన్ని బ్యాంకులు అవసరమే. అయితే, నమ్మకమైన యాజమాన్యాలు, మేనేజర్లు అవసరమని ఆయన పేర్కొన్నారు. దేశీయ బ్యాంకులో విదేశీ సంస్థ గరిష్ఠంగా 15 శాతం వరకు వాటా కలిగి ఉండవచ్చు. ఇంతకు మించి వాటా పెంపునకు కేవలం అవసరానుగుణంగానే అనుమతించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సీఎస్‌బీ బ్యాంక్‌లో ప్రవాస భారతీయుడు ప్రేమ్‌వత్సకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ 51 శాతం వాటా కలిగి ఉంది. తాజాగా, యెస్ బ్యాంక్‌లో జపాన్‌కు చెందిన ఎస్ఎంబీసీ 20 శాతం వాటా కొనుగోలుకు ఆర్‌బీఐ అనుమతిచ్చింది.

ఏకగ్రీవ నిర్ణయం కాదు..

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) పరపతి సమీక్షలో భాగంగా మూడు రోజుల పాటు సమావేశమైంది. మార్కెట్లో ధరలు అదుపులోకి వచ్చిన నేపథ్యంలో ఆర్థిక వృద్ధికి దోహదపడేలా కీలక వడ్డీ (రెపో) రేటును అర శాతం తగ్గించాలన్న ప్రతిపాదనకు ఐదుగురు సభ్యులు ఓటేయగా.. ఒకరు మాత్రం వ్యతిరేకించారు.

భవిష్యత్‌పై తటస్థ వైఖరి

కీలక వడ్డీ రేటుపై భవిష్యత్ వైఖరిని ఆర్‌బీఐ సానుకూలం నుంచి తటస్థ స్థాయికి మార్చింది. అంటే, ద్రవ్యోల్బణం వంటి స్థూల ఆర్థిక గణాంకాల డేటా ఆధారంగా భవిష్యత్‌లో రేట్లను మరింత తగ్గించడం లేదా పెంచే అవకాశాలుంటాయి. ముున్ముందు వడ్డీ రేట్లను మరింత తగ్గించేందుకున్న అవకాశాలు పరిమితమేనని ఆర్‌బీఐ గవర్నర్ సంకేతాలిచ్చారు.

సంజయ మల్హోత్రా
గవర్నర్

ఇండస్‌ఇండ్ బ్యాంక్.. ఓకే!

ఆర్థిక అవకతవకలు వెలుగుచూసిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ పరిస్థితి ప్రస్తుతం బాగానే ఉందని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు. ఈ లోపాలకు బాధ్యత వహిస్తూ బ్యాంక్ ఎండీ, సీఈఓ సుమంత్ కథ్పాలియా రాజీనామా చేయడం జవాబుదారీ చర్యకు మంచి ఉదాహరణగా చూడవచ్చన్నారు. అలాగే, సంక్షోభ కాలంలో బ్యాంక్ నియంత్రణ ప్రశ్నలన్నింటికీ కట్టుబడి ఉందన్నారు. అంతేకాదు, బ్యాంక్‌పై ఎలాంటి చర్య చేపట్టేందుకైనా ఆర్‌బీఐ సంకోచించదని, ఈ విషయంలో ఏమైనా నేరాలు జరిగి ఉంటే చట్టం తన పని చేస్తుందన్నారు. గడిచిన కొన్ని త్రైమాసికాలుగా ఇండస్‌ఇండ్ బ్యాంక్ సవాళ్లు ఎదుర్కొంటోంది. తమ డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో రూ.2,100 కోట్ల అకౌంటింగ్ వ్యత్యాసాన్ని గుర్తించామని, ఇది బ్యాంక్ విలువను దాదాపు 2.35 శాతం వరకు ప్రభావితం చేయవచ్చని ఈ మార్చిలో ప్రకటించింది. దాంతో బ్యాంక్ షేరు భారీగా క్షీణించడంతో చిన్న మదుపరులు, ఇతర ఇన్వెస్టర్లు నష్టపోవాల్సి వచ్చింది.

క్రిప్టోలతో ఆర్థిక స్థిరత్వానికి భంగం

బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీలపై ఆర్‌బీఐ మరోసారి ఆందోళన వ్యక్తం చేసింది. అవి దేశ ఆర్థిక స్థిరత్వానికి భంగం వాటిల్లవచ్చని మల్హోత్రా అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం క్రిప్టోలపై ముసాయిదా చర్చాపత్రం రూపొందించే పనిలో ఉంది.

తదుపరి సమీక్ష తేదీల మార్పు

ఆగస్టులో నిర్వహించే సమీక్ష తేదీలను ఆర్‌బీఐ సవరించింది. ఈ మార్చిలో ప్రకటించిన షెడ్యూలు ప్రకారంగా.. ఆగస్టు 5-7 తేదీల్లో ద్రవ్య పరపతి విధాన సమీక్షా సమావేశాలు జరగాల్సి ఉంది. కానీ, పాలనపరమైన అవసరాల కారణంగా తదుపరి సమీక్ష సమావేశ తేదీలను ఆగస్టు 4-6 తేదీలకు మార్చడం జరిగిందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

భారత్-పాక్ ఉద్రిక్తతల ప్రభావం నామమాత్రమే

భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల ప్రభావం మన ఆర్థిక వ్యవస్థపై నామమాత్రమేనని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు. ఉద్రిక్తతల సమయంలో ఉత్తర భారతంపై కొంత ప్రభావం పడిందన్నారు. ఎందుకంటే, ఆ సమయంలో విమానాశ్రయాలు మూతపడ్డాయి. విమాన ప్రయాణాలు తగ్గాయి. వస్తు సరఫరాకు కొంత ఆటంకం కలిగింది. అయితే, ఆర్థిక కార్యకలాపాలు, జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణంపై దాని ప్రభావం లేదన్నారు. ఈ ఏప్రిల్ 22న పహల్గాంలో తీవ్రవాదులు 26 మంది పర్యాటకులను దారుణంగా కాల్చిచంపిన విషయం తెలిసిందే. ఇందుకు కారణమైన పాకిస్థాన్ తీవ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసేందుకు భారత సేన ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. ఈ మే 7న పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో తీవ్రవాదులకు చెందిన 9 స్థావరాలను ధ్వంసం చేసింది. కాగా, దేశంలో కొవిడ్ కేసుల పెరుగుదలపైనా మల్హోత్రా స్పందించారు. ప్రస్తుతానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

వృద్ధి - ద్రవ్యోల్బణం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) జీడీపీ వృద్ధి రేటు అంచనాను ఆర్‌బీఐ గతంలో ప్రకటించిన 6.5 శాతాన్ని యథాతథంగా కొనసాగించింది. భారత ఆర్థిక వ్యవస్థ బలాన్ని, స్థిరత్వాన్ని ప్రదర్శించడంతో పాటు అంతర్జాతీయ అనిశ్చితులను అవకాశాలుగా మలుచుకోనుందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలోనూ జీడీపీ వృద్ధి 6.5 శాతంగా నమోదైంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాను గతంలో ప్రకటించిన 4 శాతం నుంచి 3.7 శాతానికి తగ్గించింది. గడిచిన కొన్నేళ్లలో ఇదే అత్యల్ప ద్రవ్యోల్బణ అంచనా. అంతర్జాతీయ మార్కెట్లో కమోడిటీ ధరలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో కీలక ఉత్పత్తుల ధరలు అదుపులోనే ఉండవచ్చని ఆర్‌బీఐ భావిస్తోంది.

అంచనాలు (%)

త్రైమాసికం	జీడీపీ వృద్ధి	ద్రవ్యోల్బణం
ఏప్రిల్-జూన్ (క్యూ1)	6.5	2.9
జూలై-సెప్టెంబరు (క్యూ2)	6.7	3.4
అక్టోబరు-డిసెంబరు(క్యూ3)	6.6	3.9
జనవరి-మార్చి (క్యూ4)	6.3	4.4

వాహన బీమా మరింత భారం?

» థర్డ్ పార్టీ ప్రీమియం 25 శాతం అప్!

న్యూఢిల్లీ: మోటార్ ఇన్సూరెన్స్ ముఖ్యంగా థర్డ్ పార్టీ (టీపీ) ఇన్సూరెన్స్ ప్రీమియం భారీగా పెరగనుంది. ఈ ప్రీమియంను 18 నుంచి 25 శాతం పెంచాలని బీమా నియంత్రణ అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ఇప్పటికే సిఫారసు చేసింది. రోడ్డు రవాణ, రహదారులు మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఈ ప్రతిపాదనలను చురుగ్గా పరిశీలిస్తోంది. వచ్చే రెండు మూడు వారాల్లో ప్రభుత్వం ఈ సిఫారసులపై నిరయం తీసుకుంటుందని సమాచారం. 2022 తర్వాత థర్డ్ పార్టీ మోటార్ ఇన్సూరెన్స్ ప్రీమియం పెంచలేదు. దీంతో వచ్చే ప్రీమియం కంటే క్లెయిమ్స్‌పై చేసే చెల్లింపులు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ అయితే 2024-25 ఆర్థిక సంవత్సరంలో వసూలు చేసిన ప్రీమియం కంటే 8 శాతం అధికంగా టీపీ చెల్లింపులు చేసింది. ప్రైవేట్ రంగంలోని గో డిజిట్, ఐసీఐసీఐ లొంబార్డ్ సంస్థల టీపీ చెల్లింపులూ 64.2 శాతం నుంచి 69 శాతం వరకు ఉన్నాయి. టీపీ ప్రీమియం రేట్లు పెంచితే తప్ప ఈ భారం మోయడం తమ వల్ల కాదని బీమా కంపెనీలు ఇప్పటికే స్పష్టం చేశాయి. దీంతో త్వరలోనే మోటార్ ఇన్సూరెన్స్ థర్డ్ పార్టీ ప్రీమియాలు మరింత భారంగా మారనున్నాయి.

స్టార్‌లింక్‌కు గ్రీన్‌సిగ్నల్

» లైసెన్స్ మంజూరు చేసిన డాట్

నూఢిల్లీ: ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్.. భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు ప్రారంభించేందుకు టెలికాం శాఖ (డాట్) లైసెన్స్ మంజూరు చేసింది. దీంతో దేశంలో ఈ తరహా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు అనుమతి పొందిన మూడో సంస్థగా స్టార్‌లింక్ నిలిచింది. ఇంతకు ముందు యూటెల్‌సాట్ వన్‌వెబ్, జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్ లైసెన్స్ పొందగా.. అమెజాన్ చెందిన క్యైపర్ సంస్థ ఇంకా అనుమతుల కోసం ఎదురు చూస్తోంది. ట్రయల్ స్పెక్ట్రమ్ కోసం స్టార్‌లింక్ దరఖాస్తు చేసిన 15-20 రోజుల్లో అనుమతులు రానున్నాయి. స్టార్‌లింక్‌కు ప్రభుత్వం గత నెలలో లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ) జారీ చేయగా ఇప్పుడు పూర్తి లైసెన్స్ మంజూరు చేసింది. అయితే, పూర్తి స్థాయిలో కమర్షియల్ సేవలు ప్రారంభించే ముందు, సెక్యూరిటీ ప్రమాణాలు, దేశంలోని గేట్‌వేలు, హబ్‌లు, మానిటరింగ్ వ్యవస్థల ఏర్పాట్లు వంటి తదితర అంశాల్లో ప్రభుత్వ నిర్దేశించిన ప్రమాణాలను కంపెనీ నిరూపించుకోవాల్సి ఉంటుంది.

మార్కెట్లకు ఆర్‌బీఐ బూస్ట్

ముంబై: ఆర్‌బీఐ జంబో రేట్ల తగ్గింపుతో శుక్రవారం స్టాక్ మార్కెట్లు దూసుకుపోయాయి. దీంతో మార్కెట్ వరుసగా మూడో రోజూ లాభాలతో ముగిసింది. ఆరంభంలో స్వల్ప నష్టాలతో ప్రారంభమైన సూచీలు.. ఆర్‌బీఐ రేట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించగానే రేసు గుర్రాల్లా పరుగెత్తాయి. సెన్సెక్స్ ఒక దశలో 857.85 పాయింట్ల లాభంతో 82,299.89 పాయింట్ల ఇంట్రాడే గరిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 746.95 పాయింట్ల లాభంతో 82,188.99 పాయింట్ల వద్ద స్థిరపడింది. మరోవైపు నిఫ్టీ కూడా 252.15 పాయింట్ల లాభంతో 25,003.05 వద్ద ముగిసింది. రియల్టీ ఇండెక్స్ 5 శాతం మేర లాభపడగా ఆటోమొబైల్ ఇండెక్స్ 1.5 శాతం, బ్యాంకెక్స్ 1.25 శాతం మేరకు లాభపడ్డాయి. నవంబరులోగా సీఆర్ఆర్‌ను దశలవారీగా ఒక శాతం వరకు తగ్గించబోతున్నట్టు ఆర్‌బీఐ చేసిన ప్రకటనతో బ్యాంక్ నిఫ్టీ ఒక దశలో 934.15 పాయింట్ల లాభంతో 56,695 పాయింట్లతో జీవితకాల గరిష్ఠ స్థాయిని తాకింది. చివరికి 817.55 పాయింట్ల లాభంతో 56,578.40 వద్ద ముగిసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,650 ▲	91,350 ▲	1,17,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,00,800 ▲
విశాఖపట్నం	1,00,040 ▼	91,300 ▲	1,18,000 ▲
రాజమండ్రి	99,600 ▲	91,300 ▲	1,08,600 ▲
ప్రొద్దుటూరు	96,800 ▲	89,060 ▲	1,03,000 ▲
ముంబై	97,145 ▼	88,985 ▼	1,05,285 ▲

బంగారం రుణాలకు ఎల్‌టీవీ నిష్పత్తి పెంపు



రూ.2.5 లక్షల లోపు రుణాలకు 75 శాతం నుంచి 85 శాతానికి

» రూ.2.5-5 లక్షల వరకు రుణాలకు 80%.. తుది మార్గదర్శకాలు విడుదల చేసిన ఆర్‌బీఐ

బంగారం తనఖా రుణాలకు సంబంధించిన తుది మార్గదర్శకాలను ఆర్‌బీఐ శుక్రవారం రాత్రి విడుదల చేసింది. రూ.2.5 లక్షల లోపు గోల్డ్ లోన్‌కు లోన్ టు వాల్యూ (ఎల్‌టీవీ) నిష్పత్తిని ప్రస్తుతమున్న 75 శాతం నుంచి 85 శాతానికి పెంచుతున్నట్లు తెలిపింది. అయితే, ఈ రుణాల్లో రిస్క్‌ను తగ్గించేందుకు కొన్ని షరతులను సైతం విధించింది. 'ఆర్‌బీఐ (బంగారం, వెండి తనఖాపై రుణం) మార్గదర్శకాలు 2025' ప్రకారం.. రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలకు ఎల్‌టీవీ నిష్పత్తిని 80 శాతంగా నిర్ణయించింది. రూ.5 లక్షలకు పైగా రుణాలకు మాత్రం ఎల్‌టీవీ నిష్పత్తి 75 శాతంగా కొనసాగనుంది. బ్యాంకులు లేదా గోల్డ్ లోన్ కంపెనీలు రుణాలు మంజూరు చేసేందుకు ఈ నిష్పత్తే ఆధారం. రుణగ్రహీత తాకట్టు పెట్టే బంగారం నికర విలువలో ఆ రోజున రుణ మంజూరుకు అర్హత శాతమే ఎల్‌టీవీ నిష్పత్తి. బుల్లెట్ రీపేమెంట్ లోన్స్ విషయానికొస్తే, ఎల్‌టీవీ మదింపులో రుణ కాలపరిమితి ముగిసే నాటికి తిరిగి చెల్లించాల్సిన మొత్తాన్ని (అసలు+వడ్డీ) పరిగణనలోకి తీసుకుంటారు. మరిన్ని విషయాలు..

● తనఖా బంగారం యాజమాన్యంపై సందేహాలున్నప్పుడు రుణం మంజూరు చేయరాదు. ఆర్‌బీఐ తాజా మార్గదర్శకాల ప్రకారం.. తనఖా పెట్టే బంగారానికి రుణగ్రహీతే అసలైన యజమాని అని ధ్రువీకరించే పత్రం లేదా రశీదును కోరాలి. రశీదు లేని పక్షంలో పూచీకత్తుగా సమర్పిస్తున్న లోహానికి తానే అసలైన యజమాని అని తెలిపే స్వీయ ప్రకటిత (సెల్ఫ్ డిక్లరేషన్) పత్రాన్ని తీసుకోవాలి.

● గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్), మ్యూచువల్ ఫండ్ యూనిట్లు వంటి ఆర్థిక ఆస్తులపై ఎలాంటి రుణాలు లేదా అడ్వాన్సు మంజూరు చేయవద్దు.

● ఇప్పటికే తనఖా పెట్టిన బంగారం లేదా వెండిని మళ్లీ తనఖా పెట్టుకుని రుణాలివ్వరాదు.

● ఒక రుణగ్రహీత నుంచి కిలో బంగారు నగలు లేదా 10 కిలోల వెండి ఆభరణాలకు మించి తనఖా స్వీకరించవద్దు. నాణేల విషయంలో బంగారమైతే 50 గ్రాములు, వెండి అయితే 500 గ్రాములకు మించరాదు.

● తనఖా కింద స్వీకరించే బంగారం లేదా వెండి విలువను ఆ లోహం స్వచ్ఛత ఆధారిత ధర ప్రకారంగా లెక్కించాలి. ఇందుకోసం ఇండియన్ బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ లిమిటెడ్ లేదా సెబీ నియంత్రణలోని కమోడిటీ ఎక్స్ఛేంజ్ ధరలను ప్రామాణికంగా తీసుకోవాలి. గడిచిన 30 రోజుల ముగింపు ధరల సగటు లేదా క్రితం రోజు ముగింపు ధరను ఇందుకు పరిగణనలోకి తీసుకోవాలి.

● రూ.2.5 లక్షల వరకు రుణాల కోసం తాకట్టు పెట్టే బంగారానికి క్రెడిట్ అప్రైజల్ అవసరం లేదని పరపతి సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా తెలిపారు.

● తాజా మార్గదర్శకాలను రుణదాతలు వీలైనంత త్వరగా పాటించాలని, 2026 ఏప్రిల్ 1 నుంచి తప్పక అమలు చేయాల్సిందేనని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

తగ్గనున్న ఈఎంఐల భారం

వడ్డీ రేట్లు తగ్గించిన పీఎన్‌బీ, బీఓఐ

ఆర్‌బీఐ నిర్ణయంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) తమ రెపో ఆధారిత వడ్డీ రేట్లు (ఆర్‌బీఎల్ఆర్) 0.50 శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. తగ్గించిన వడ్డీ రేట్లు ఈ నెల 9 నుంచి అమల్లోకి వస్తాయని పీఎన్‌బీ వెల్లడించింది. తాజా రేట్ల తగ్గింపుతో గృహ రుణాలు 7.45 శాతం నుంచి ప్రారంభం కానుండగా వాహన రుణాలు 7.8 శాతం నుంచి మొదలవుతాయని పీఎన్‌బీ తెలిపింది. కాగా బీఓఐ కూడా తన ఆర్‌బీఎల్ఆర్‌ను 8.85 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గించినట్లు వెల్లడించింది.

ఎంత తగ్గొచ్చు: ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఆర్‌బీఐ కీలక రెపో రేటును ఒక శాతం తగ్గించింది. ఇందులో అర శాతాన్ని ఈ ఏడాది జనవరి, ఏప్రిల్ నెలల్లో, మిగతా అర శాతాన్ని శుక్రవారం తగ్గించింది. దీంతో రెపో ఆధారిత గృహ రుణాల వడ్డీ రేట్లు దిగొస్తున్నాయి. అయితే ఈ వడ్డీ రేట్ల కోతతో ఎవరికి ఎంత భారం తగ్గుతుందనేది ఆయా వ్యక్తుల రుణ కాలపరిమితి, ఈఎంఐలపై ఆధారపడి ఉంటుంది. ఒకే కాలపరిమితితో కేవలం ఈఎంఐ మాత్రమే తగ్గించుకుంటే ఒక రకంగా, అదే ఈఎంఐతో కాలపరిమితి మాత్రమే తగ్గించుకుంటే వడ్డీ భారం తగ్గుతుంది.

ఈఎంఐ మాత్రమే తగ్గించుకుంటే: 20 ఏళ్ల కాలపరిమితితో ఒక వ్యక్తి 9.5 శాతం వడ్డీతో గృహ రుణం తీసుకుంటే, ఇప్పుడు అతను చెల్లించే వడ్డీ రేటు 8.5 శాతం. అదే కాలపరిమితితో ఈఎంఐ మాత్రమే తగ్గించుకుంటే అతడికి నెలకు అదా అయ్యే ఈఎంఐ రూ.1,929. అంటే 20 ఏళ్ల కాలంలో అతడికి ఆదా అయ్యే వడ్డీ రూ.4,63 లక్షలు.

ఈఎంఐ మార్పు.. 8.5% వడ్డీతో

రుణ మొత్తం	తగ్గే ఈఎంఐ	20 ఏళ్లలో ఆదా అయ్యే మొత్తం వడ్డీ
రూ.20 లక్షలు	రూ.1,929	రూ.4.63 లక్షలు
రూ.50 లక్షలు	రూ.3,215	రూ.7.71 లక్షలు
రూ.75 లక్షలు	రూ.4,823	రూ.11.58 లక్షలు
రూ.1 కోటి	రూ.6,431	రూ.15.43 లక్షలు

ఈఎంఐలో మార్పు లేకుండా 8.5% వడ్డీతో

రుణ మొత్తం	ఆదా అయ్యే సంవత్సరాలు	ఆదా అయ్యే వడ్డీ
రూ.30 లక్షలు	3.16	రూ.10.59 లక్షలు
రూ.50 లక్షలు	3,16	రూ.17.64 లక్షలు
రూ.75 లక్షలు	3.16	రూ.26.47 లక్షలు
రూ.1 కోటి	3.16	రూ.35.29 లక్షలు

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	540
వరంగల్	532	గోదావరి	515
చిత్తూరు	613	విశాఖపట్నం	535

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	107
కర్నూలు	110	నెల్లూరు	112
విశాఖపట్నం	101	అనంతపురం	112
గోదావరి	114		

ఆర్థిక మాంద్యంతోనే 'కింగ్‌ఫిషర్' కుదేలు!


» ఎయిర్‌లైన్స్ పరిధిని కుదిస్తానంటే ప్రణబ్ ముఖర్జీ వద్దన్నారు

» బ్యాంకులు సహకరిస్తాయన్నారు

» నా బకాయిలు రూ.6,203 కోట్లే.. 9 వేల కోట్లనడం అబద్ధం

» నేనేమీ పారిపోలేదు..

» జైట్లీకి చెప్పే జెనీవా వెళ్లాను: మాల్యా



న్యూఢిల్లీ, జూన్ 6: అప్పులు తిరిగి చెల్లిస్తానని చెప్పినా తనపై 'దొంగ' అనే ముద్ర వేశారని పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడు, కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ అధినేత విజయ్ మాల్యా అన్నారు. ఆర్థిక మాంద్యం కారణంగానే తన సంస్థ దెబ్బతిందని వాపోయారు. ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఎయిర్‌లైన్స్ పరిధిని కుదించాలనుకుని నాటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీని సంప్రదించానని.. కానీ ఆయన తిరస్కరించారని తెలిపారు. మోసం, మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న మాల్యా శుక్రవారం యూట్యూబర్, పారిశ్రామికవేత్త రాజ్ శామనీతో 'పాడ్‌కాస్ట్'లో సంభాషించారు. కింగ్‌ఫిషర్ పతనానికి దారితీసిన పరిణామాలను వివరించారు. '2005లో ప్రారంభించిన కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ అనతికాలంలోనే నాణ్యమైన సేవలతో మంచిపేరు తెచ్చుకుంది. 2008 వరకు మా కార్యకలాపాలు సజావుగా నడిచాయి. ఆ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. దీంతో సమస్యలు చుట్టుముట్టాయి. ధనప్రవాహం నిలిచిపోయింది. రూపాయి విలువ క్షీణించింది. ఆర్థిక వాతావరణం నానాటికీ పతనావస్థకు చేరడంతో ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలు కుదించడానికి అనుమతివ్వాలని అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీని కలిసి అభ్యర్థించాను. విమానాల సంఖ్య తగ్గిస్తానని, ఉద్యోగులను తొలగిస్తానని.. కంపెనీ పరిధిని కుదిస్తానని కోరాను. ఆయన తిరస్కరించారు. కార్యకలాపాలు కొనసాగించాలని.. బ్యాంకులు సహకరిస్తాయని చెప్పారు. కింగ్‌ఫిషర్ సంక్షోభానికి అదే నాంది. ఆయన తప్పుడు సలహా ఇచ్చారు. సంస్థ పనితీరు సరిగా లేకపోవడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి నిరాకరించాయి. దీంతో ఆర్థిక సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. చివరకు విమానాలన్నీ నిలిపివేశాం' అని తెలిపారు. ఆర్థిక అవకతవకలపై స్పందిస్తూ.. బ్యాంకులు డబ్బులు తిరిగి చెల్లించాలన్న సదుద్దేశంతో నాలుగు సెటిల్మెంట్ ప్రతిపాదనలు వాటి ముందు పెట్టానని.. కానీ అవి తిరస్కరించాయని ఆరోపించారు. బ్యాంకుల్లో పారదర్శకత లేదని విమర్శించారు. 15 సార్లు జ్ఞాపకం చేసినా.. తన అకౌంట్ స్టేట్‌మెంట్‌ను ఇవ్వలేదన్నారు. తాను చెల్లించాల్సిన మొత్తం రుణాలు 14,131.6 కోట్లకు చేరాయని పార్లమెంటులో ఆర్థిక మంత్రి ప్రకటన చేశారని తెలిపారు. తాను 9 వేల కోట్లు బకాయి పడినట్లు మీడియాలో వచ్చిన కథనాలతో ఆయన విభేదించారు. తాను తీసుకున్న అప్పు రూ.6,203 కోట్లు మాత్రమేనన్నారు. అప్పుపడిన దానికంటే ఎక్కువే చెల్లించినా తనపై దొంగ అన్న ముద్ర వేశారన్నారు.

జెనీవా వెళ్తున్నానని జైట్లీకి చెప్పా..

టీవీ యాంకర్లు తాను పరారయ్యారని అన్నారని.. కానీ తానేమీ పారిపోలేదని మాల్యా చెప్పారు. 2016 మార్చిలో నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి సమాచారమిచ్చే జెనీవా వెళ్లానని.. రుణాల సెటిల్‌మెంట్‌కు బ్యాంకులు సంప్రదింపులు జరిపేలా చేయాలని విజ్ఞప్తి చేశానని తెలిపారు. "జైట్లీని నేను కలిసిన విషయం మీడియాలో రావడంతో ఆయన తొలుత ఖండించారు. అయితే ఓ కాంగ్రెస్ ఎంపీ మా ఇద్దరినీ చూసి మీడియాతో మాట్లాడడంతో జైట్లీ మాటమార్చారు. క్లుప్తంగా మాత్రమే మాట్లాడుకున్నామని.. సమావేశం కాలేదని చెప్పారు. అయితే నేను నేరస్థుడిని కాను. విదేశీ భాగస్వాములను సమన్వయం చేసుకుని రుణాలు చెల్లించాలని భావించాను. ఈడీని సమయం కోరాను. అయితే విదేశాల్లో ఉండగా నా పాస్‌పోర్టు రద్దుచేయడంతో భారత్‌కు తిరిగి రాలేకపోయా' అని చెప్పారు. కింగ్‌ఫిషర్ పతనానికి తొలిసారి మాల్యా బహిరంగంగా క్షమాపణ చెప్పారు.

మోదీ 'నేరపూరిత ఎకనామిక్స్': కాంగ్రెస్

అరుణ్ జైట్లీకి చెప్పే విదేశాలకు పారిపోయానని మాల్యా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ స్పందించింది. ప్రధాని మోదీ ప్రవచిత 'పకోడా ఎకనామిక్స్'.. నేరపూరిత ఎకనామిక్స్‌గా మారాయని ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి పవన్ ఖేరా ధ్వజమెత్తారు. మాల్యా పరారీలో మోదీ ప్రభుత్వ హస్తం ఉందనేది స్పష్టమైందన్నారు. 'మీపై దాడి చేయబోతున్నామని విదేశాంగ మంత్రి పాకిస్థాన్‌కు ముందే చెప్పేస్తారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసిన నేరగాళ్లు దేశ ఆర్థిక మంత్రికి చెప్పే పరారవుతారు. నరేంద్ర మోదీ వ్యవస్థంతా లొంగుబాటే' అని ఎద్దేవాచేశారు.

మాపైనే దర్యాప్తునకు ఆదేశిస్తారా?

» అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపై అమెరికా ఆగ్రహం

» నలుగురు జడ్జిలపై ఆంక్షలు విధిస్తున్నట్టు ప్రకటన

వాషింగ్టన్, జూన్ 6: కోర్టు ఇచ్చిన తీర్పుల్ని మనకు నచ్చినా, నచ్చకున్నా పాటిస్తాం. పాటించాలి. కానీ.. అమెరికాకి అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ)లో నచ్చని తీర్పు వస్తే ఏం చేసిందో తెలుసా? ఆ కోర్టులోని న్యాయమూర్తులపైనే ఆంక్షలు విధించింది! గాజాపై ఇజ్రాయెల్ దాడులను యుద్ధనేరంగా పరిగణిస్తూ.. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు చెందిన నలుగురు న్యాయమూర్తులు దర్యాప్తునకు ఆదేశించారు. దీంతో అమెరికాకు కోపం వచ్చింది. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు రాజకీయ వేదికగా మారిందని, ప్రత్యేకించి ఈ నలుగురు న్యాయమూర్తులూ చట్టవిరుద్ధంగా, ఆధారాలేవీ లేకుండా.. అమెరికాను, తమ మిత్రదేశమైన ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకున్నారని అమెరికా విదేశాంగ మంత్రి రుబియో ఆగ్రహం వ్యక్తం చేశారు. బెనిన్, పెరూ, స్లొవేనియా, ఉగాండాకు చెందిన ఆ నలుగురు న్యాయమూర్తులకు చెందిన ఆస్తులు అమెరికా పరిధిలో ఉంటే వాటన్నింటిని స్తంభింపజేస్తామని ప్రకటించారు. ట్రంప్ మొదటిసారి అధ్యక్ష పదవి చేపట్టినప్పుడు కూడా ఇలాగే అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపై ఆంక్షలు విధిస్తే.. 2021లో బైడెన్ సర్కారు వాటిని తొలగించింది.

హార్వర్డ్‌పై ట్రంప్ నిర్ణయానికి కోర్టు బ్రేక్

వాషింగ్టన్, జూన్ 6: హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుకునేందుకు వచ్చే విదేశీ విద్యార్థులు అమెరికాలోకి రాకుండా నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఫెడరల్ కోర్టులో చుక్కెదురైంది. ఆయన విధించిన ఆంక్షలను ఫెడరల్ కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ట్రంప్ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఫెడరల్ కోర్టును హార్వర్డ్ యూనివర్సిటీ ఆశ్రయించింది. వైట్‌హౌస్ డిమాండ్లను హార్వర్డ్ వర్సిటీ తిరస్కరించిన నేపథ్యంలో ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైన ప్రతీకార చర్యగా అభివర్ణించింది.

గ్రామీణ సాధికారతతోనే వికసిత్ భారత్

» రీజనల్ రూరల్ వర్క్‌షాప్‌లో కేంద్ర మంత్రి పెమ్మసాని



రీజనల్ రూరల్ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

న్యూఢిల్లీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): దేశంలోని గ్రామీణ ప్రాంతాలు సాధికారత సాధించినప్పుడే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తేనే వికసిత్ భారత్ నిర్మితమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన(గ్రామీణ)' కార్యక్రమంలో భాగంగా గోవాలో శుక్రవారం నిర్వహించిన రీజనల్ రూరల్ వర్క్‌షాప్‌లో కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడారు. '2029 మార్చి నాటికి 4.95 కోట్ల గృహాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో భాగంగా 3.69 కోట్ల గృహాలు మంజూరు చేశాం. అందులో 2.76 కోట్ల గృహాల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. పీఎంఏవై(జీ)ని ఉజ్వల యోజన, జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ వంటి పథకాలతో సమన్వయం చేయడం ద్వారా ప్రతి గ్రామీణ కుటుంబానికి శుద్ధి చేసిన తాగు నీరు, మరుగుదొడ్లు, వంట గ్యాస్ అందించేలా కృషి చేస్తున్నాం. పర్యావరణాన్ని కాపాడుతూ అందరికీ అందుబాటులో ఉండే ఇళ్లను అందిస్తున్నాం' అని పెమ్మసాని వివరించారు.

ఈసారి 69 అడుగుల ఎత్తుతో ఖైరతాబాద్ గణపతి



ఖైరతాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఈసారి వినాయక ఉత్సవాల్లో ఖైరతాబాద్ గణపతి విశ్వశాంతి మహాశక్తి గణేషుడిగా పూజలందుకోనున్నాడు. 69 అడుగుల ఎత్తుతో నాగసర్పంపై ఐదు తలల నాగుపాము నీడన మూడు తలలు, 8 చేతులతో శాంతమూర్తిగా గణపతి దర్శనమివ్వానున్నాడు. గణేషుడికి పూరీ జగన్నాథుడు ఓ వైపు, లలితా త్రిపుర సుందరీ దేవి మరోవైపున కొలువుదీరనున్నారు. అలాగే కుడి వైపు లక్ష్మీ సమేత హయగ్రీవస్వామి, కుడి వైపు గజ్జెలమ్మ తల్లిని ఆవిష్కరిస్తున్నారు. గణపతి విగ్రహ రూపకల్పన పనులు శుక్రవారం మొదలయ్యాయి. మండపం పనులు ప్రారంభించారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

» వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు హెచ్చరిక

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రసాయన ఎరువులను ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విక్రయిస్తే.. డీలర్ల లైసెన్సులు రద్దు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. నానో యూరియా, నానో డీఏపీ అందుబాటులో ఉన్నాయన్నారు. ఖరీఫ్ సీజన్‌కు 16.76లక్షల టన్నుల ఎరువులు అవసరమైతే, ప్రస్తుతం 9.09 లక్షల టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

వ్యవసాయ పరికరాలకు ముందస్తు రాయితీ

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చిన్నసన్నకారు రైతులకు మేలు చేసేలా వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలులో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో వ్యవసాయ యంత్ర పరికరాలు కొనుగోలు చేసి, రాయితీ కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. రైతుల ఇబ్బందులను గుర్తించిన మంత్రి అచ్చెన్నాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, డైరెక్టర్ డిల్లీరావు వ్యవసాయ యాంత్రీకరణకు ముందస్తు రాయితీ విధానం(ఫ్రంట్ ఎండెడ్ సబ్సిడీ మోడల్)కు రూపకల్పన చేశారు. ఈమేరకు వ్యవసాయశాఖ, ఏపీ ఆగ్రోస్, నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ కలిసి, కర్షక్ పోర్టల్‌ను ఏర్పాటు చేసి, రైతుల వివరాలు నమోదు చేసి, దరఖాస్తు ఆమోదం పొందాక, తమకు నచ్చిన పరికరాన్ని తీసుకునేటప్పుడు రాయితీ సొమ్ము నేరుగా రైతు ఖాతాకు బదిలీ అయ్యే విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు.

నేడు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు

ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ సప్లిమెంటరీ ఫలితాలను శనివారం విడుదల చేయనున్నట్లు ఇంటర్ విద్యామండలి కార్యదర్శి కృతికా శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి http://resultsbie.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా లేదా మనమిత్ర వాట్సాప్ నంబరు 9552300009కు 'హాయ్' అని మెసేజ్ చేసి ఫలితాలు చూసుకోవ

అర్బన్ క్లినిక్స్‌లో 3,920 పోస్టులకు ఆమోదం

రాష్ట్రంలో అర్బన్ క్లినిక్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఇప్పుడు వీటిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో సిబ్బంది నియామకానికి ఆమోదం తెలుపుతూ శుక్రవారం జీవో విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న అర్బన్ క్లినిక్స్‌లో మెడికల్ ఆఫీసర్స్(560), స్టాఫ్ నర్సులు(1120), ల్యాబ్ టెక్నీషియన్లు (560), ఫార్మసిస్టులు(560), డేటా ఎంట్రీ ఆపరేటర్లు(560), శానిటరీ అటెండెంట్ల(560) నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

మాగంటికి వెంటిలేటర్‌పై చికిత్స

బంజారాహిల్స్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, హైదరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్‌కు వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతోంది. వైద్యానికి ఆయన శరీరం స్పందిస్తోందని సన్నిహితులు చెబుతున్నారు. గురువారం ఛాతీలో నొప్పి రావడంతో మాగంటి ఇంట్లోనే కుప్పకూలిపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు సీపీఆర్ చేయడంతో కాస్త కోలుకున్నారు. ఆసుపత్రిలో మరోసారి సీపీఆర్ చేయడంతో పల్స్ రేటు పెరిగింది. దీంతో ఆయనకు వెంటిలేటర్‌పై చికిత్స ప్రారంభించారు.

నెలకు రెండుసార్లు టీ.క్యాబినెట్ భేటీ

» ఏపీ తరహాలోనే..!

హైదరాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పాలనలో వేగం పెంచేందుకు, విధానపరమైన నిర్ణయాల్లో జాప్యం లేకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ప్రతినెలా రెండుసార్లు మంత్రివర్గ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. నెలలో మొదటి శనివారం, మూడో శనివారం క్యాబినెట్ సమావేశమై.. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులపై సమీక్షించనుంది.

కేసీఆర్, మంత్రి వర్గ నిర్ణయంతోనే కాళేశ్వరం

» కమిషన్ విచారణలో మాజీ మంత్రి ఈటల

హైదరాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బ్యారేజీలు నిర్మించాలన్న నిర్ణయం అప్పటి సీఎం కేసీఆర్, మంత్రివర్గం కలిసి తీసుకున్నదేనని అప్పటి ఆర్థిక శాఖ మంత్రి, ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణలో భాగంగా శుక్రవారం జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఎదుట ఆయన హాజరయ్యారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఆయన జవాబులు ఇచ్చారు. "రూ.38వేల కోట్లతో నిర్మించ తలపెట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మిస్తే ముంపు సమస్యతోపాటు అభయారణ్యానికి ఇబ్బందులు ఏర్పడతాయంటూ మహారాష్ట్ర అభ్యంతరాలు తెలిపింది. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) అప్పట్లో లేఖ రాసింది. 152అడుగుల ఎత్తులో తుమ్మిడిహెట్టి కట్టడానికి మహారాష్ట్ర ఒప్పుకోలేదు. 148 అడుగులకు తగ్గించుకుంటే హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 30 టీఎంసీలు, పారిశ్రామిక అవసరాలకు 15 టీఎంసీలు, గ్రామీణ తాగునీటి అవసరాలకు 10 టీఎంసీలు కలుపుకొని ప్రతిపాదిత 16.6 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించలేని పరిస్థితుల్లో ప్రాణహిత-చేవెళ్లను రీడిజైన్ చేశారు. తుమ్మిడిహెట్టి నుంచి నీరు తీసుకోలేమని తెలిసే హరీశ్‌రావు నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీ వేశారు. ఆ కమిటీలో నేను, తుమ్మల నాగేశ్వరరావు సభ్యులుగా ఉన్నాం. ఆ నివేదికను నీటి పారుదల శాఖ పరిశీలించి, నిర్ణయం తీసుకుంది. ప్రతిపాదన దశలో ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.60వేల కోట్లే. కాలక్రమంలో రైతుల విజ్ఞప్తులతో పలు మార్పుల అనంతరం అది రూ.80వేలకోట్లకు పెరిగింది. ఆ తర్వాత ఎంతకు చేరిందో నాకు తెలియదు" అని పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్‌కు మంచి రోజులు



» సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం.. టన్నుకు రూ.20 వేల సగటు ధర
» కొత్త ప్రాంతాల్లో సాగు విస్తరణకు ప్రణాళికలు
» మొక్కల కొరత తీర్చేందుకు తూర్పుగోదావరిలో ఆయిల్‌పామ్ సీడ్ గార్డెన్

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రోత్సాహం... ఆశాజనకంగా ఉన్న ధరతో ఆయిల్‌పామ్ సాగుకు మంచి రోజులు వచ్చాయి. దేశంలో ఆయిల్‌పామ్ విస్తీర్ణంలో 50% రాష్ట్రంలోనే సాగవుతోంది. ఆయిల్‌పామ్ విస్తీర్ణం, ఉత్పత్తి, ఉద్పాదకతలో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉంది. రాష్ట్రంలో 2.49లక్షల హెక్టార్లలో తోటలు ఉన్నాయి. 24 జిల్లాల్లో 373 మండలాల్లో 1.97లక్షల మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే ముడి ఆయిల్‌పామ్‌లో 85-90శాతం మన రాష్ట్రం నుంచే వస్తోంది. ఈ నేపథ్యంలో సాగును మరింత ప్రోత్సహించేందుకు, కొత్త ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. రైతుల డిమాండ్‌ను తీర్చడానికి ఆయిల్‌పామ్ విత్తన మొలకల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి, మొక్కల దిగుమతిని తగ్గించడానికి రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సీడ్ గార్డెన్‌లను ప్రభుత్వం ప్రోత్సహించింది. ఇందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా మోరంపూడిలోని ఆయిల్‌పామ్ సీడ్ గార్డెన్‌లో గతేడాది నుంచి విత్తనోత్పత్తిని ప్రారంభించింది. రైతులకు మొక్కలు సరఫరా చేయడానికి లక్ష ఆయిల్‌పామ్ సీడ్ మొక్కలను ఉత్పత్తి చేసి, ఆయిల్‌పామ్ కంపెనీలకు సరఫరా చేస్తోంది. ఈవిధంగా ఆయిల్‌పామ్ సాగుకు రైతులను ప్రభుత్వం ప్రోత్సాహిస్తోంది. గతేడాది నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్ కింద 4 జిల్లాల్లో 19 మండలాలను వివిధ కంపెనీలకు కేటాయించింది. రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టడానికి అధ్యయనం చేపట్టాలని (ఐఐఓపీఆర్)ను ప్రభుత్వం కోరింది. ఆయిల్‌పామ్ ప్లాంట్ మెటీరియల్, నిర్వహణ, అంతరపంటలు, యంత్ర పరికరాల కోసం 1.20లక్షల మంది రైతులకు ప్రభుత్వం రూ.167.83కోట్లు విడుదల చేసింది. ఆయిల్‌పామ్ రంగాన్ని కీలకమైన పనితీరు సూచీల్లో ఒకటిగా ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో ఆయిల్‌పామ్ తోటల పురోగతిని మంత్రి అచ్చెన్నాయుడు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఫలితంగా 2024-25లో 22,258హెక్టార్ల సాగు లక్ష్యాన్ని సాధించినట్లు ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గత దశాబ్దంలోనే ఈ పెరుగుదల అత్యధికం. గత ఐదేళ్లలో ఆయిల్‌పామ్ తాజా పండ్ల గెలలకు సగటు ధర టన్నుకు రూ.13,132 నుంచి రూ.14వేల దాకా ఉండగా, గత 8నెలల సగటు ధర రూ.20,300 నమోదైంది.

ఆర్సీబీ మేనేజర్ అరెస్టు

» మరో ముగ్గురినీ అదుపులోకి...
» సీఎం రాజకీయ కార్యదర్శికి ఉద్వాసన
» ఇంటెలిజెన్స్ ఏడీజీపీపై బదిలీ వేటు


ఆర్సీబీ మార్కెటింగ్ మేనేజర్ నిఖిల్ సొసలె (బ్లాక్ టీషర్టు వ్యక్తి) తదితరులను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

బెంగళూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద 11 మందిని బలిగొన్న తొక్కిసలాట కేసులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) మార్కెటింగ్ మేనేజర్ నిఖిల్ సొసలెను పోలీసులు అరెస్టు చేశారు. సుమంత్, డీఎన్ఏ ఈవెంట్ మేనేజ్‌మెంట్‌కు చెందిన కిరణ్, సునిల్ మాథ్యూను కూడా అదుపులోకి తీసుకున్నారు. నిఖిల్ సొసలె అరెస్టు సమయంలో నాటకీయ పరిణామాలు జరిగాయి. ఆయన ముంబై వెళ్లేందుకు భార్యతోపాటు విమానాశ్రయంలో ఉండగా పోలీసులు ఒక్కసారిగా దాడి చేసి పట్టుకున్నారు. ఆ తర్వాత మిగతా ముగ్గురినీ అదుపులోకి తీసుకొన్నారు. వారిని విచారించారు. ఐపీఎల్ విజేత జట్టు అయిన ఆర్సీబీ కోసం బుధవారం బెంగళూరులో విజయోత్సవాలు జరుపుతున్నట్టు ప్రకటించింది ఎవరు.. పాస్‌ల మంజూరు, ఉచిత ప్రదేశాల గురించి ప్రచారం చేసింది ఎవరనేది పోలీసులు ఆరా తీశారు. అనంతరం ఆ నలుగురినీ బెంగళూరులోని బౌరింగ్ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. కోర్టు ఎదుట వారిని హాజరుపరచగా, వారికి కోర్టు 14రోజుల రిమాండ్ విధించింది. అనంతరం నలుగురినీ పరప్పన అగ్రహార జైలుకు తరలించారు.

ఫిర్యాదు చేసిన అధికారే సస్పెండయ్యారు

ఆర్‌సీబీ మార్కెటింగ్ మేనేజర్ నిఖిల్ సొసలెకు హైకోర్టులో ఉపశమనం లభించలేదు. నిఖిల్ సొసలెను పోలీసులు అరెస్టు చేయడాన్ని ప్రశ్నిస్తూ ఆయన భార్య మాళవిక కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. 'మా రెండేళ్ల చిన్నారితో కలిసి నేను, నా భర్త ఎయిర్‌పోర్ట్‌లో ఉండగా ఆయనను అరెస్టు చేశారు. ఈ సమయంలో పోలీసులు మా ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరించారు. సీఎం సిద్దరామయ్య చెప్పారంటూ కనీస విచారణ లేకుండా, నోటీసులు ఇవ్వకుండా నా భర్తను అరెస్టు చేశారు" అని ఆ పిటిషన్‌లో తెలిపారు. శుక్రవారం కోర్టు ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. నిఖిల్ తరఫున సీనియర్ న్యాయవాది సందేశ్‌చౌట వాదనలు వినిపించారు. నిఖిల్‌ను శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు అరెస్టు చేశారన్నారు. అయనపై ఫిర్యాదు చేసిన పోలీసు అధికారే సస్పెండ్ అయ్యారని కోర్టుకు వివరించారు. అరెస్టు చట్టపరంగా లేదని వాదించారు. సుదీర్ఘ వాదనల అనంతరం కేసును న్యాయమూర్తి ఈ నెల 9వ తేదీకి వాయిదా వేశారు. కాగా, తొక్కిసలాట ఘటనపై కబ్బన్‌పార్క్ పోలీసులు మరో కేసు నమోదు చేశారు.

కొనసాగుతున్న వేట్లు..

తొక్కిసలాట ఘటనకు బాధ్యులుగా భావించిన మరికొందరిని సిద్దరామయ్య ప్రభుత్వం శుక్రవారం సస్పెండ్ చేసింది. ఈ ఘటనపై సకాలంలో స్పందించలేదంటూ ఇంటెలిజెన్స్ ఏడీజీపీ హేమంత్ నింబాల్కర్‌ను బదిలీ చేసింది. బెంగళూరు సీపీ, ఏసీపీ, డీసీపీలను ఇప్పటికే సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో సీఎం రాజకీయ కార్యదర్శి కె.గోవిందరాజు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నారు. ప్రొటోకాల్ పాటించలేదని, ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయనను సీఎం రాజకీయ కార్యదర్శి హోదా నుంచి తొలగించారు.

తప్పు ఆర్సీబీ, సర్కారులదే : కేఎస్‌సీఏ

తొక్కిసలాట కేసులో కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్‌కు (కేఎస్‌సీఏ) హైకోర్టులో ఊరట లభించింది. అసోసియేషన్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అయితే.. కేసును రద్దు చేయడానికి మాత్రం నిరాకరించింది. ఈ కేసులో పోలీసులు అరెస్టులకు సిద్ధం కాగా, కేఎస్‌సీఏ అధ్యక్షుడు రఘురాం భట్, కార్యదర్శి ఎ.శంకర్, కోశాధికారి ఈఎస్ జయరాం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వారి తరఫున శుక్రవారం హైకోర్టులో న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. స్టేడియం వద్ద చేరిన ప్రజలను నియంత్రించాల్సిన బాధ్యత ఆర్సీబీ, పోలీసులదేనని తెలిపారు. విధానసౌధ వద్ద సన్మాన కార్యక్రమానికి సీఎం, డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారని తెలిపారు. కాగా, తొక్కిసలాట ఘటనపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. శాంతిభద్రతల విషయంలో కనీస జాగ్రత్తలు అవసరం లేదా..? అని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీంతో గురువారం కేబినెట్ భేటీకి ముందే సిద్దరామయ్య తన ఆప్తులైన మంత్రులు జమీర్ అహ్మద్, శివానందపాటిల్, భైరతి సురేశ్‌లతో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. సన్మాన ఏర్పాట్లు, ఇతర హడావుడికి డిప్యూటీ సీఎం శివకుమార్‌దే బాధ్యత అని ఆమంత్రులు తప్పుబట్టినట్లు తెలుస్తోంది.

అంతర్జాతీయ యోగా డేకు పక్కాగా ఏర్పాట్లు

» త్వరితగతిన టెండర్లు ఆహ్వానించడానికి ఆరోగ్యశాఖ జీవో

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈ నెల 21 నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం.. అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా లక్షకుపైగా ప్రదేశాల్లో 2 కోట్ల మంది అంతర్జాతీయ యోగాడేలో పాల్గొనేలా అవగాహన కల్పించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, కనీసం 25 లక్షల మంది 3 రోజులపాటు శిక్షణ పొంది యోగా సర్టిఫికెట్లు పొందేలా ప్రోత్సహించాలని, వీరందరికీ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలోని శిక్షకులతో శిక్షణ ఇప్పించాలని సూచించింది. జూన్ 21న విశాఖలో జరిగే కార్యక్రమం ప్రపంచ రికార్డు సాధించేలా 5 లక్షల మంది పాల్గొనేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ ఏర్పాట్లన్నింటికీ అవసరమైన టెండర్లను త్వరితగతిన ఆహ్వానించి, ఆమోదించేందుకు ఏపీఎంఎస్ఐడీసీ, డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీలు, ఇతర శాఖలకు అనుమతి ఇస్తూ శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ జీవో జారీ చేసింది.

యోగాంధ్రకు 1.86కోట్ల మంది నమోదు

యోగాంధ్రకు రెండు కోట్ల మంది హాజరయ్యేవారి లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 1.86కోట్ల మంది నమోదు చేసుకున్నారని వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై నివేదికను శుక్రవారం మంత్రుల బృందానికి అందజేశారు. ఇంకా రెండు వారాలు ఉన్నందున 2కోట్ల లక్ష్యాన్ని దాటవచ్చన్నారు. మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చే ట్రైనర్ల నమోదులో 2,600 లక్ష్యం పెట్టుకోగా లక్ష్యాన్ని మించి 5,451 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. మండల స్థాయిలో 1.25లక్షల ట్రైనర్ల లక్ష్యం కాగా 1.47లక్షల మంది నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఇప్పటివరకూ 78,730 ప్రదేశాలను ఎంపిక చేశామని తెలిపారు.

అందుబాటులో చౌక విద్యుత్తు!

» ఉత్పత్తి, ప్రవాహ, కొనుగోలు వ్యయాలు భారీగా తగ్గించాలి
» నీతి ఆయోగ్ సీఈవో, సీఎస్ పర్యవేక్షణలో స్టీరింగ్ కమిటీలు
» ఇంధన రంగం స్థితిగతులపై ఎప్పటికప్పుడు అధ్యయనం
» విద్యుత్తు ప్రవాహ చార్జీల తగ్గింపుపై ఐఎస్ఈజీఎఫ్‌తో ఒప్పందం



అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యుదుత్పత్తి, ప్రవాహ, కొనుగోలు వ్యయాలను భారీగా తగ్గించడం ద్వారా వినియోగదారులకు కరెంటును చౌకగా అందించడమే లక్ష్యంగా విద్యుత్తు రంగం పురోభివృద్ధి సాధించాలని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశం తీర్మానించింది. విద్యుత్తు ప్రవాహ చార్జీల తగ్గింపుపై ఐఎస్ఈజీ ఫౌండేషన్‌తో రాష్ట్ర ఇంధన శాఖ శుక్రవారం ఒప్పందం చేసుకుంది. సీఎం చంద్రబాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తదితరుల సమక్షంలో ఈ ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలో విద్యుదుత్పత్తిని పెంచడంతో సహా ప్రవాహ వ్యయం భారీగా తగ్గే దిశగా చర్యలు తీసుకుంటూ అంతిమంగా వినియోగదారునికి చౌకగా కరెంటును అందించాలని నీతి ఆయోగ్ అభిప్రాయం వ్యక్తం చేసింది. జాతీయ స్థాయిలో నీతి ఆయోగ్ సీఈవో ఛైర్మన్‌గా, రాష్ట్రస్థాయిలో సీఎస్ పర్యవేక్షణలో స్టీరింగ్ కమిటీలను నియమిస్తూ సమావేశం తీర్మానించింది. నీతిఆయోగ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర ఇంధన శాఖ కార్యదర్శి, కేంద్ర పునరుద్పాదక ఇంధన వనరుల శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. రాష్ట్రస్థాయి కమిటీలో ఇంధన, రవాణా, రోడ్లు, భవనాలు, జల వనరుల శాఖ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, ఐటీ, పట్టణ, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. ఇంధన రంగం స్థితిగతులపై ఈ కమిటీలు ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తాయి. జాతీయ స్థాయిలో 3నెలలకు ఒకసారి, రాష్ట్రస్థాయిలో నెలవారీ సమీక్షలు నిర్వహిస్తాయి. తాజా ఒప్పందం మేరకు ఇంధన రంగంలో కీలకాంశాలపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తూ సంస్థాగతమైన పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు మేరకు ఐఎస్ఎఫ్‌జీ ఫౌండేషన్ సలహాలు, సూచనలు ఇస్తుంది. దీనివల్ల చౌకయిన, నాణ్యమైన విద్యుదుత్పత్తిని సాధించడం సాధ్యపడనుంది. అత్యాధునిక సాంకేతిక విధానాలను అవలంబించేందుకూ వీలు కలుగుతుంది. కాగా, రాష్ట్రంలో 21.3 గిగావాట్ల సౌర, 12.3 గిగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్లను రూ.5.78 లక్షల కోట్లతో స్థాపించేందుకు వివిధ సంస్థలతో ఇంధన శాఖ ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో ప్రధానంగా ఏపీఎన్‌జీఈఎల్, హరిత్ అమృత్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీ గ్రీన్‌ఎనర్జీ లిమిటెడ్- ఏపీ ఎన్ఆర్ఈడీసీఏపీ) సంయుక్తంగా 25 గిగావాట్ల హైబ్రిడ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంటును రూ.1,65,000 కోట్లతో, ఎన్‌హెచ్‌పీసీ రూ.1,00,000 కోట్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్ బయోగ్యాస్ ప్లాంట్ల కోసం రూ.65,000 కోట్లు, రెన్యూ హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్లాంటు కోసం రూ.22,000 కోట్లు, టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ 7 గిగావాట్ల హైబ్రిడ్ పవర్ ఉత్పత్తి కోసం రూ.49,000 కోట్లు, ఓఎన్‌జీసీ త్రిపుర పవర్ కంపెనీ 2.7 గిగావాట్ల పంప్డ్ స్టోరేజీ, 1.5 గిగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు రూ.21000 కోట్లు, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ అండ్ రాక్‌మేన్ ఇండస్ట్రీస్ ఏటా 25 టన్నుల హైడ్రోజన్ ప్లాంట్‌ను రూ.1.000 కోట్లతో స్థాపించేందుకు ఒప్పందాలు చేసుకోవడం నీతి ఆయోగ్ సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి.

పట్టణాల్లో కోళ్ల ఫాం నిర్మాణాలకు ప్రోత్సాహం

» డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ చార్జీలు మినహాయింపు

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో కోళ్ల ఫాం రైతులకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఫీజుల్లో రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పట్టణాల్లో నిర్మించే కోళ్ల ఫాంలకు స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన డెవలప్‌మెంట్ ఫీజులు, బెటర్‌మెంట్ చార్జీల్లో పూర్తి మినహాయింపు ఇస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా లైసెన్స్ ఫీజులను గ్రామీణ ప్రాంతాల తరహాల్లో నిర్ణయిస్తూ ఆదేశాలిచ్చింది. ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్ విజ్ఞప్తితో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ ప్రతిపాదనలతో మున్సిపల్ శాఖ ఈమేరకు నిర్ణయం తీసుకుంది.

అపార్ట్‌మెంట్ల ఫీజులు విడతల వారీగా వసూలు

» పట్టణాల్లో భవన యజమానులకు ఊరట

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బహుళ అంతస్తుల భవనాలు, నగర స్థాయి మౌలిక వసతుల ఇంపాక్ట్ ఫీజు, లేబర్‌సెస్‌ను మున్సిపల్ శాఖ విడతలవారీగా వసూలు చేస్తున్న తరుణంలో... డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ చార్జీలను కూడా ఇదే తరహాలో వసూలు చేయాలని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ నిర్ణయం తీసుకుంది. బెటర్‌మెంట్, డెవలప్‌మెంట్ చార్జీలు రూ.15 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ఉంటే నాలుగు సమాన వాయిదాల్లో, చార్జీలు రూ.75 లక్షలకు పైబడి ఉంటే 8 వాయిదాల్లో రెండేళ్లలోపు చెల్లించే వెసులుబాటు కల్పించింది. 12 శాతం వడ్డీతో మొత్తం చార్జీలను లెక్కించి దానిని సమాన వాయిదాల్లో విభజిస్తారు. దీంతో బహుళ అంతస్థుల యజమానులకు ఊరట కలగనుంది.

చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

హైదరాబాద్ సిటీ, గోషామహల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ మైదానంలో జరిగే చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. చేప ప్రసాదం కోసం వచ్చే వారి కోసం గ్రేటర్ ఆర్టీసీ 140 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. రైల్వేస్టేషన్లు, ముఖ్యమైన బస్టాండ్లతో పాటు ఎయిర్‌పోర్టు నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు చేప ప్రసాదం స్పెషల్ ఆపరేషన్స్ పేరుతో బస్సులు ఏర్పాటు చేశారు.

పీఎస్ఆర్, మధులకు బెయిల్‌పై 9న నిర్ణయం

పిటిషన్లపై హైకోర్టులో ముగిసిన వాదనలు

» గ్రూప్-1 కేసులో దర్యాప్తు కొనసాగుతోంది
» బెయిలిస్తే సాక్షులను ప్రభావితం చేస్తారు
» ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ వాదనలు
» దర్యాప్తునకు సహకరిస్తారు.. బెయిలివ్వండి
» పిటిషనర్ల తరఫున న్యాయవాదుల విజ్ఞప్తి

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనంలో అక్రమాల కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు, మధుసూదన్ బెయిల్ పిటిషన్లపై శుక్రవారం హైకోర్టులో ఇరువైపుల వాదనలు ముగిశాయి. ఆ పిటిషన్లపై సోమవారం నిర్ణయం వెల్లడిస్తానని న్యాయస్థానం ప్రకటించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో పీఎస్ఆర్(ఏ1), మధుసూదన్(ఏ2) ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ట్రయల్ కోర్టు బెయిల్ పిటిషన్లు కొట్టివేయడంతో వీరిద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా పీఎస్ఆర్ తరఫున న్యాయవాది నగేష్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే గ్రూప్-1 జవాబు పత్రాల మాన్యువల్ మూల్యాంకనం చేపట్టారన్నారు. క్యామ్‌సైన్‌కు చెల్లింపులన్నీ పారదర్శకంగా జరిగాయన్నారు. పిటిషనర్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, ఎలాంటి షరతులు విధించినా కట్టుబడి ఉంటారని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. క్యామ్‌సైన్ మధుసూదన్ తరఫున న్యాయవాది ఉమేశ్ చంద్ర వాదనలు వినిపిస్తూ.. ఏపీపీఎస్సీ అప్పగించిన బాధ్యతను కాంట్రాక్టర్ హోదాలో పిటిషనర్ నిర్వర్తించారు తప్ప నిధుల దుర్వినియోగంతో సంబంధం లేదన్నారు. పోలీసులు నమోదు చేసిన ఐపీసీ సెక్షన్ 409 పిటిషనర్‌కు వర్తించదన్నారు. దర్యాప్తునకు సహకరిస్తారని, పిటిషనర్ అనారోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పీపీ సాయి రోహిత్ వాదనలు వినిపిస్తూ.. పోలీసుల దర్యాప్తునకు పీఎస్ఆర్ సహకరించడం లేదని, దర్యాప్తు అధికారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం లేదని, అధికారులపైనే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. మూల్యాంకనం విషయంలో పిటిషనర్లు ఇరువురు కుట్రపూరితంగా వ్యవహరించారని చెప్పారు. దర్యాప్తు కొనసాగుతోందని, బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని పేర్కొన్నారు. బెయిల్ పిటిషన్లను కొట్టివేయాలని కోరారు.

మద్యం కేసులో పిటిషన్లపై విచారణ 10కి వాయిదా

విజయవాడ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను సీబీఐ కోర్టు 10వ తేదీకి వాయిదా వేసింది. ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై వాదనలకు, బాలాజీ గోవిందప్ప, కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, చాణక్య దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై సిట్‌కు నోటీసులు జారీ చేయడానికి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. జైల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని చాణక్య శుక్రవారం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను కూడా 10కి వాయిదా వేస్తూ న్యాయాధికారి సీతారామకృష్ణారావు ఉత్తర్వులు ఇచ్చారు.

తెలియదు.. సంబంధం లేదు..

మా లాయర్‌ను అడగండి!

» కాకాణి డొంక తిరుగుడు జవాబులు
» తొలిరోజు 2గంటలకు పైగా విచారణ
» మరో 2 రోజులు కస్టడీలోనే మాజీ మంత్రి


సెంట్రల్ జైలు నుంచి కాకాణిని స్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

నెల్లూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): 'నాకు తెలియదు... నాకు సంబంధం లేదు... మా లాయర్‌ను అడగండి..!' తొలిరోజు పోలీసుల విచారణలో మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పిన సమాధానాలు ఇవీ. పోలీసులు, రెవెన్యూ అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన ఈ జవాబులనే మార్చి మార్చి చెప్పినట్లు తెలిసింది. పొదలకూరు మండలం రుస్తుం మైన్స్‌లో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో కాకాణిని జిల్లా కేంద్ర కారాగారం నుంచి వెంకటాచలం మార్గంలో కృష్ణపట్నం పోర్టు స్టేషన్‌కు శుక్రవారం మధ్యాహ్నం తీసుకొచ్చారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 2గంటలకు పైగా సాగిన ఈ విచారణలో పలు అంశాలపై ఆయన్ను ప్రశ్నించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారా, అక్రమంగా క్వార్ట్జ్‌ని తరలించి అమ్ముకున్నారా వంటి ఏ ఒక్క ప్రశ్నకు కూడా కాకాణి సూటిగా సమాధానం ఇవ్వలేదని తెలిసింది. 'నాకు సంబంధం లేదు. నాకేమీ తెలియదు' అంటూ క్లుప్తంగా జవాబిచ్చినట్లు సమాచారం. 'మీరే సూత్రధారి అని మీ అనుచరులే చెబుతున్నార'ని అడిగినా తనకు సంబంధమే లేదని, వారినే అడగండంటూ కాకాణి బదులిచ్చారు. సాయంత్రం 5 గంటలకు పూర్తయిన విచారణ శనివారం ఉదయం మళ్లీ కొనసానుంది. కాగా, కాకాణిని మూడు రోజులపాటు కృష్ణపట్నం పోర్టు స్టేషన్‌లోనే ఉంచనున్నారు.

ఆర్థిక శక్తిగా విశాఖ!

(మొదటి పేజీ తరువాయి)

తీర్చిదిద్దాలని సూచించారు. రాబోయే ఏడేళ్లలో విశాఖను మరో ముంబై స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన నీతి ఆయోగ్ అధికారులతో సమావేశమయ్యారు. నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఐఎస్ఈజీ ఫౌండేషన్ ప్రతినిధులు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర విజన్ సాకారానికి సహకరించాలని నీతి ఆయోగ్‌ను చంద్రబాబు కోరారు. విశాఖ ఆర్థిక రీజియన్‌లో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం కలిపి.. మొత్తం 8 జిల్లాలుంటాయని చెప్పారు. ఈ ప్రాంతంలో వివిధ రకాల ప్రాజెక్టుల కోసం లక్ష ఎకరాలు గుర్తించాలని అధికారులను ఆదేశించారు. 'ఈ ఎకనమిక్ రీజియన్ విస్తీర్ణం 36,000 చదరపు కిలోమీటర్లు. జనాభా 1.55 కోట్లు. ఈ ప్రాంత ప్రస్తుత జీడీపీ 49 బిలియన్ డాలర్లు. 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మలచాలి. ఏడేళ్లలో 24 లక్షల ఉద్యోగాలు సృష్టించే సామర్థ్యం ఈ రీజియన్‌కి ఉంది. రాష్ట్ర భవిష్యత్ ప్రగతికి చాలా కీలకం' అని వివరించారు ఈ రీజియన్‌లో 6 పోర్టులు, 7 ఉత్పాదక కేంద్రాలు, 17 ప్రధాన వ్యవసాయ జోన్లు, 6 సేవా హబ్స్, 12 టూరిజం హబ్స్ నిర్మాణాన్ని సీఎం ప్రతిపాదించారు. పోర్టులు, ఐటీ, వ్యవసాయం, పర్యాటకం, హెల్త్ కేర్, పట్టణాభివృద్ధి, ఇన్‌ఫ్రా విభాగాల్లో ప్రణాళికల గురించి నీతి ఆయోగ్ అధికారులకు వివరించారు. ఏడేళ్లలో ఈ ప్రణాళికలన్నీ కార్యరూపం దాలిస్తే.. విశాఖ రీజియన్‌లో 7.5 లక్షల ఇళ్లు, 10,000 హోటల్ గదులు, 20 ఇన్నొవేషన్ కేంద్రాలు, 10 కళాశాలలు, 7,000 ఆస్పత్రి పడకలు, 20,000 హెక్టార్లలో పారిశ్రామికాభివృద్ధి, 80 మిలియన్ చదరపు అడుగుల కార్యాలయ స్థలం, 60 మిలియన్ చదరపు అడుగుల గిడ్డంగులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పరిశ్రమగా పర్యాటకం..పర్యాటక రంగాన్ని పరిశ్రమగా పరిగణిస్తామని, తమ కొత్త విధానాలు పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటాయని సీఎం వెల్లడించారు. మూలపేట-విశాఖపట్నం, విశాఖపట్నం-కాకినాడ మధ్య బీచ్ రోడ్డులు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ రోడ్లను జాతీయ రహదారులకు అనుసంధానిస్తామని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని యువతకు నిరంతరం నైపుణ్య శిక్షణ ఇస్తామని తెలిపారు. 20 లక్షల మందికి వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

ఉక్కు హబ్‌గా విశాఖ..

దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న 3 అతిపెద్ద ఉక్కు కంపెనీలతో కలిసి విశాఖను ఉక్కు హబ్‌గా అభివృద్ధి చేయడంపై సమీక్షలో చర్చించారు. పెట్రో కెమికల్స్, గ్యాస్ గ్రిడ్, పోర్టుల అభివృద్ధి, పెట్రోకెమికల్-మెడికల్ టెక్, షిప్ బిల్డింగ్, రక్షణ, ఎలక్ట్రానిక్స్, క్లీన్ టెక్ రంగాలపై దృష్టి సారించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఐటీ రంగంలో 4-5 లక్షల ఉద్యోగాలు సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నామని.. డేటా సెంటర్లు, స్టార్టప్‌లు, ఇన్నొవేషన్ కేంద్రాల ఏర్పాటుతో ఈ ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ఆకాంక్షించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 4 రైల్వే ప్రాజెక్టులతో పాటు 2032 నాటికి కొత్తగా మరో 7 రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. ఉత్పాదక కేంద్రాలు, పోర్టులను అనుసంధానిస్తూ కొత్తగా 9 కొత్త రోడ్డు ప్రాజెక్టులను ప్రారంభించే ఆలోచనలో ఉంది. 2028-30లోగా 77 కిలోమీటర్ల పరిధితో విశాఖ మెట్రో ప్రాజెక్టు పూర్తిచేయడంపై సమావేశంలో చర్చించారు.

క్లీన్ ఎనర్జీలో రూ.5.78 లక్షల కోట్ల పెట్టుబడులు

విద్యుత్ సంస్కరణల్లో దేశానికే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలిచిందని సీఎం పేర్కొన్నారు. ఇప్పటికే క్లీన్ ఎనర్జీ రంగంలో రూ.5.78 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. విద్యుత్ రంగ అభివృద్ధి ప్రణాళికలపై రాష్ట్ర ప్రభుత్వానికి, నీతి ఆయోగ్, ఐఎస్ఈజీ ఫౌండేషన్ మధ్య సీఎం సమక్షంలో ఈ సందర్భంగా అవగాహన ఒప్పందం కుదిరింది.

పంటకాలం ముందుకు!

- తుఫాన్ల ముప్పు తప్పించాలి: సీఎం
- కృష్ణా-గోదావరి డెల్టాకు తక్షణం నీళ్లివ్వండి
- వెలిగొండ ఫేజ్-1 వచ్చే జూన్‌కల్లా పూర్తికావాలి
- జల వనరుల శాఖపై సమీక్షలో చంద్రబాబు



జల వనరులశాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గోదావరి డెల్టాకు తక్షణం నీళ్లివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పంటలు తుఫాన్ల బారిన పడకుండా పంటకాలాన్ని ముందుకు జరపాలన్నారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో జల వనరుల శాఖపై సమీక్ష జరిపారు. కృష్ణా, గోదావరి డెల్టాల పరిధిలో వెంటనే సాగు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాన్లు, ప్రకృతి విపత్తులు వచ్చేలోగా పంటలు చేతికి వచ్చేలా పంటకాలాన్ని నిర్దేశించుకోవాలని స్పష్టంచేశారు. భూగర్భ జలాల పెంపు, రిజర్వాయర్లు నింపడం, సమర్థ నీటి యాజమాన్య విధానం అమలు.. ఈ మూడు అంశాలపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో సంవత్సరమంతా భూమి పచ్చగా ఉండేలా మూడు పంటలు నిరంతరం పండించేలా చూడాలని చెప్పారు. ఒక్క ఏడాది సమృద్ధిగా వానలు కురిస్తే.. ఆ నీటితో మూడు, నాలుగేళ్లు కరువొచ్చినా తట్టుకునేలా నీటి యాజమాన్య విధానాలు చేపట్టాలని సూచించారు. పంటల విధానంలో మార్పుచేయాలని.. తడి, ఆరుతడి పంటల సాగుకు కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని ఆదేశించారు. జల సంరక్షణ కోసం వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు నిర్మించాలని సూచించారు. నిర్వహణ లోపాలు సరిచేసుకుంటూ రాష్ట్రంలో నీటి వనరులను సద్వియోగం చేసుకోవాలని.. ఇందుకోసం సమర్థంగా, శాస్త్రీయంగా నీటి ఆడిట్ నిర్వహించాలన్నారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు నిర్మాణానికి రూ.81,900 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశామని అధికారులు తెలిపారు. ఈ వ్యయంలో 50 శాతం అంటే.. రూ.40,950 కోట్లు విదేశీ సంస్థల నుంచి రుణంగా సేకరించాలని ఈ సమీక్షలో నిర్ణయించారు. అలాగే కేంద్రం వాటాగా 20 శాతం (రూ.16,380 కోట్లు) గ్రాంట్ రూపంలో, రాష్ట్రప్రభుత్వ ఈక్విటీ కింద పది శాతం (రూ.8,190 కోట్లు), ప్రైవేటు సంస్థల ద్వారా రూ.16,380 కోట్లు సమీకరించాలని నిశ్చయించారు. పోలవరం నిర్మాణ పనులు ఇప్పటిదాకా 81.70 శాతం మేర పూర్తయ్యాయని అధికారులు సీఎంకు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో కేవలం 3.84 శాతం పనులే జరిగాయని.. 2024లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక 11 నెలల కాలంలోనే 5.93 శాతం పనులు జరిగాయని చెప్పారు. డయాఫ్రం వాల్ 64 శాతం, బట్రెస్ డ్యామ్ 91 శాతం, ఇసుకను గట్టిపరచే వైబ్రో కంప్రాక్షన్ పనులు 54 శాతం పూర్తయ్యాయని వివరించారు. సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, సీఎంవో కార్యదర్శి రాజమౌళి, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ఇంకా ఏం చెప్పారంటే..

ప్రాధాన్య క్రమంలో ప్రాజెక్టులు..

రాయలసీమ, ఉత్తరాంధ్ర సహా రాష్ట్రంలో నిర్మిస్తున్న ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయాలి. హంద్రీ-నీవా ప్రధాన కాలువ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి. వెలిగొండ ఫేజ్-1 పనులు 2026 జూన్‌కల్లా పూర్తికావాలి. శ్రీశైలం జలాశయం ప్లంజ్‌పూల్ మరమ్మతులకు తక్షణ చర్యలు చేపట్టాలి. బుడమేరు ప్రవాహానికి అడ్డంకులు లేకుండా పూడిక, ముళ్ల కంపలు తొలగించాలి. సీలేరు నీరు కృష్ణా డెల్టాకు తరలించి.. సాగుకు వినియోగించడంపై దృష్టి సారించాలి.

భూగర్భ జలాల వివరాలతో బులిటెన్లు..

నీటి లభ్యతను బట్టి సమర్థ వినియోగం జరగాలి. భూగర్భ జలాలు 20 మీటర్ల కంటే తక్కువగా ఉన్న మండలాలు, 8-29 మీటర్ల మధ్య ఉన్న మండలాల వివరాలను బులిటెన్ల రూపంలో ప్రతిరోజూ అందించాలి. ఈ వివరాలు జిల్లాలు, సెంట్రల్, లోకల్ వారీగా ఉండాలి. భూగర్భ జలాల వివరాలు తెలుసుకునేందుకు ఉపయోగించే పీజియో మీటర్లను, ఏడబ్ల్యుఎస్ సెన్సార్లు రాష్ట్రంలో కొన్ని చోట్ల వినియోగించకపోవడమేంటి? తక్షణం నూతన పరికరాలు కొనుగోలు చేసి అవసరమైన చోట్ల బిగించాలి. ఇందుకు రూ.30 కోట్లు కేటాయిస్తున్నాం.

బనకచర్ల పథకానికి టెండర్లు..: పోలవరం-బనకచర్ల అనుసంధానానికి సంబంధించి అటవీ, పర్యావరణ అనుమతులు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను అనుకున్న సమయానికి సిద్ధం చేయాలి. డీపీఆర్‌ను కేంద్రంతో ఆమోదింపజేయడంపై దృష్టి సారించాలి. భూసేకరణకు సిద్ధంగా ఉండాలి. టెండర్లు పిలిచేందుకు రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీతో ముసాయిదా విధాన పత్రం రూపొందింపజేయాలి. సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో టెండర్లు పిలవాలి. ఈ ప్రక్రియ ఈ నెలాఖరుకల్లా పూర్తికావాలి. జల హారతి కార్పొరేషన్ కింద బనకచర్ల నిర్మాణం చేపడతాం. హైబ్రిడ్ యాన్యుటీ విధానం(హామ్)లో ప్రాజెక్టు చేపట్టాలి. పోలవరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్‌ను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలి. అనుకున్న సమయానికి లక్ష్యాలు సాధించేలా కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలి.

ఎండలు తాత్కాలికమే!

- ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు: ఐఎండీ

ప్రస్తుతం నైరుతి రుతు పవనాలు మందగించినా.. క్రమంగా పుంజుకుని భారీ వర్షాలు కురుస్తాయని.. 105 శాతం మేర వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. భారీ వర్షాలు.. వరదలతో రిజర్వాయర్లు నిండుతాయని, భూగర్భ జలాలు పెరుగుతాయన్న ఐఎండీ అంచనాలతో భవిష్యత్ కార్యాచరణకు రాష్ట్ర జల వనరుల శాఖ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. రిజర్వాయర్లలోకి నీటిని తరలించడం, చెరువులను నింపడం వంటి పనులను చేపట్టేందుకు సన్నద్ధమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో శుక్రవారం జల వనరుల శాఖపై నిర్వహించిన సమీక్షలో రాష్ట్రంలో వర్షపాతం, వరదలు, రిజర్వాయర్లలోకి చేరనున్న వరద వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సమీక్షలో వాతావరణ శాఖ ఇచ్చిన నివేదికలపై చర్చించారు. నైరుతి రుతు పవనాల ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని, ఎగువ నుంచి వచ్చిన వరదలో 516.91 టీఎంసీలు అందుబాటులో ఉంటాయని వాతావరణ శాఖ ఇచ్చిన సమాచారంపై ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేసింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 200టీఎంసీల నీరు అధికంగా లభిస్తుందని వాతారణ శాఖ చెప్పడంతో జలవనరుల శాఖ అందుకు తగిన కార్యాచరణకు సిద్ధమైంది. ఈ ఏడాది 105శాతం వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ విశ్లేషించింది. మహారాష్ట్రదక్షిణాది రాష్ట్రాల్లో రుతుపవనాలప్రభావం కనిపిస్తోందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల మూడో వారం నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. భారీ వర్షాలతో నదుల్లో డిసెంబరు నాటికి భారీగా నీటి నిల్వలు ఉంటాయని అంచనా వేసింది. సాగునీటి ప్రాజెక్టుల్లోకి నీటిని తరలిస్తూనే చెరువులను నింపడం ద్వారా భూగర్భ జలాల మట్టాలను పెంచాలని జలవనరుల శాఖ నిర్ణయించింది.

ముద్రగడకు క్యాన్సర్!

- ఆయనతో మాట్లాడనివ్వడం లేదు
- ఎక్స్‌లో పద్మనాభం కుమార్తె క్రాంతి ఆవేదన



కిర్లంపూడి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తన తండ్రి ముద్రగడ పద్మనాభం ప్రొస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారని రాజమహేంద్రవరంలో నివాసముంటున్న ఆయన కూతురు క్రాంతి శుక్రవారం ఎక్స్ ద్వారా వెల్లడించారు. తాను తన తండ్రిని చూడడానికి కిర్లంపూడి వెళితే తన సోదరుడు గిరి, అతడి మామ అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి ఆరోగ్యంపై దగ్గరి బంధువులు, కుటుంబ సభ్యులకు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, తన తండ్రితో ఎవ్వరినీ మాట్లాడనివ్వడం లేదని పేర్కొన్నారు. ఇది మానవత్వం కాదని గిరిపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

కేటీఆర్‌కు సుప్రీం కోర్టు నోటీసులు



న్యూఢిల్లీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పేరుతో రూ.25 వేలకోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం తరలించిందంటూ కేటీఆర్ చేసిన ఆరోపణలు తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీశాయంటూ ఆత్రం సుగుణ ఫిర్యాదు చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది సెప్టెంబర్ 30న కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. తనపై తప్పుడు కేసును బనాయించారని కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించగా.. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 21న తుది తీర్పును వెలువరించింది. హైకోర్టు తీర్పును ఆత్రం సుగుణ మే 19న సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ శుక్రవారం జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీష్‌చంద్రశర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. సుగుణ పిటిషన్‌కు సమాధానం చెప్పాలంటూ ప్రతివాదులుగా ఉన్న కేటీఆర్, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 25కు వాయిదా వేసింది.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఫరూక్, అబ్దుల్ అజీజ్

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం మైనార్టీలకు మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇరువురూ విడివిడిగా ప్రకటనలు జారీ చేశారు. 'త్యాగానికి ప్రతీక బక్రీద్. అల్లాహ్ ఆదేశం ప్రకారం ఇబ్రహీం ప్రవక్త తన కుమారుడైన ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి తీసుకెళ్లే సంప్రదాయాన్ని స్మరిస్తూ ప్రపంచంలోని ముస్లింలందరూ బక్రీద్ పండుగను జరుపుకొంటారు. బక్రీద్ పర్వదినం శాంతి, త్యాగానికి ప్రతీక' అని ఫరూక్, అజీజ్ పేర్కొన్నారు.

బీజాపూర్‌లో మరో ఎన్‌కౌంటర్!

- మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్ మృతి.. ఏకే 47 స్వాధీనం
- ఆయన స్వస్థలం ఆదిలాబాద్
- అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్



భాస్కర్ మృతదేహం

చర్ల/ మంచిర్యాల/ఆసిఫాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. శుక్రవారం బీజాపూర్ జిల్లా నేషనల్ పార్కు అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో తెలంగాణ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ మృతి చెందాడు. గురువారం ఇదే అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ మృతి చెందిన విషయం తెలిసిందే. తప్పించుకున్న మావోయిస్టుల కోసం డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ బలగాలు రెండు రోజులుగా కూంబింగ్ చేస్తున్నాయి. మావోయిస్టులు, బలగాల మధ్య అడపా దడపా ఎన్‌కౌంటర్లు జరిగాయని బీజాపూర్ పోలీసులు తెలిపారు. అలా జరిగిన ఎదురుకాల్పుల్లో భాస్కర్ మరణించాడని, అతని వద్ద నుంచి ఏకే47 తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అతను కొమురంభీం, మంచిర్యాల ఏరియా కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఘటనా స్థలం నుంచి భారీ సంఖ్యలో పేలుడు వస్తువులు, విప్లవ పుస్తకాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. నేషనల్ పార్కు అడవుల్లో భారీ సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారని, కూంబింగ్ జరుగుతోందని పోలీసులు చెబుతున్నారు. కాగా ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చర్లకు చెందిన అడెల్లు అలియాస్ భాస్కర్ 1995లో సాయుధ పోరాటం వైపు అడుగులు వేశాడు. జిల్లాలోని రామకృష్ణాపూర్‌లో ఆర్ఎంపీ వైద్యుడిగా ఉన్నప్పుడే మావోయిస్టు పార్టీతో సంబంధాలు ఏర్పరుచుకున్నాడు. ఉత్తర తెలంగాణలోని పలుప్రాంతాల్లో పీపుల్స్ వార్ పార్టీలో పని చేశాడు. అనంతరం మావోయిస్టు పార్టీ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నాడు. గతంలో అనేక సార్లు జరిగిన ఎన్‌కౌంటర్లలో తప్పించుకున్నాడు. భాస్కర్‌పై 30కి పైగా కేసులు ఉన్నాయి. అతనిపై రూ.25 లక్షల రివార్డు ఉంది.

ఇద్దరినీ పట్టుకొని చంపారా?: సుధాకర్, భాస్కర్‌లు వరస ఎన్‌కౌంటర్లలో మరణించడం గమనార్హం. ఈ ఎన్‌కౌంటర్లలో ఇతర మావోయిస్టులు ఎవరూ మరణించకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరిద్దరూ పార్టీలో కీలక నాయకులే. వీరికి భారీ సంఖ్యలో రక్షణ వలయం ఉంటుంది. అలాంటిది కేవలం ఈ ఇద్దరు నేతలే చనిపోవడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారిద్దరినీ పట్టుకొని హత్య చేశారని ఆరోపిస్తున్నారు.

మృతదేహం ఇస్తే దహన సంస్కారాలు చేస్తాం

మీడియాలో వచ్చిన అడెల్లు ఫొటోలను చూసి మా తమ్ముడేనని నిర్ధారించుకున్నాం. మృతదేహాన్ని ఇక్కడికి తీసుకొచ్చేందుకు మా దగ్గర డబ్బుల్లేవు. ప్రభుత్వం మృతదేహాన్ని పంపిస్తే అంత్యక్రియలు చేసి, రుణం తీర్చుకుంటాం. - సీతారాం, అడెల్లు సోదరుడు

ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో శుక్రవారం ఏడుగురు మావోయిస్టులు లొంగిపోయారు. ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై వీరు లొంగిపోయినట్లు దంతెవాడ ఏఎస్పీ స్మితిక్ రాజనాల తెలిపారు. మావోయిస్టులు అందరూ లొంగిపోవాలని సూచించారు.

అది బూటకపు ఎన్‌కౌంటర్

- సుధాకర్‌ని పట్టుకొని చంపారు.. రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ఆరోపణ
- పోస్టుమార్టం నిర్వహించాలి.. ఛత్తీస్‌గఢ్ హైకోర్టుకు ఐఏపీఎల్ లేఖ

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ(మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్‌ను బూటకపు ఎన్‌కౌంటర్లో చంపేశారని రాజకీయ ఖైదీల విడుదల కమిటీ నేత బల్లా రవీంద్రనాథ్ ఆరోపించారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన చేశారు. 'దండకారణ్యంలో కూంబింగ్ ఆపరేషన్ చేస్తోన్న పోలీసులు, సుదాకర్ సహా పలువురు నేతలను ముందుగానే అదుపులోకి తీసుకొన్నారు. ఒక్కొక్కరినీ ఎన్‌కౌంటర్ పేరిట కాల్చిచంపుతున్నారు. వయస్సులో పెద్దవాడైన సుధాకర్ ఒక్కరే ఎన్‌కౌంటర్‌లో మరణించారని ప్రకటించడం, ఆ తర్వాత అదే స్పాట్‌లో తెలంగాణ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్‌ను కాల్చిచంపడం అనేక ప్రత్యక్ష అనుమానాలకు తావిచ్చేలా ఉన్నాయి. కేంద్రం బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపేయాలి. మావోయిస్టు నేతల మృతదేహాలను వారి బంధువులకు అప్పగించాలి. మావోయిస్టులు కోరుతున్నట్లుగా ప్రజల కోసం కేంద్రం శాంతి చర్చలు జరపాలి' అని రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. కాగా, సుధాకర్ మృతదేహాన్ని భద్రపరిచేలా ఆదేశించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ లాయర్స్(ఐఏపీఎల్) సభ్యుడు పిచ్చుక శ్రీనివాస్ ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. సుధాకర్ పోస్టుమార్టంను కుటుంబీకుల సమక్షంలో నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు.

న్యాయ విచారణ జరిపించాలి: పౌరహక్కుల సంఘం

సుధాకర్ ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలని ఏపీసీఎల్‌సీ అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ ఓ ప్రకటనలో కోరారు. సుధాకర్‌ను పట్టుకొని కాల్చిచంపారని వారు ఆరోపించారు. లొంగిపోండి లేదా చావండి అనే విధానంతో ముందుకు సాగుతున్న కేంద్రం వృద్ధ నేతలను వెంటాడి మరీ హత్య చేస్తోందని వారు ఆరోపించారు. రేణుక, నంబాల కేశవరావుల మాదిరే, ఇప్పుడు సుధాకర్‌ను కూడా కోర్టులో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నా పోలీసులు హత్యచేశారని ఆరోపించారు.

సుధాకర్ మృతితో సత్యవోలులో విషాదం

- మృతదేహాన్ని రప్పించేందుకు కుటుంబ సభ్యుల ప్రయత్నాలు



ఆనందరావు, సత్యవతి

పెదపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు సుధాకర్ (65) మరణవార్త విన్న ఏలూరు జిల్లా పెదపాడు మండలం సత్యవోలు గ్రామంలో విషాదం అలుముకుంది. మావోయిస్టు పార్టీలో వున్న సుధాకర్ గురించి పలుమార్లు టీవీల్లో, దిన పత్రికల ప్రధాన సంచికల్లో వచ్చే కథనాలను ఆసక్తిగా చదివే ఇక్కడి ప్రజలు... ఆ వ్యక్తి ఇక లేడనే నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయుర్వేద విద్యను అభ్యసించేందుకు విద్యార్థిగా ఇంటి నుంచి అడుగు బయట పెట్టిన తెంటు సింహాచలం అలియాస్ సుధాకర్ ఆ తరువాత మరలా వెనక్కి చూడలేదు.

రాజమండ్రి జైల్లో ఒకసారి కలిశాం...

విజయవాడలో చదువుకునే రోజుల్లో ఉద్యమం వైపు వెళ్లిన నాటి నుంచి నేటి వరకు కుటుంబంతో ఎటువంటి సంబంధాలు లేవని సుధాకర్ అన్న వదినలు తెంటు ఆనందరావు, సత్యవతి తెలిపారు. 1983లో రాజమండ్రి జైలులో సుధాకర్‌ను ఒకసారి కలసినట్లుగా చెప్పారు. ఈ జీవితాన్ని వదిలిపెట్టమని సుధాకర్‌ను ఆ సందర్భంలో కోరగా... 'నా మరణానంతరం నా జెండాను అందిస్తా, మీ కొడుకును పంపండి' అని అన్నాడని ఆనందరావు గుర్తు చేసుకున్నారు.

జమ్మూకశ్మీర్ అభివృద్ధిలో నూతన అధ్యాయం

- చీనాబ్, అంజి రైల్వే వంతెనలపై సీఎం హర్షం

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంలో జమ్మూకశ్మీర్ అభివృద్ధిలో నూతన అధ్యాయం మొదలైందని సీఎం చంద్రబాబు అన్నారు. శుక్రవారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల్లో నిర్మించిన రెండు అద్భుత ప్రాజెక్టులను జాతికి అంకితం చేసినందుకు ప్రధానికి అభినందనలు. ప్రపంచంలో ఎత్తైన రైలు ఆర్చి వంతెన చీనాబ్. దేశంలోనే తొలి కేబుల్ స్టెయిడ్ రైలు వంతెన అంజి. ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా ఉదంపూర్ - శ్రీనగర్ - బారాముల్లా నడుమ రైల్వే అనుసంధానం పెరిగి ఆధ్యాత్మిక పర్యాటకానికి ఊపు లభిస్తుంది. ఉద్యోగ అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ రైల్వే లైను అనుసంధానంతో వైష్ణోదేవి మాత ఆలయానికి శ్రీనగర్‌కు నడుమ వందేభారత్ రైళ్లు ఏడాది పొడవునా తిరిగే అవకాశం ఏర్పడింది' అని చంద్రబాబు పేర్కొన్నారు. మరో సందేశంలో... 'విశాఖ సౌత్ కోస్ట్ రైల్వే జోన్ జీఎంగా సందీప్ మాథుర్‌ని నియమించడం ద్వారా విశాఖ జోన్ కలను మరింత ముందుకు తీసుకెళ్లిన రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర రైల్వే మంత్రికి కృతజ్ఞతలు' అని సీఎం పేర్కొన్నారు.

ఆర్డీటీకి లోకేశ్ ఊతం!

- సేవల కొనసాగింపుపై కేంద్రంతో సంప్రదింపులు

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాయలసీమతోపాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో గ్రామీణులకు సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ) సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు మంత్రి లోకేశ్ కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఆర్డీటీ సంస్థకు విదేశాల నుంచి వచ్చే నిధుల వినియోగాన్ని ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్(ఎఫ్‌సీఆర్ఏ) కింద కేంద్రం నిలిపేయడంతో ఫారిన్ కాంట్రిబ్యూషన్ ఖాతాల్లో ఉన్న నిధులను సంస్థ వినియోగించడానికి వీలు లేకుండా పోయింది. దీంతో లోకల్ కాంట్రిబ్యూషన్ ఖాతాలో ఉన్న నిధులనే సేవా కార్యక్రమాలకు వాడాల్సి వస్తోంది. ఫలితంగా సంస్థ నిర్వహిస్తున్న విద్య, వైద్యం, స్వయం ఉపాధి కార్యక్రమాలు, పాఠశాలల నిర్వహణ నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది.

ఎన్టీఆర్ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటుదాం: టీడీ జనార్దన్

ఎన్టీఆర్ చరిత్ర, ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటడమే లక్ష్యంగా ప్రపంచవ్యాప్తంగా ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను, సినీ వజ్రోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ లిటరేచర్, గ్లోబల్ నెట్ వర్క్ చైర్మన్ టీడీ జనార్దన్ అన్నారు. ఎన్నారై తెలుగుదేశం పార్టీ, ఆక్లాండ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో న్యూజిలాండ్ రాజధాని ఆక్లాండ్‌లో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలు స్థానిక తెలుగు కుటుంబాల మధ్య కన్నుల పండుగగా జరిగాయి. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్, నందమూరి రామకృష్ణ, అశ్విన్ అట్లూరి పాల్గొన్నారు.

కడలిపాలయ్యే నీటినే వాడుకుంటాం

- తెలంగాణ నేతలు విజ్ఞులు... అర్థం చేసుకుంటారు
- రాజకీయ కారణాలతోనే బనకచర్లను వ్యతిరేకిస్తున్నారేమో: నిమ్మల



అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నేతలు విజ్ఞులని.. సముద్రంలో కలుస్తున్న నీటినే వాడుతున్నామని గ్రహిస్తారని తాను వ్యక్తిగతంగా భావిస్తున్నట్లు ఏపీ జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వాస్తవాలేంటో వారికీ తెలుసని.. అయితే ఎన్నికలు, ఓట్ల వంటి రాజకీయ కారణాలతోనే వారు పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును వ్యతిరేకిస్తుండొచ్చని శుక్రవారం సచివాలయంలో మీడియాతో అన్నారు. 'ఈరోజు ప్రధాని మోదీయే కాదు.. గతంలో వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పటి నుంచే నదుల అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారించారు. దేశవ్యాప్తంగా దుర్భిక్షాన్ని నివారించాలంటే నదుల అనుసంధానంతోనే సాధ్యమని వారు చెప్పారు. అదే ఆచరిస్తున్నారు. ఆ దిశగానే మోదీ కూడా పోలవరం-బనకచర్ల అనుసంధానానికి ప్రాధాన్యమిస్తున్నారు. సుప్రసిద్ధ ఇంజనీర్ కేఎల్ రావు కూడా నదుల అనుసంధానంలోనే దుర్భిక్షం నివారించవచ్చన్నారు. వందేళ్ల చరిత్రను చూస్తే ఏటా గోదావరి నుంచి 3,000 టీఎంసీల వరద సముద్రంలోకి వృధాగా పోతోంది. మేం కూడా గోదావరి జిల్లాలవాసులమే. వర్షాలు సమృద్ధిగా కురవకపోయినా ఇవాళ్టికీ 11,000 నుంచి 15,000 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి పోతోంది. ఏటా కడలిపాలవుతున్న 3,000 టీఎంసీల్లో 200 టీఎంసీలను మాత్రమే నదుల అనుసంధానానికి ఉపయోగించుకుంటాం. మా దిగువన ఎవరూ ఉపయోగించుకునేవారెవరూ లేరు. ఉప్పునీటిలో కలసి పోయే నీటిని సాగు, తాగుకు ఉపయోగించుకుంటాం. దయచేసి అర్థం చేసుకోవాలి' అని తెలంగాణ నేతలకు విజ్ఞప్తి చేశారు.

గోదావరి-బనకచర్లను అడ్డుకుంటాం: ఉత్తమ్



హైదరాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తలపెట్టిన గోదావరి- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును అడ్డుకుంటామని, నదీ జలాల్లో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటా కోసం ఎక్కడిదాకైనా వెళతామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా జలాల విషయంలో బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ అన్యాయం జరిగిందని ఆరోపించారు. కానీ, ఆ పార్టీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని చూసి జోసెఫ్ గోబెల్స్ కూడా సిగ్గుపడతారని ఎద్దేవా చేశారు. ఈ మేరకు సచివాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో చిట్‌చాట్ చేశారు. గోదావరి - బనకచర్ల అనుసంధానినికి వ్యతిరేకంగా కేంద్ర జలశక్తి, ఆర్థిక శాఖతోపాటు గోదావరి నది యాజమాన్య బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీలకు పలుమార్లు లేఖలు రాశామని చెప్పారు. గోదావరి - కృష్ణా బేసిన్‌లో కొత్తగా ఏ ప్రాజెక్టును చేపట్టాలన్నా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఆ ప్రాజెక్టు డీపీఆర్‌ను గోదావరి, కృష్ణా బోర్డులు పరిశీలించాలని, కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ), అపెక్స్ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి అని కేంద్రానికి లేఖల ద్వారా తెలియజేశామని తెలిపారు. 'తెలంగాణ విజ్ఞప్తిని పరిశీలిస్తున్నామని, బచావత్ ట్రైబ్యునల్ ప్రకారమే గోదావరి- బనకచర్ల అనుసంధానంపై వ్యవహరిస్తాం' అని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ బదులు కూడా ఇచ్చారని ఉత్తమ్ చెప్పారు. ఈ విషయంలో కేంద్రం ఏపీకి అనుకూలంగా.. చట్ట వ్యతిరేకంగా పని చేయదని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ నీటి హక్కులకు భంగం కలగకుండా గోదావరి-బనకచర్ల అంశంలో రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఉత్తమ్ కోరారు. ఇక, కృష్ణా జలాల అంశంలో బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రానికి ఎక్కువ అన్యాయం జరిగిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004-14 దాకా శ్రీశైలం నుంచి ఇతర బేసిన్లకు 727 టీఎంసీల కృష్ణా జలాలను ఏపీ తరలించిందని, అదే 2014-23 దాకా 1201 టీఎంసీలను తరలించిందని ఉత్తమ్ అన్నారు. ట్రైబ్యునల్ చరిత్రలోనే నీటి కేటాయింపుల విచారణకు హాజరైన ఏకైక నీటి పారుదల శాఖ మంత్రి తానేనని ఉత్తమ్ వెల్లడించారు. అసత్యాలు ప్రచారం చేయడంలో బీఆర్ఎస్ నేతలు ముందున్నారని, ఆ ప్రచారాన్ని చూస్తే జోసెఫ్ గోబెల్స్ కూడా సిగ్గుపడేవారని ఉత్తమ్ అన్నారు. జోసెఫ్ గోబెల్స్ రావుగా పేరు మార్చుకోవాలని పరోక్షంగా హరీశ్ రావుకు చురకలంటించారు.


విజయవాడలోని ఓ పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

మెగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

- మొదటి రోజు 21,892 మంది హాజరు
- ఉదయం 88.63%, మధ్యాహ్నం 86.7%

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 91 పరీక్షా కేంద్రాల్లో ఉదయం సెషన్‌లో టీజీటీ- గణితం, టీజీటీ- హిందీ, టీజీటీ-ఫిజిక్స్, టీజీటీ- తెలుగు పరీక్షలకు 16,102 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 14,281 మంది (88.69%) హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌లో 51 కేంద్రాల్లో టీజీటీ- గణితం పరీక్షకు 8,790 మందికి గాను 7,611 మంది (86.7%) హాజరయ్యారని పేర్కొన్నారు. ఉదయం కడపలో అత్యధికంగా 91.1%, మధ్యాహ్నం నెల్లూరులో అత్యధికంగా 92% మంది పరీక్షలు రాశారని వివరించారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు కన్వీనర్ తెలిపారు.

ఫ్రీహోల్డ్ భూముల్లో పేదలకు న్యాయం

- గంజాయి బ్యాచ్‌ను జగన్ పరామర్శించడం సిగ్గుచేటు: మంత్రి అనగాని



రేపల్లె, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫ్రీహోల్డ్ భూములపై పేదలకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బాపట్ల జిల్లా రేపల్లెలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22 ఏ భూములకు సంబంధించి కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించేలా రెవెన్యూ సంస్కరణలు తీసుకువచ్చామన్నారు. జగన్ పాలనలో రెవెన్యూ వ్యవస్థను భ్రష్టుపట్టించారన్నారు. తెనాలిలో గంజాయి బ్యాచ్‌ను పరామర్శించడానికి జగన్ రావడం సిగ్గుచేటన్నారు. వైసీపీ పాలనలో రేపల్లె ప్రాంతానికి చెందిన అమర్‌నాథ్ గౌడ్‌ను అమానుషంగా చంపితే కనీసం పట్టించుకోలేదన్నారు. ఇలాంటి నాయకులు నీతులు చెబితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు పథకాల అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. రోజురోజుకి జగన్‌రెడ్డి మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

ఇకపై ఏటా డీఎస్సీ

యూనివర్సిటీలకు ఏకీకృత చట్టం: లోకేశ్

అమరావతి/మంగళగిరి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షలను ఇకపై ఏటా నిర్వహిస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి విద్యా ప్రమాణాలు మెరుగుపరుస్తామన్నారు. రాబోయే నాలుగేళ్లలో 'ఏపీ మోడల్ ఎడ్యుకేషన్' సాధించడమే లక్ష్యమని పేర్కొన్నారు. విద్యాశాఖపై శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ చేపట్టామని చెప్పారు. టీచర్ల బదిలీలు, పదోన్నతులు కూడా ప్రారంభించామని, 27 వేల మంది స్కూల్ అసిస్టెంట్లను బదిలీల చట్టంతో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా బదిలీ చేశామని తెలిపారు. 4వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించామని గుర్తుచేశారు. నూరుశాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా 'అక్షర ఆంధ్ర' పేరుతో ప్రత్యేక కార్యక్రమం రూపొందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 15-59 ఏళ్లవారిలో 81లక్షల మంది నిరక్షరాస్యులుగా ఉండటంపై మంత్రి విస్మయం వ్యక్తం చేశారు. వయోజన విద్యలో దేశంలో ఏపీ అట్టడుగున ఉందని, దీన్ని విషన్ మోడ్‌లో చేపట్టాలని ఆదేశించారు. ఈ ఏడాది 3.95 లక్షల మందికి అక్షరాస్యత పరీక్షలు నిర్వహించగా, 3.53 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వయోజన విద్య విభాగంలో 109 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు చెప్పడంతో పాఠశాల విద్యాశాఖ నుంచి తీసుకొని భర్తీ చేయాలని మంత్రి సూచించారు. రాబోయే మూడేళ్లలో అక్షరాస్యతలో టాప్-3లో ఏపీ ఉండాలని స్పష్టం చేశారు. అవసరాలకు అనుగుణంగా స్కిల్లింగ్ ఎకో సిస్టమ్ ఏర్పాటు చేయాలని, 'నైపుణ్యం' యాప్‌ను అప్‌గ్రేడ్ చేయాలని ఆదేశించారు. నైపుణ్యం పోర్టల్‌లో అభ్యర్థుల నమోదు, శిక్షణ, సామర్థ్య పరీక్షలు, సర్టిఫికేషన్, ఉద్యోగాల కల్పన, పరిశ్రమలతో అనుసంధానం తదితర వివరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. సెక్టార్ల వారీగా ఉద్యోగాలు, జాబ్‌మేళాలు కూడా అప్‌డేట్ చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రానికి మంజూరైన 125 ఆటిజం కేంద్రాలను వీలైనంత త్వరగా ప్రారంభించడంతో పాటు వాటిలో నిపుణులను నియమించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వర్సిటీలకు ఏకీకృత చట్టం తేవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఐఎస్‌బీ, ట్రిపుల్ ఐటీ, ఇఫ్లూ, సౌత్ ఏషియన్ యూనివర్సిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్-రీసెర్చ్ ఏర్పాటుపై చర్చించారు.

స్టెమ్ ల్యాబ్ కిట్ల పరిశీలన

వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలకు అందించే వివిధ రకాల కిట్లను లోకేశ్ పరిశీలించారు. రాష్ట్రంలో 222 పీఎంశ్రీ పాఠశాలలకు స్టెమ్ ల్యాబ్ కిట్లు ఇవ్వనున్నారు. ఒక్కో కిట్‌లో 335 వస్తువులు ఉంటాయి. రీసెర్చ్, కాన్సెప్ట్ ఓరియెంటెడ్‌గా రూపొందించిన ఈ వస్తువులు విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం అంశాల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి దోహదపడనున్నాయి. వీటితోపాటు స్కూళ్లకు అందించే లైబ్రరీ పుస్తకాలు, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి రూపొందించిన జాదు పిటారా కిట్, ఎఫ్ఎల్ఎన్ ప్రింట్ రిచ్ మెటీరియల్స్, ఎఫ్ఎల్ఎన్ హ్యాండ్ మేడ్ మెటీరియల్స్‌ను కూడా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా రామవరప్పాడు ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఎం.మస్తాన్‌రావు, విజయవాడ పటమట ఎంపీయూపీ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న ఓ.నిహారిక గీసిన డ్రాయింగ్స్‌ను లోకేశ్‌కు అధికారులు బహూకరించారు.


పాఠశాలలకు అందజేయనున్న కిట్‌లను పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్

విద్యార్థులకు 'షైనింగ్ స్టార్'

- 9న టెన్త్, ఇంటర్ టాపర్లకు అవార్డులు

పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను 'షైనింగ్ స్టార్' అవార్డుతో సన్మానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రస్థాయి టాపర్లను ఇప్పటికే మంత్రి లోకేశ్ సన్మానించగా జిల్లా, మండల స్థాయిల్లోనూ ఈ అవార్డులు ఇవ్వనున్నారు. దీనిపైపాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదో తరగతిలో కనీసం 500 (83.33%) మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులు. ప్రతి మండలంలో ఓసీ, బీసీల నుంచి ఇద్దరు చొప్పున, ఎస్సీ, ఎస్టీల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఎంపిక చేస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల్లో జిల్లా యూనిట్‌గా 70శాతం మార్కులు దాటిన ముగ్గురికి ఈ అవార్డులు ఇస్తారు. పదో తరగతిలో ప్రభుత్వ పరీక్షల విభాగం, ఇంటర్‌లో ఇంటర్ బోర్డు టాపర్లను ఎంపిక చేస్తాయి. ఒక్కో విద్యార్థికి రూ.20వేలు నగదు, సర్టిఫికెట్, మెడల్ అందజేస్తారు. ఈ నెల 9న 26 జిల్లాల్లో కలెక్టర్లు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రుల ఆధ్వర్యంలో అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. పదో తరగతిలో 4,169 మంది, ఇంటర్‌లో 919 మందికి అవార్డులు ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

ఎస్జీటీల బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్!

- డివిజన్, మండలం, క్లస్టర్ల వారీగా ఖాళీల వర్గీకరణ

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ) బదిలీలను వెబ్ కౌన్సెలింగ్ ద్వారానే చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ ప్రాథమికంగా నిర్ణయించింది. మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్న నేపథ్యంలో వెబ్ కౌన్సెలింగ్‌పై శుక్రవారం అవగాహన వీడియో విడుదల చేసింది. ఈ వీడియోలో వెబ్ కౌన్సెలింగ్ విధానాన్ని మూడు కేటగిరీలుగా వర్గీకరించినట్లు తెలిపింది. గతంలో అన్ని ఖాళీలు ఒకే జాబితాగా కనిపించే పద్ధతి ఉండగా... ఇప్పుడు డివిజన్, మండలం, క్లస్టర్ల వారీగా వర్గీకరించి చూపుతోంది. టీచర్ తొలి ప్రాధాన్యం కింద ఏ డివిజన్, మండలం, క్లస్టర్ కావాలో ఎంపిక చేసుకుంటే అక్కడి పాఠశాలల్లోని ఖాళీలు మాత్రమే కనిపిస్తాయి. అలాగే మండల కేంద్రం నుంచి ఆ పాఠశాల ఎంత దూరంలో ఉందో కూడా అందులో చూపిస్తున్నారు. తప్పనిసరిగా బదిలీ కావాల్సినవారు అన్ని డివిజన్లను ఎంపిక చేసుకుని ఆప్షన్లు పెట్టుకోవాలని, రిక్వెస్ట్ బదిలీ కోరుకునేవారు తమకు కావాల్సిన డివిజన్‌లో ఆప్షన్లు పెట్టుకోవాలని సూచిస్తోంది. దీనిపై ఉపాధ్యాయుల అభిప్రాయాలు స్వీకరించి ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఉపాధ్యాయుల బదిలీల చట్టంలో వెబ్ ఆధారంగానే బదిలీలన్నీ జరుగుతాయని పేర్కొన్నారు.

సాంఘిక సంక్షేమశాఖలో బదిలీలు

- పలువురు డీడీలు, డీఎస్‌డబ్ల్యూఓలకు స్థానచలనం

రాష్ట్రవ్యాప్తంగా పలువురు డిప్యూటీ డైరెక్టర్లు, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారులను (డీఎస్‌డబ్ల్యూఓ) బదిలీచేస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. గుంటూరు డిప్యూటీ డైరెక్టర్ డి.మధుసూదనరావును శ్రీకాకుళం జిల్లాకు, అక్కడ పనిచేస్తున్న వై.విశ్వమోహన్‌రెడ్డిని ఏలూరుకు, డైరెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎం.అన్నపూర్ణమ్మను విజయనగరానికి, తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తున్న ఎంఎస్ శోభారాణిని కాకినాడకు, చిత్తూరు డీఎస్‌డబ్ల్యూఓ యు.చెన్నయ్యను గుంటూరు డీడీగా స్థానచలనం చేశారు. డైరెక్టరేట్‌లో పనిచేస్తున్న డీఎస్‌డీబ్ల్యూఓ జె.విక్రమ్‌కుమార్‌రెడ్డిని చిత్తూరు డీడీగా నియమించి, తిరుపతి జిల్లాకు అదనంగా డీఎస్‌డబ్ల్యూఓ బాధ్యతలు అప్పగించారు. డీఎస్‌డబ్ల్యూ బి.రాధికను కర్నూలు డీడీగా, పార్వతీపురం మన్యం జిల్లా డీఎస్‌డబ్ల్యూఓ ఎండీ గయాజుద్దీన్‌ను తూర్పుగోదావరి డీఎస్‌డబ్ల్యూఓగా, ఎన్టీఆర్ జిల్లా డీడీ కేఎస్ శిరోమణిని డైరెక్టర్ కార్యాలయంలో డీడీగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

మట్టి మేత

ప్రజాప్రతినిధుల గుత్తాధిపత్యం నుంచి సహజ వనరులను విముక్తిచేసి.. వివాదంలో ఉన్న లీజుల పంచాయితీలు సెటిల్ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే వదిలేస్తే రాజధాని ప్రాజెక్టులతో పాటు ప్రజల అవసరాలు కూడా తీరే అవకాశం ఉండదని చెబుతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

గ్రావెల్, బిల్డింగ్, రోడ్ మెటల్ మైన్ లీజులు వారి చేతుల్లోకి వెళ్లిపోయాయి. నిర్మాణ, ఇతర ప్రాజెక్టులకు రోడ్, బిల్డింగ్ మెటల్ దొరకాలంటే వారి దయ ఉండాల్సిందే. దీంతో ప్రజలతో పాటు ప్రభుత్వ ప్రాజెక్టులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో రాజధాని అమరావతి నిర్మాణ పనులు మౌలిక వనరుల కొరతతో వేగం పుంజుకోలేకపోయినా, మధ్యలో ఆటంకాలు ఏర్పడినా ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి ఉంటుంద ని అధికార వర్గాలు చెబుతున్నాయి.

జగన్ జమానా నుంచి..

ఇల్లు, ఇతర నిర్మాణాలకు అవసరమైన వనరులను ప్రభుత్వం నిర్దేశించిన వ్యక్తులు లేదా లీజుదారుల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకోవాలి. జగన్ జమానా నుంచి పరిస్థితులు మారాయి. ప్రజాప్రతినిధులు, నేతలు ఆ వనరులపై కన్నేశారు. లీజులు ఎవరి పేరు మీదున్నా, కాంట్రాక్ట్ ఎవరికి వచ్చినా తమ కనుసన్నల్లోనే వ్యాపారం నడవాలని శాసించారు. కొందరయితే మరో అడుగు ముందుకేసి లీజులున్న మైన్‌లనే తమ అధీనంలో ఉంచుకుని వ్యాపారాలను సొంతం చేసుకున్నారు. గతంలో ఓ ముఖ్య పోస్టులో ఉన్న ఐఏఎస్ పుత్రరత్నం, అల్లుడు, ఓ ఎంపీ కుమారుడు.. ఇలా అనేక మంది చీకటి దందా చేశారు. విశాఖపట్నం, గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాల్లోని కొండలు, గుట్టలు, క్వారీలను హస్తగతం చేసుకున్నారు. దీంతో వ్యాపారం ఒకరిది.. సొమ్ము వారిదన్నట్లుగా సాగిపోయింది. ఇక జగన్ సర్కారు చేసిన ఇసుక వ్యాపారం వల్ల రాష్ట్రం, ప్రజలు సకలం నష్టపోయారు. రూ.వేల కోట్ల దోపిడీ జరిగింది.

నేతల కనుసన్నల్లో..

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఇసుకను ఉచితం చేసింది. వ్యాపార, వాణిజ్య అవసరాలకు నిర్దేశిత ధరకు విక్రయిస్తోంది. జగన్ హయాంలో జరిగిన ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకుంది. అయితే కొందరు ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి తెలియకుండా సొంతంగా రీచ్‌లు ఏర్పాటు చేసుకొని దందా సాగిస్తున్నారు. ముఖ్యమంత్రి హెచ్చరికలను కూడా పట్టించుకోనంతగా చెలరేగిపోతున్నారు. గ్రావెల్ (ఎర్రమట్టి), బిల్డింగ్, రోడ్ మెటల్ (రాయి, కంకర) మైన్ లీజులను కూడా నేతలే దక్కించుకున్నారు. గతంలో ఉన్న లీజుదారులను బెదిరించి తమ నియంత్రణలోకి తీసుకున్నారు. దీంతో వాటి ధరలను బంగారం ధరతో పోటీ పడేలా పరుగులు పెట్టిస్తున్నారు. నియోజకవర్గం, మండలం, గ్రామం వారీగా కొందరు నేతలు సహజ వనరులైన కొండలు, గుట్టలు, మట్టి నిల్వలున్న భూములను చెరపట్టారు. గనుల శాఖ జారీ చేసిన లీజులు, మైనింగ్ పర్మిట్లతో సంబంధం లేదు. 'మా వ్యాపారం మాదే' అన్నట్లుగా బరితెగించి సహజ వనరులను బ్లాక్ చేశారు. కృత్రిమ కొరత సృష్టించడంతో మట్టి, రోడ్, బిల్డింగ్ మెటల్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఈ భారాన్ని సామాన్యుడు మోయాల్సి వస్తోంది. ప్రభుత్వానికైనా సులువుగానే మట్టి, రోడ్‌మెటల్ లభిస్తోందా అంటే.. లేదనే చెప్పాలి.

ఇలాగైతే అమరావతికి ఎలా?

అమరావతి రాజధాని పనుల కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని లీజులను ప్రభుత్వం సిద్ధం చేసి పెట్టింది. కోటిన్నర క్యూబిక్ మీటర్ల మేర ఇసుక కావాలని ఇప్పటికే సీఆర్‌డీఏ డిమాండ్ లేఖ ఇచ్చింది. ఇక ఎర్రమట్టి అయితే రాజధాని పనుల కోసం కనీసం 10 కోట్ల క్యూబిక్ మీటర్లపైనే అవసరమని అంచనా వేశారు. ఈ మేరకు ముందుగానే రిజర్వ్ చేసి పెట్టుకోవాలని సూచించారు. ఇదంతా ఒక్క గుంటూరు జిల్లా నుంచే తీసుకోవడం కష్టం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రత్యేకించి సీఆర్‌డీఏ ప్రాంతంలో ఎర్రమట్టికి తీవ్ర కొరత ఉంది. అక్కడ ఉన్నదంతా నల్లమట్టినే. దాన్ని ఇంటి నిర్మాణంతో పాటు మౌలిక వనరుల ప్రాజెక్టులకు అసలు వాడలేరు. కాబట్టి ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉన్న వనరులపై ఆధారపడక తప్పదు. గన్నవరం, బాపులపాడు, అగిరిపల్లి, నందిగామ, జగయ్యపేట, కంచికచర్ల, నూజివీడు, విజయవాడ రూరల్ మండలాల్లో ఎర్రమట్టి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. కానీ ఆయా ప్రాంతాల్లో వాటి లీజులను కొందరు ప్రజాప్రతినిధులు సొంతం చేసుకున్నారు. కృష్ణా జిల్లా పరిధిలో నలుగురు ప్రజాప్రతినిధులు గ్రావెల్ లీజులను నియంత్రిస్తున్నారు. వారిలో కొత్తగా ఎన్నికైన ఓ ప్రజాప్రతినిధి కూడా ఉన్నారు. భవన నిర్మాణంతో పాటు రహదారులు, ఇతర కీలక ప్రాజెక్టులకు ఉపయోగపడే రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్ వంటివి ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో జి.కొండూరు, ఎ.కొండూరు, ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, జగయ్యపేట, చందర్లపాడు, మైలవరం తదితర మండలాల పరిధిలో భారీగా లీజులున్నాయి. ఇప్పుడు ఇవి ఎక్కువగా ప్రజాప్రతినిధులు, వారి అనుచరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. పేరుకే లీజుదారుల పేరిట ఉన్నాయి. కానీ నడిపించేది, వ్యాపారంతో పాటు చీకటి దందా చేస్తోంది కొందరు నేతలే. దీంతో ఈ సూక్ష్మ ఖనిజాల సరఫరా విషయంలో ఇసుకను మించిన కష్టాలు ఇప్పుడు వెంటాడుతున్నాయి. అమరావతి ప్రాజెక్టులకు సీఆర్‌డీఏ పరిధిలోని లీజుల నుంచి రోడ్‌మెటల్‌ను సరఫరా చేయడానికి కొంత ఇబ్బంది లేకున్నా, గ్రావెల్ కొరత తీవ్రంగా వెంటాడనుందని గనుల శాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వం స్పందించాలి

గ్రావెల్, రోడ్‌మెటల్ విషయంలో ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని సానుకూల నిర్ణయం తీసుకోవాలని గనుల శాఖ ప్రభుత్వాన్ని కోరుతోంది. ఈ విషయంలో ఓ విధాన నిర్ణయం తీసుకోవాలని చెబుతోంది. ఇదే అంశంపై గనుల శాఖలో అంతర్గత చర్చ జరుగుతోంది. త్వరలో ఓ కీలక సమావేశం నిర్వహించనున్నారు. ప్రభుత్వం కూడా ఈ విషయంలో తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఇటు లీజుదారులు, అటు ప్రజలు, అమరావతి నిర్మాణ సంస్థలు కోరుతున్నాయి.

రెవెన్యూ వర్సెస్ అటవీ

అందుబాటులో పుష్కలమైన వనరులున్నా రెవెన్యూ అటవీ శాఖల మధ్య వివాదం కారణంగా వాటిని ఉపయోగించుకోలేని పరిస్థితి. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ ఉమ్మడి కృష్ణా జిల్లాలోని జి.కొండూరు మండలం కడిమిపోతవరం, లోయలోని సర్వే నంబర్ 26-2లోని లీజులే. ఇక్కడ మైనింగ్ లీజులను గనుల శాఖ కొన్ని దశాబ్దాల కిందటే కంపెనీలకు కేటాయించింది. రికార్డుల్లో రెవెన్యూ పోరంబోకు భూమి అని ఉండటంతో గనుల శాఖ లీజులు ఇచ్చింది. అయితే ఆ భూమి తనదని అటవీ శాఖ అభ్యంతరాలు తెలపడంతో మైనింగ్ నిలిచిపోయింది. దీన్ని పరిష్కరించాల్సింది ప్రభుత్వమే. ఆ భూమి రెవెన్యూదా? లేక అటవీ శాఖదా? అన్నది తేల్చి సత్వరమే పరిష్కరించాలి. ఆ పని చేయకపోవడంతో అక్కడున్న విలువైన గ్రావెల్, రోడ్‌మెటల్ లీజులు వృథాగా పడి ఉంటున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సమస్యను పరిష్కరిస్తే అమరావతి రాజధాని నిర్మాణం, కృష్ణా జిల్లా ప్రాజెక్టులకు అవసరమైన గ్రావెల్, రోడ్ మెటల్ అవసరాలను ఈ లీజు తీర్చగలదని గనుల శాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం రెవెన్యూ శాఖను ఆదేశిస్తే ఈ సమస్య వారంలో సెటిల్ అవుతుందని గనుల శాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే సహజ వనరులున్న ఇలాంటి వివాదాస్పద భూములు 20కి పైగా ఉన్నాయి.



గతం గుర్తు లేదా జగన్?

జనాన్ని భయపెట్టేలా కొవిడ్‌పై రోతరాతలు

- బ్లీచింగ్ చల్లాలని..పారాసిట్మాల్ వేసుకోవాలని నాడు జగన్ సలహా
- కొవిడ్ సమస్యేకాదని ప్రకటించి నవ్వులపాలు
- మాస్క్‌లు అడిగిన డాక్టర్‌కు చిత్రహింసలు
- రెండో దశలో తీవ్రత తక్కువే.. అయినా యాగీ

(అమరావతి, ఆంధ్రజ్యోతి)



రాష్ట్రంలో కరోనా కేసులు పెరిగిపోతున్నా కూటమి సర్కారు మాత్రం చోద్యం చూస్తోందంటూ మాజీ సీఎం జగన్ తెగ ఆందోళన పడిపోతున్నారు. కొవిడ్‌పై చంద్రబాబు చలించడంలేదంటూ గగ్గోలు పెడుతున్నారు. కొవిడ్ అసలు సమస్యే కాదని తన హయాంలో మాట్లాడి నవ్వులపాలైన జగన్.. అధికారం పోగానే కొవిడ్‌పై ప్రజల్ని భయపెట్టేలా తన రోతపత్రికలో రాతలు రాయిస్తున్నారు. నిజానికి, కొవిడ్ రెండోదశలో కేసులు, తీవ్రత.. రెండూ తక్కువే. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ ఆస్పత్రులను ప్రభుత్వం సిద్ధం చేసి ఉంచింది. వాస్తవం ఇది కాగా, కొవిడ్ సమస్యపై 'సర్కారు చోద్యం' చూస్తుందంటూ జగన్ రోతపత్రిక బురద చల్లే ప్రయత్నం చేసింది. నిజానికి, జగన్ సీఎంగా ఉండగానే ప్రపంచమంతా కొవిడ్ మహమ్మారి విజృంభించింది.

రాష్ట్రంలోనూ కేసులు పెరిగిపోయాయి. ఈ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి నుంచి ఎవరైనా ఏం కోరుకుంటారు? కాస్తంత ప్రభుత్వ భరోసా... మరింత ఆరోగ్య ఆసరా. కానీ దీనికి భిన్నంగా క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో నాడు జగన్ మాట్లాడారు. కొవిడ్‌కు భయపడాల్సిన పనిలేదు ..బ్లీచింగ్ చల్లితే .. పారాసిట్మాల్ వేసుకుంటే పోతుందంటూ ఆయన తేలిగ్గా మాట్లాడారు. ఒకవైపు జనాలు పిట్టల్లా రాలిపోతుంటే .. కరోనా బారినపడ్డ రోగులతో ఆస్పత్రులన్నీ నిండిపోతుంటే .. నిమిషాల వ్యవధిలోనే ప్రాణాలు గాల్లో కలిసిపోతుంటే..జగన్ నిర్వాకం ఆనాడు ఇలా ఉంది. దీంతో ఆయనపై ఆగ్రహావేశాలు పెల్లుబుకాయి. దళిత సామాజికవర్గానికి చెందిన ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ సుధాకర్ మాస్క్‌ను ఇవ్వాలని కోరిన పాపానికి నడిరోడ్డుపై పెడరెక్కలు విరిచికట్టి ఆనాడు పోలీసులు కొట్టారు. డాక్టర్ సుధాకర్‌ను చిత్రహింసలకు గురి చేశారు. చివరికి ఆయన మానసిక క్షోభకు గురై మృతి చెందారు. జగన్ హయాంలో కొవిడ్ నివారణకు ప్రత్యేకంగా చేపట్టిన చర్యలు కనిపించవు. ఆక్సిజన్, మాస్కులు అందుబాటులో లేవు. దీంతో రాష్ట్రంలో వేలాదిగా కరోనాబారిన పడి మృతిచెందారు. దేశంలో ఇప్పుడిప్పుడే కరోనా రెండో దశ వ్యాప్తి చెందుతోంది. దీనిని మొదట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీరియస్‌గానే తీసుకున్నాయి. కానీ వైరస్ తీవ్రత పెద్దగా లేకపోవడంతో .. కాస్త ఊపిరి పీల్చుకున్నాయి. అయినా, రాష్ట్రంలో కరోనా పరీక్షలు ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనూ, ప్రభుత్వాస్పత్రుల్లోనూ చేస్తున్నారు. కరోనా లక్షణాలు గుర్తిస్తున్నారు.

కొసమెరుపు: కరోనా సమయంలో రాజకీయ పార్టీలు, నేతలు సామూహిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి. ఒకవైపు కరోనా తీవ్రం అయిందని అంటూనే, గత ఏడాది ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4వ తేదీని (బుధవారం) 'వెన్నుపోటు దినోత్సవం'గా జరపాలని మరోవైపు పిలుపునివ్వడం జగన్‌కే చెల్లింది.

రాష్ట్రంలో మరో రెండు కొవిడ్ కేసులు

- కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో నమోదు

కర్నూలు హాస్పిటల్/నెల్లూరు(వైద్యం), జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో రెండు కొవిడ్ కేసులు నమోదయ్యాయి. కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ఈ వైరస్ బారిన పడ్డారు. కర్నూలు రూరల్ మండలం పసుపుల గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతి దగ్గు, జ్వరంతో బాధపడుతూ జీజీహెచ్‌కు వచ్చింది. ఆమెకు ఆర్‌టీపీసీఆర్ పరీక్ష నిర్వహించగా.. శుక్రవారం కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో బాధిత యువతిని కొవిడ్ వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు కర్నూలు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ డి.శ్రీరాములు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో కొవిడ్ యాక్టివ్ కేసుల సంఖ్య 8కి చేరింది. అలాగే నెల్లూరులోని మూలాపేటకు చెందిన 22 ఏళ్ల యువకుడికి కరోనా సోకింది. అయితే తీవ్రత తక్కువగా ఉండడంతో బాధితుడిని హోంఐసోలేషన్‌లోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. కాగా, జిల్లాల్లో గురువారం ఆరు పాజిటివ్ కేసులను గుర్తించారు. ఆయా కేసులకు సంబంధించి బాధితులతో సన్నిహితంగా ఉన్న వారిని వైద్యాధికారులు గుర్తించి పరీక్షలు నిర్వహించారు. 27 మందికి ఈ పరీక్షలు చేయగా, ఒకరికి కొవిడ్ ఉన్నట్లు తేలింది. కొవిడ్ కేసులు పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

మరో నాలుగు రోజులు ఉక్కపోతే

- 10న బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- ఆ తరువాత రెండు రోజుల్లో అల్పపీడనం
- 12 తరువాతే 'నైరుతి'లో కదలిక



విశాఖపట్నం, అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి కర్ణాటక, తెలంగాణ మీదుగా కోస్తాంధ్ర వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. దీనికితోడు పడమర దిశ నుంచి పొడిగాలులు వీస్తున్నాయి. దీంతో కోస్తాలో అనేకచోట్ల వేడి, ఉక్కపోత కొనసాగాయి. శుక్రవారం జంగమహేశ్వరపురంలో 41, కావలిలో 40.6, నెల్లూరులో 40.4, ఒంగోలులో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే అక్కడక్కడా క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. రానున్న రెండు రోజుల్లో ఎండ తీవ్రత కొనసాగి వేడి వాతావరణం నెలకొంటుందని, చెదురుమదురుగా వానలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలావుండగా ఈనెల 10న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించనున్నదని, దాని ప్రభావంతో ఆ తరువాత రెండు రోజుల్లో అల్పపీడనం ఏర్పడుతుందని స్కైమెట్ తెలిపింది. దీంతో ఈనెల 12 తరువాత నైరుతి రుతుపవనాల్లో కదలిక వస్తుందని పేర్కొంది. గత నెల 24న కేరళలో ప్రవేశించిన రుతుపవనాలు 29 నాటికి పశ్చిమబెంగాల్ వరకూ విస్తరించి, తరువాత నిలిచిపోయాయి. గడచిన ఎనిమిది రోజుల నుంచి పడమర గాలులు వీస్తుండడంతో దక్షిణ భారతం దానికి ఆనుకుని మధ్య, తూర్పు భారతాల్లోని అనేక ప్రాంతాల్లో తేమకు బదులు పొడి వాతావరణం నెలకొంది. దీంతో రుతుపవనాలు ముందుకువెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. కాగా ఈనెల 12న ఏర్పడనున్న అల్పపీడనంతో రుతుపవనాల్లో కదలిక వచ్చి మధ్య, తూర్పు భారతంలో పలు ప్రాంతాలకు విస్తరిస్తాయని వాతావరణ నిపుణులు వెల్లడించారు. అప్పటివరకూ రాష్ట్రంలో ఎండలు కొనసాగుతాయని, మధ్యాహ్నం తరువాత అక్కడక్కడా ఉరుములు, పిడుగులతో వానలు కురుస్తాయని పేర్కొన్నారు. విజయనగరం, మన్యం, అల్లూరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఎండ తీవ్రత కొనసాగే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.